జనవరి
2022

189

సంపుటి : 16 సంచిక : 8 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

శాస్త్రీయాభివృద్ధి - మతోన్మాదం

ఎల్‌డిఎఫ్ నిర్మాణమే ప్రధాన కర్తవ్యం

ప్రజాపునాది సమస్యకు పరిష్కారం ఏమిటి?

బౌద్ధ ధర్మం

1921 భారత జాతీయ కాంగ్రెస్ కోసం కమ్యూనిస్టు పార్టీ రచించిన ప్రణాళిక

బ్రిటీష్ వలసపాలనకు నకలు మోడి పాలన

మహమ్మారితో పెరిగిన ఆర్థిక అంతరాలు

'వ్యవసాయ సంక్షోభం కారణాలపై చర్చ జరగాలి'

ఆన్‌లైన్ విద్యతో బడికి దూరమైన చిన్నారులు

రైతాంగంలో పార్టీ కర్తవ్యాలు

# రైతాంగంలో పార్టీ కర్తవ్యాలు

**1954** ఏప్రిల్‌లో జరిగిన కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సమావేశం 'రైతాంగంలో కర్తవ్యాలు' తీర్మానాన్ని ఆమోదించింది. " 'భూ పరిమితి', 'తిరిగి వ్యవసాయం ప్రారంభించే హక్కు', కౌలు తగ్గింపు, పన్నుల భారం, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు, అప్పులు, కమతాల మదింపు, కమతాల విభజనను నివారించడం, సహకార సంఘాల ఏర్పాటు, పంచాయతీలు, సాగునీటి సదుపాయాలు, వ్యవసాయ కార్మికుల డిమాండ్లు , రైతు సంఘాలను నిర్మించడం, ఉన్న సంఘాలను చైతన్యపరచడంలో ఎదురవుతున్న సాదక బాధకాలను ఈ తీర్మానం చర్చించింది." రైతాంగ ఉద్యమంలో పార్టీ పనిని గైడ్ చేయటం కోసం ఈ సమస్యలన్నిటి పై నిర్దిష్టమైన నిర్ణయాలు చేసింది; తీర్మానం లోని కొన్ని భాగాలు:

" 'పురాతన భూస్వామ్య విధానమే ఈనాడు ఉత్పత్తికి పెద్ద ఆటంకంగా ఉన్నది. భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగం ఐక్య పోరాటాలు చేయడం ద్వారానే ఈ వ్యవస్థను మార్చడం సాధ్యపడుతుంది. అందువలన ఈ పోరాటాలకు అనువైన నినాదాలు, వ్యూహాలను రూపొందించుకోవాలి. రైతాంగాన్ని, వ్యవసాయ కూలీలను పోరాటాలలోకి దించడం, తద్వారా వారు భూమి సాధించుకోవడం వలన వ్యవసాయోత్పత్తులు పెరుగుతాయి. భూస్వాములు అక్కడక్కడ ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించడం ద్వారా వ్యవసాయోత్పత్తులను పెంచటం సాధ్యం కాదు.

"భూ పరిమితిని నిర్ణయించి, పరిమితికి మించిన అదనపు భూమిని స్వాధీనం చేసుకొని వ్యవసాయ కార్మికులు, రైతులకు ఉచితంగా పంచాలన్న డిమాండ్‌ను మనం బాగా ప్రచారం చేయాలి.

" ఒక ధనిక రైతు పొందుతున్నంత ఆదాయం పొందటానికి అవసరమైనంత భూమిని సీలింగ్ పరిమితిగా నిర్ణయించాలి. అదే సమయంలో వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు పంచడానికి భూమి లేకుండా ఉండేలా సీలింగ్ పరిమితిని నిర్ణయించకూడదు.

"ఈ సూత్రం ఆధారంగా కిసాన్‌సభ సహకారంతో పార్టీ ఆయా ప్రాంతాల వాస్తవ పరిస్థితులను పరిగణనలోనికి తీసుకుని, రైతాంగంతో సంపూర్ణంగా చర్చలు జరిపి, వివిధ ప్రాంతాలకు తగిన విధంగా భూ పరిమితిని నిర్ణయించాలి.

"భూ పరిమితులకు లోబడే భూమి కలిగి ఉన్నప్పటికీ, వ్యవసాయం చేయకుండా భూమిని కౌలుకిచ్చిన భూస్వాములు తమ భూమిని తామే సాగుచేసుకుంటామని ముందుకొచ్చినప్పటికీ, వారికి భూమిని స్వాధీన పరుచుకునే హక్కు ఉండకూడదని మనం డిమాండ్ చేయాలి. ఇందువలన సాగు చేసుకుంటున్నవారిని భూమి నుండి తొలగించవలసి వస్తుంది. భూమిని కోల్పోయినందుకు వీరికి పరిహారం ఇవ్వవచ్చు; లేదా నిజంగా వ్యవసాయం చేసుకునే ఇతర రైతాంగంతో కలిసి సయోధ్యగా ఉండేటట్లయితే, వీరికి కూడా మిగులు భూమిని పంచి ఇవ్వవచ్చు. ఇనాందారుల లాంటి చట్టబద్ధంగా భూమిపై హక్కులు ఉండి, తరతరాలుగా వ్యవసాయం చేయని వారితో ఇటువంటి సమస్యలు వస్తాయి.

" భూములున్న కొన్ని కుటుంబాలు కుటుంబ కమతం కన్నా తక్కువ భూమిని కలిగి ఉంటారు; (ఫ్యామిలి హోల్డింగ్ అంటే ఒక ఎడ్ల జతని, వ్యవసాయ పనుల కాలంలో కూలీలను నియమించుకుంటూ, భార్యాభర్తలు తమ శ్రమ ద్వారా భూమిని సాగు చేసుకొంటుంటారు. కొన్ని ప్రాంతాల్లో ఆ భూమే వారికి నిర్దిష్టమైన జీవనానికి అవసరమైన ఆదాయాన్ని ఇస్తుంటుంది) తమంత తామే వ్యవసాయం చేసినా తగిన ఆదాయం రాకపోవడంతో వారు ఆ భూమిని కౌలుకిచ్చి ఉండవచ్చు; లేదా సొంత భూమిపై సరిపడా ఆదాయం రాకపోవడం వలన వారు వేరే ఉపాధి వెతుక్కుని ఉండవచ్చు, లేదా పట్టణాలలో గాని, పల్లెలలో గాని వ్యాపారాలు చేస్తుండవచ్చు. అటువంటి వారు సర్వసాధారణంగా ఏ పరిశ్రమలలోనో కార్మికులు అయి ఉండవచ్చు, లేదా చిన్న వ్యాపారాలు, తక్కువ ఆదాయం గల వృత్తిదారులు అయిఉండవచ్చు. వీరిని భూస్వాములుగా పొరబడకూడదు. వీరి పరిస్థితులు పూర్తిగా భిన్నమైనవి.

"ఇటువంటి చిన్న కమతాలు కలిగిన వారు వ్యవసాయాన్నే ప్రధాన ఉపాధిగా చేసుకొంటే, తమ భూములను స్వంతంగా సాగుచేసుకోవటం లేదా కౌలు చట్టం ప్రకారం తక్కువ కౌలు తీసుకొంటూ, నిర్దిష్ట కాలం కౌలుకి ఇచ్చే అవకాశాన్నివ్వాలి; లేదా భూమిని కౌలురైతుకు ఇచ్చి, ప్రభుత్వమే మార్కెట్ ధర ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలి. చిన్న భూ కమతాలు కలిగిన రైతులకు, కౌలు రైతులకు వివాదాలు తలెత్తితే రైతాంగంలో ఐక్యతని నిలబెట్టటం కోసం కిసాన్ ఉద్యమం చొరవ చేసుకుని రాజీ కుదర్చాలి. మంచి ఆదాయాలు, జీవన ప్రమాణాలు కలిగిన వృత్తులు చేసుకుంటున్నవారి భూమికి తక్కువ కౌలు, తక్కువ పరిహారం చెల్లించాలి. కానీ భూమిని తిరిగి తీసుకొని, స్వంతంగా సాగుచేసుకొనే హక్కు వారికి ఉండకూడదు.

" కౌలుదారులను భూముల నుండి తొలగించటానికి వ్యతిరేకంగా, (కౌలుదారులు చెల్లించవలసిన) కౌలు తగ్గించాలని పోరాడడం పార్టీ ముందున్న తక్షణ కర్తవ్యం. ...భూముల నుండి తొలగించడానికి, అధిక కౌలు వసూళ్లకు వ్యతిరేకంగా పోరాటాలు, ఆందోళనలు చేస్తున్నప్పుడు ప్రస్తుతం అమలులో ఉన్న అన్ని వ్యవసాయ చట్టాలు, సదుపాయాలు, రాయితీలు ఎంత పరిమితమైనవైనా పార్టీ, కిసాన్ ఉద్యమం వాటిని సంపూర్ణంగా వినియోగించుకోవాలి.

"కౌలు రైతులు చెల్లించే కౌలు తగ్గించాలని, భూస్వామి నుండి కౌలుకి తీసుకున్న భూమి నిర్దిష్టకాలం కౌలుదారు చేతిలో ఉండాలని మనం డిమాండ్ చేస్తున్నది భూస్వాముల భూములకు సంబంధించి మాత్రమే". చెరకు, పొగాకు, వగైరా వాణిజ్య పంటలు పండించే ప్రాంతాలకు, చిన్న కమతాలున్న వారి నుండి భూస్వాములు కౌలుకి తీసుకొని, తక్కువ కౌలు చెల్లించే ప్రాంతాలకు ఇది వర్తించదు. ఇటువంటి ప్రాంతాలలో భూస్వాములు చిన్న రైతులకు చెల్లించే కౌలు పెంచాలని మనం డిమాండ్ చేయాలి.

" వ్యవసాయదారులలో వ్యవసాయ కార్మికులు అత్యంత పోరాట స్వభావం కలిగిన వారు. రైతాంగంలో 70 శాతంగా ఉన్న

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. రైతాంగంలో పార్టీ కర్తవ్యాలు ..... 2

2. శాస్త్రీయాభివృద్ధి - మతోన్మాదం
ప్రబీర్ పుర్కాయస్థ...... 4

3. ఎల్‌డిఎఫ్ నిర్మాణమే ప్రధాన కర్తవ్యం
ప్రకాశ్ కరత్ ..........9

4. ప్రజాపునాది సమస్యకు పరిష్కారం ఏమిటి?
ఎస్ వీరయ్య ........12

5. బౌద్ధ ధర్మం
ఎంవిఎస్ శర్మ ........14

6. భారత జాతీయ కాంగ్రెస్ 36వ వార్షిక సభలు (1921) కోసం కమ్యూనిస్టు పార్టీ రచించిన ప్రణాళిక ........17

7. బ్రిటీష్ వలసపాలనకు నకలు మోడి పాలన
అర్జున్ అప్పాదురై ..........23

8. మహమ్మారితో పెరిగిన ఆర్థిక అంతరాలు
సంజయ్ రాయ్ ..........25

9. 'వ్యవసాయ సంక్షోభం కారణాలపై చర్చ జరగాలి'
ప్రొ. జగ్మోహన్ సింగ్ ..........27

10. ఆన్‌లైన్ విద్యతో బడికి దూరమైన చిన్నారులు
మీనా టి పిళ్లై ..........29



**సంపాదకుడు :**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం :**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 9490099333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com


# ప్రమాదం

పెట్టుబడికి ప్రజల ప్రాణాలతో పనిలేదు. దానికి కావలసినదల్లా లాభమే. మందులు అమ్మితే లాభాలొస్తాయనుకుంటే పెట్టుబడిదారుడు మందుల పరిశ్రమ పెడతాడు. అందులో లాభాలు రావనుకుంటే శవపేటికలు అమ్మితే లాభాలొస్తాయనుకుంటే అందులోకి మారిపోతాడు గానీ మందులు ఉత్పత్తి చేసి ప్రజల ప్రాణాలు కాపాడదలుచుకోడు అని కారల్‌మార్క్స్ వివరించాడు. అటువంటి పెట్టుబడిదారీ దురాశ నేటి కరోనా కాలంలో మన కళ్లకు కడుతోంది. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని ఆవహించి రెండేళ్లు పూర్తి కావస్తోంది. మహమ్మారి వెలుగు చూసిన తరువాత కొద్ది మాసాల్లోనే శాస్త్ర ప్రపంచం దాని ఆనుపానులు కనుక్కొన్నది. శాస్త్రవేత్తలు రంగంలోకి దిగి అనేక రకాల వ్యాక్సిన్‌లు కనుగొన్నారు. కరోనా వైరస్‌కు మందు లేదు, వ్యాప్తి నిరోధించడానికి మాస్కులు ధరించడం, ప్రజల్లో రోగనిరోధక శక్తి పెంచడానికి ప్రపంచ ప్రజలందరికీ వీలైనంత త్వరగా వ్యాక్సిన్‌లు ఇవ్వడమొక్కటే మార్గమని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. అంతేకాదు దేశాల సరిహద్దులు కరోనాను ఆపలేవు. అందువల్ల ప్రపంచంలోని ధనిక, పేద దేశాలు, ఒక దేశంలోని ధనికులు, పేదలు అన్న తారతమ్యం లేకుండా అందరికీ, ఎంత త్వరగా వ్యాక్సిన్‌లు వేస్తే అంత మంచిది అని చెప్పింది. ఆలస్యం జరిగే కొద్దీ కొత్త వేరియంట్లు పుట్టుకు రావచ్చు, అవి మరింత భయంకరంగా వ్యాపించవచ్చు, ఇప్పుడున్న వ్యాక్సిన్‌ల ప్రభావం నుండి తప్పించుకుని వ్యాప్తి చెందవచ్చు అని హెచ్చరించింది.

రెండేళ్లు గడిచాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు నిజమయ్యాయి. పెట్టుబడిదారీ దేశాల్లోని బహుళజాతి సంస్థల లాభాపేక్ష ప్రపంచాన్ని మరోప్రమాదంలో పడేసింది. ప్రజల ప్రాణాల కోసం కాకుండా లాభాల కోసం వ్యాక్సిన్‌ల ఉత్పత్తికి పూనుకున్న బహుళజాతి ఫార్మా కంపెనీల ధనదాహం కరోనా వ్యాక్సిన్‌లు ప్రపంచ మంతటికీ, అన్ని వర్గాల ప్రజలకు చేరకుండా అడ్డుకున్నది. వ్యాక్సిన్‌ల ఉత్పత్తి, పంపిణీ డబ్ల్యుహెచ్‌ఓ కేంద్రంగా, దాని ద్వారా జరక్కుండా నాటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్డుకున్నాడు. అమెరికా, యూరప్ ఇతర ఖండాల్లోని ధనిక దేశాలు వ్యాక్సిన్‌లు ముందుగానే కొనేసి నిల్వ పెట్టుకున్నాయి. ఒకవైపు బహుళజాతి ఫార్మా కంపెనీల ధనదాహం, మరోవైపు ధనిక దేశాల స్వార్థం వ్యాక్సిన్‌ల శీఘ్ర ఉత్పత్తినీ, ఉత్పత్తి అయిన వాటి పంపిణీనీ అడ్డుకున్నాయి. ఫలితంగా రెండేళ్ల తరువాత నేటికీ ప్రపంచవ్యాప్తంగా మొత్తం 1200 కోట్ల డోస్‌లు అవసరం కాగా 800 కోట్ల వ్యాక్సిన్ డోస్‌లు మాత్రమే ఉత్పత్తి అయ్యాయి, వాటి పంపిణీలో కూడా తీవ్ర అసమానతలు వ్యక్తమవుతున్నాయి. 2021 చివరికి ధనిక దేశాల్లోని ప్రజల్లో మూడొంతుల మంది రెండు డోస్‌లు వ్యాక్సిన్ వేసుకోగా కింద స్థాయిలోని పేద దేశాల్లో కేవలం 8 శాతం మందికి మాత్రమే పూర్తి వ్యాక్సిన్ అందింది.

వ్యాక్సినేషన్ త్వరగా పూర్తి కాకపోవడంతో డబ్ల్యుహెచ్‌ఓ హెచ్చరించినట్లే కొత్త వేరియంట్లు పుట్టుకొచ్చాయి. నిన్నటి వరకు డెల్టా వేరియంట్ ప్రాణాలు తీసింది. నేడు ఒమిక్రాన్ వేరియంట్ శరవేగంగా ప్రపంచ మంతటా వ్యాపిస్తోంది. దీని రోగ తీవ్రత ఎంత, ప్రస్తుత వ్యాక్సిన్‌లు దీన్ని నిరోధించే రోగనిరోధక శక్తిని ఇవ్వగలవా అన్న విషయాలు ఇంకా పరిశోధనల్లో తేలాల్సి ఉంది. కానీ అది డెల్టా కన్నా 70 శాతం ఎక్కువ వేగంతో సంక్రమిస్తోందని మాత్రం తేలింది. ఈ వేరియంట్ వ్యాక్సినేషన్ తక్కువగా ఉన్న ఆఫ్రికా ఖండంలో ప్రారంభమై ప్రపంచమంతటా విస్తరిస్తోంది. ఇప్పటికే ప్రపంచంలో 29 కోట్లమంది కరోనా బారిన పడినట్లు, 55 లక్షల మంది చనిపోయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కానీ వాస్తవ సంఖ్యలు దీనికి అనేక రెట్లు అధికంగా ఉంటాయని భావిస్తున్నారు. ప్రపంచవ్యాపితంగా కొత్త వెల్లువ ప్రారంభమైంది. అమెరికా, యూరప్‌తో సహా అన్ని దేశాల్లో కేసులు మళ్లీ విపరీతంగా పెరుగుతున్నాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ కరోనాను, ఇటువంటి ఉపద్రవాలను కలిసికట్టుగా ఎదుర్కోలేదని తేలిపోయింది. ప్రపంచ వ్యాపితంగానే కాదు అయా దేశాల్లో కూడా సమర్థవంతంగా ఎదుర్కోలేకపోతోంది. అందుకే బాగా ధనిక దేశాలైన అమెరికా, ఐరోపాల్లో కరోనా మళ్లీ విజృంభిస్తోంది. దానికి భిన్నంగా సోషలిస్టు దేశాలు – చైనా, వియత్నాం, క్యూబా, ఉత్తర కొరియా కరోనా కట్టడిలో ముందున్నాయి. అందువల్ల నేడు ప్రపంచానికి ప్రమాదం కరోనాతో కాదు, కరోనాను ఎదుర్కోలేని పెట్టుబడిదారీ వ్యవస్థతో. మహమ్మారులు వస్తూనే ఉంటాయి. కానీ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే సామాజిక వ్యవస్థ– సోషలిజం ఉన్న చోట మాత్రమే ప్రజల ప్రాణాలకూ, వారి ఆర్థిక జీవనానికీ భద్రత ఉంటుందని కరోనా ప్రపంచానికి వెల్లడించింది. పేటెంట్ వ్యవస్థ ఆధిపత్యాన్ని సవాలు చేసే ప్రపంచవ్యాప్త ఉద్యమం నేటి తక్షణావసరం. బహుళజాతి ఆధిపత్యాన్ని ఎదిరించి, దేశ ప్రయోజనాలను పరిరక్షించగల ప్రత్యామ్నాయ నాయకత్వం కోసం మన దేశంలో ప్రజాఉద్యమ నిర్మాణం జరగాలి.

**ఈ మాసం ముఖ్యాంశం**

# శాస్త్రీయాభివృద్ధి - మతోన్మాదం

**ప్రబీర్ పుర్కాయస్థ**



రచయిత న్యూస్‌క్లిక్ మీడియా పోర్టల్ వ్యవస్థాపక సంపాదకులు, సైన్సు, ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఉద్యమ కార్యకర్త, రచయిత

**(సిపిఐ(ఎం) అగ్రనాయకులు మాకినేని బసవపున్నయ్య 107వ జయంతి సందర్భంగా డిసెంబర్ 14వ తేదీనాడు విజయవాడలోని ఎంబివికెలో జరిగిన సభలో 'న్యూస్‌క్లిక్' వెబ్ పోర్టల్ సంపాదకులు ప్రబీర్ పురకాయస్త ఆన్‌లైన్‌లో చేసిన ప్రసంగాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం- సంపాదకుడు.)**

ఈ రోజున్న పరిస్థితుల నేపథ్యంలో "సైన్స్-మతతత్వం" అనే అంశంపై మనం చర్చించేటపుడు స్వాతంత్ర్యోద్యమాన్ని ఒకసారి పరిశీలించాలి. స్వాతంత్ర్యోద్యమం పెట్టుకున్న లక్ష్యాలను గమనంలోకి తీసుకోవాలి. నాడు మన పూర్వీకులు బ్రిటిష్ వారితోనే కాదు స్వాతంత్ర్యోద్యమంలో భాగం కాకుండా, స్వాతంత్ర్యంపై భిన్నమైన అభిప్రాయాలున్న వారితో కూడా పోరాటం చేశారన్న అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి.

స్వాతంత్ర్యం అంటే ఏమిటి అన్న అంశంపై తీవ్రమైన భిన్నాభిప్రాయాలున్న శక్తులు ఉన్నాయి. ఆర్థికాభివృద్ధి, కళలు తదితరాలను అభివృద్ధి చేయటానికి విజ్ఞాన శాస్త్రాన్ని ఏ విధంగా వినియోగించుకోవాలన్న అంశాన్ని జాతీయోద్యమంలో చర్చించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రధానశక్తులు స్వాతంత్ర్యం రావటం అంటే కేవలం బ్రిటిష్ పాలన నుండి విముక్తి కావటం మాత్రమే కాదనీ, దేశంలో దరిద్రాన్ని, అసమానతలను అంతం చేయటం కూడా స్వాతంత్ర్యంలో భాగమేననీ భావించారు. అందుకోసం దేశాన్ని అభివృద్ధి చేయాలనీ, మౌలిక వసతులు, ఆర్థికాభివృద్ధిని సాధించటానికి విజ్ఞాన శాస్త్రాలను వినియోగించుకోవాలని భావించారు. సమాజాన్ని, ప్రకృతిని మార్చటానికి విజ్ఞాన శాస్త్ర ఫలితాలను వినియోగించుకోవాలని భావించారు. స్వాతంత్ర్యం అంటే ఏమిటి అన్న అంశంపై జాతీయోద్యమంలోని ప్రధానశక్తులు, వామపక్షాల మధ్య ఏకాభిప్రాయం ఉంది. స్వాతంత్ర్యం సాధించిన తర్వాత దేశం అభివృద్ధి కావాలనీ, అభివృద్ధి ఫలాలు ప్రజలకు లభించాలని వారు ఆకాంక్షించారు. స్వాతంత్ర్యానంతరం కూడా బ్రిటిష్ పాలనలో వలె ప్రజలు దరిద్రంలో ఉంటే స్వాతంత్ర్యానికి అర్థం లేదనీ, స్వాతంత్ర్యానంతరం రెండు లక్ష్యాలు సాధించాలనీ వారు భావించారు. అభివృద్ధిని సాధించటంతో పాటు అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా చూడటం, అసమానతలను నిర్మూలించటం ఈ రెండు లక్ష్యాలు. మార్క్సిస్టు, సోషలిస్టు దృక్పథం ఉన్నవారితో పాటు జాతీయోద్యమంలో పాల్గొన్న ప్రధానశక్తులు ఈ విధమైన అభివృద్ధిని సాధించటం కోసం శాస్త్ర, సాంకేతికాభివృద్ధిని వినియోగించుకోవాలని భావించాయి. స్వాతంత్ర్యోద్యమానికి బయట ఉండి, ఈనాడు అధికారంలో ఉన్న బిజెపి పూర్వరూపమైన ఆనాటి హిందు మహాసభ, దానికి నాయకునిగా ఉన్న ఆర్ఎస్ఎస్ ఈ దృక్పథంతో అంగీకరించ లేదు. ముస్లింలీగ్ నాయకుడు జిన్నా కూడా ఇదే దృక్పథంతో ఉన్నాడు. కొంతకాలం పాటు జాతీయోద్యమంలో భాగంగా ఉన్నప్పటికీ, స్వాతంత్ర్యానంతరం భారతదేశం ఐక్యంగా ఉంటే హిందు మెజారిటీ దేశంగా మారుతుందని చెప్పాడు.

దేశం ఆర్థికాభివృద్ధి సాధించాలని, ప్రజల జీవితాలు అభివృద్ధి కావాలని, శాస్త్ర, సాంకేతికాభివృద్ధి, విజ్ఞానం పునాదిపై ఈ అభివృద్ధి జరగాలని జాతీయోద్యమ నాయకులు కోరుకున్నారు. మనదేశంలో విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోలేకపోతే, స్వయం సమృద్ధిని సాధించలేకపోతే తిరిగి విదేశీ పెట్టుబడులు, విదేశాలపై ఆధారపడాల్సి ఉంటుందని, వారి దోపిడీకి గురికావాల్సివస్తుందని భావించారు. కేవలం విదేశీపాలన నుండి విముక్తి కావటమే కాక, దేశం స్వయం సమృద్ధంగా అభివృద్ధి చెందాలని, సామ్రాజ్యవాద దోపిడీఈ నుండి విముక్తి కావాలని, అందుకు శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని జాతీయోద్యమ అవగాహనగా ఉంది. ఆ విధంగా మాత్రమే సామ్రాజ్యవాద దోపిడి నుండి విముక్తి సాధించగలమని భావించారు. రాజకీయ స్వాతంత్ర్యం రావటం అంటే జాతీయోద్యమం సాధించాలనుకున్న లక్ష్యాలను సాధించటానికి ప్రభుత్వ యంత్రాంగంపై ఆధిపత్యం సాధించి, దానిని మన కర్తవ్యాలు నెరవేర్చడం కోసం వినియోగించుకోగలిగే ప్రాథమిక లక్ష్యాన్ని మాత్రమే సాధించటం అవుతుంది.

విజ్ఞానాన్ని ప్రజలు అర్థం చేసుకొనేలా, సమాజాన్ని, దేశాన్ని మార్చటానికి విజ్ఞానాన్ని ఉపయోగించుకొనేలా ప్రజలను అభివృద్ధి చేయాలని నాటి మన నేతలు చెప్పారు. శాస్త్రీయాభివృద్ధి ద్వారా కేవలం యంత్రాలు, ఉత్పత్తి సాధనాలను అభివృద్ధి చేయటం మాత్రమే కాక, సామాజిక మార్పును కూడా సాధించాలి. ఈ రెండింటి అభివృద్ధి శాస్త్ర విజ్ఞానం అభివృద్ధిపై ఆధారపడి ఉంది. విజ్ఞాన శాస్త్ర అభివృద్ధిని గురించి మనం చర్చించేటపుడు అది కేవలం ఫిజిక్స్, కెమిస్ట్రీలను నేర్చుకోవటం మాత్రమే కాదనీ శాస్త్ర విజ్ఞానాన్ని ఏ విధంగా వినియోగించాలి, ఏ విధంగా ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేయాలి, దానిని సమాజాభివృద్ధికి ఏ విధంగా ఉపయోగించాలి, శాస్త్ర విజ్ఞానంతో ఏ విధంగా

కార్యకలాపాలను నిర్వహించాలి అనే అంశాలను కూడా చర్చించడం అని తెలుసుకోవాలి.

**విజ్ఞాన శాస్త్రంతోనే అభివృద్ధి సాధ్యం**

శాస్త్రీయాభివృద్ధిని గురించి చర్చించడం అంటే పురాతన సైన్స్‌ను గురించి చెప్పుకోవటం కాదు. ఆధునిక కాలంలో సృషించిన విజ్ఞానం మనదేశంలో ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి దోహదం చేసేలా ఉండాలి ఈ చర్చ ఉండాలి. విజ్ఞానంపై ఆధారపడిన ఆర్థికవ్యవస్థ ఉండాలి. దేశాన్ని వలస పాలన నుండి విముక్తి చేయటంతో పాటు దేశంలోని వనరులను వినియోగించి అభివృద్ధి సాధించాలి. కాని ఆర్‌ఎస్‌ఎస్ దృక్పథం అదికాదు. మనం పురాతన కాలపు నాగరికతపై ఆధారపడి గుర్తింపు సాధించాలనేది వారి లక్ష్యం. వారికి దేశ విముక్తి అంటే బ్రిటిష్ వలస పాలన నుండి విముక్తి కాదు. బ్రిటిష్ పాలకులు వారి ప్రధాన శతృవులు కాదు. బ్రిటిష్‌వారిని దేశం నుండి పారదోలటం తమ ప్రధాన లక్ష్యం కాదని ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంత వేత్త సావర్కర్ చెప్పారు. పురాతన హిందుత్వను పునరుద్ధరించటమే వారి ప్రధాన లక్ష్యం. వారు చెప్పేది హిందుమతం కాదు. హిందుత్వ పునరుద్ధరణ కోసం వారు ప్రయత్నం చేశారు. హిందు, హిందుత్వ ఒకటి కాదని సావర్కర్ స్పష్టంగా చెప్పారు. హిందుత్వ మతపరమైనది కాదనీ, రాజకీయమైనదని కూడా ఆయన చెప్పారు. నాగరికతను గురించి, జాతి, మతం, సంస్కృతి, భాష గురించి సావర్కర్ చెప్పాడు. ఇవి పురాతన భారతదేశంలోని ప్రధానాంశాలనీ, వాటిని భారతదేశంలో పున:ప్రతిష్ఠించాలనీ చెప్పాడు.

మన జాతి హిందుజాతి, మన మతం హిందుమతం, మన భాష సంస్కృతం అని "మనం-మన జాతీయత" గ్రంథంలో గోల్వాల్కర్ చెప్పారు. ఆయన ఈ విషయాలన్నీ చెప్పాడు కాని ఆర్థికవ్యవస్థను గురించి ఒక్కమాట కూడా చెప్పలేదు. శాస్త్ర సాంకేతికాభివృద్ధి, ఆర్థికవ్యవస్థ అభివృద్ధి, విదేశీ పెట్టుబడుల దోపిడిని గురించి చెప్పలేదు. భారతదేశంలోని వనరులను విదేశీదోపిడీకి వదిలేయటం కాక, మన వనరులతో మనదేశాన్ని అభివృద్ధి చేసుకోవటానికి వినియోగించాలన్న మాట చెప్పలేదు. ఆనాటి ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతవేత్తలైన గోల్వాల్కర్, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతానికి పితగా వర్ణించబడిన సావర్కర్‌లలో ఎవరూ కూడా ఆర్థిక అభివృద్ధిని సాధించటం గురించి, పెట్టుబడిని గురించి పేర్కొనలేదు. బ్రిటిష్ పెట్టుబడి భారతదేశంలోకి వచ్చి దోపిడీని కొనసాగించటంపై వారికి ఎటువంటి వ్యతిరేకతా లేదు. భూమిని గురించి

> **" దేశాన్ని అభివృద్ధి చేయటం అంటే ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేయాలి. దేశాన్ని అభివృద్ధి చేయటానికి ఒకవైపున ప్రణాళిక, మరోవైపున విజ్ఞానం ఉండాలి. విజ్ఞానం అంటే శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి. వనరులు, విజ్ఞానాన్ని కలిపి ప్రణాళికా బద్ధంగా వినియోగించే సామర్థ్యం ఉండాలి. ఆ సామర్థ్యం ఎలా వస్తుంది? వీటన్నింటినీ కలిపి వినియోగించే సామర్థ్యాన్ని సంపాదించుకోవటం కోసం ఉన్నత విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలి, విస్తరించాలి. "**

చెప్పారు. పురాతన కాలంలో ఈ భూభాగంపై ఆధారపడి జీవించిన జాతి ప్రాతిపదికగా వారు హిందుత్వను గుర్తించారు. భూమే జాతి అని చెప్పారు. పురాతన కాలంలో హిందుజాతికి చెందిన భూభాగంగాన్ని తిరిగి తీసుకురావాలని చెబుతున్నారు. అందుకని ఈ జాతీయవాదం ప్రజలపై ఆధారపడినది కాదు. భూమిపై ఆధారపడినది. జిన్నా వలెనే సావర్కర్ కూడా జాతీయ ఉన్మాది. వీరిరువురూ గుర్తింపు కోసం మతాన్ని వినియోగించుకున్నారు.

దేశంలోని మిగతా పార్టీలూ, కూట ములూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడాయి. కాని ఆర్‌ఎస్‌ఎస్ జాతీయోద్యమం లో పాల్గొనలేదు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఆర్‌ఎస్‌ఎస్‌కు లేదు. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవటం ప్రధానమైన అంశంగా వారు పరిగణించలేదు. అందువల్లనే వారు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేయలేదు. విదేశాంగ విధానంలో కూడా ముస్లింలు, కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా సంఘటనను ఏర్పాటు చేయటం వారి లక్ష్యం. అంతర్జాతీయంగా ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులు, క్రైస్తవులు, యూదులు సంఘటనగా ఏర్పరచటం కోసం ప్రయత్నం చేస్తున్నారు.

ఈ విధమైన సైద్ధాంతిక వైరుధ్యాలను చూసినపుడు, జాతీయోద్యమ కాలంలో దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలని నడిచిన చర్చలో ఆర్‌ఎస్‌ఎస్ వైఖరిని చూసినపుడు వారి విధానంపై స్పష్టత వస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్‌కు అభివృద్ధి అంటే పురాతన కాలం నాటి అంశాలను తిరిగి పునరుద్ధరించటమే. అందుకనే మోడి మతాన్ని, రాజకీయాలను కలగాపులగం చేస్తున్నారు. వారికి దేశాభివృద్ధి అంటే అయోధ్యలో ఆలయం నిర్మించటం, కాశీలో ఆలయం నిర్మించటం, ఇతర చోట్ల దేవాలయాలను నిర్మించటం మాత్రమే. దేశ, విదేశీ పెట్టుబడిదారులు దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తారనేది వారి విధానం. భారతదేశాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయటం గురించి చర్చించటానికి కూడా సిద్ధం కావటం లేదు.

మనం పరిశీలించినట్లైతే స్వాతంత్ర్యా నంతరం దేశాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయటానికి నాటి ప్రభుత్వం పూనుకున్నదని స్పష్టమౌతుంది. దేశాన్ని అభివృద్ధి చేయటం అంటే ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేయాలి. దేశాన్ని అభివృద్ధి చేయటానికి ఒకవైపున ప్రణాళిక, మరోవైపున విజ్ఞానం ఉండాలి. విజ్ఞానం అంటే శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి. వనరులు, విజ్ఞానాన్ని కలిపి ప్రణాళికాబద్ధంగా వినియోగించే సామర్థ్యం ఉండాలి. ఆ సామర్థ్యం ఎలా వస్తుంది? వీటన్నింటినీ కలిపి వినియోగించే సామర్థ్యాన్ని సంపాదించుకోవటం కోసం ఉన్నత విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలి, విస్తరించాలి. ఆ విధంగానే విద్యావ్యవస్థను విస్తరించారు. ఐఐటిలను, ఇతర ఉన్నత విద్యాసంస్థలను ఏర్పాటు చేశారు. ఈ విధంగా భారతదేశ వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవటం ద్వారా అభివృద్ధిని సాధించటానికి కృషి చేశారు.

జాతీయోద్యమంలో ప్రధానశక్తిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ 1936లోనే దేశాభివృద్ధి కోసం ప్రణాళికను రూపొందించింది. సుభాస్ చంద్రబోస్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడైన తర్వాత బ్రిటిష్ వారి అనంతరం దేశాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయటానికి అవసరమైన ప్రణాళికను రూపొందించటం కోసం నెహ్రూ అధ్యక్షతన ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేశాడు. వారిరువురి పైనా సోవియట్ యూనియన్ ప్రభావం ఎక్కువగా ఉంది. దేశంలో ప్రణాళికా సంఘం ఏర్పడటానికి దారితీసిన పరిస్థితులు అవి.

కానీ మోడి పూర్తి మెజారిటీతో అధికారంలోకి రాగానే తీసుకున్న మొదటి చర్య ప్రణాళికా సంఘాన్ని రద్దుచేయటం. ప్రణాళిక

**❝ ప్రశ్నించటమూ, శాస్త్రీయాభివృద్ధికి దారితీసే సంస్థలూ వారికి ప్రమాదం కలిగిస్తాయి, కాబట్టి విద్యాసంస్థల్లో ప్రశ్నించటం అనేదే లేకుండా చేస్తున్నారు. ఉన్నత విద్యాసంస్థలు, విజ్ఞాన కేంద్రాలను విధ్వంసం చేసేవారి చేతికిస్తున్నారు. ప్రశ్నకు, విజ్ఞానాభివృద్ధికి పరస్పర సంబంధం ఉంది. ప్రశ్నించటం అంటేనే విజ్ఞానం కోసం ప్రయత్నం చేయటం. ఉనికిలో ఉన్నదానిని ప్రశ్నించకపోతే, గతంలోని గ్రంథాలలో ఉన్నదే సరిపో తుందనుకుంటే విజ్ఞానం పెరగదు. ❞**

లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యమౌతుంది? దేశ, విదేశీ బడా పెట్టుబడిదారులు దేశాన్ని అభివృద్ధి చేస్తారనీ, అభివృద్ధి కోసం ఎం చేయవచ్చునో, ఏం చేయకూడదో వారికి తెలుసుననీ బిజెపి భావిస్తున్నది. ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వం ఏ రూపంలో నైనా జోక్యం చేసుకోవటం అంటే అప్రతిష్టాకరమైన సోషలిస్టు విధానాన్ని అనుసరించటమనీ, కాబట్టి ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వం భాగస్వామి కాకూడదనేది వారి భావన. ప్రణాళిక అవసరం లేదు. మార్కెట్టే అభివృద్ధికి దారితీస్తుందని చెబుతారు. అందువలననే ప్రణాళికా విధానాన్ని, ఉన్నత విద్యాసంస్థలను, ఉత్పాదకశక్తుల అభివృద్ధికి విజ్ఞానాన్ని వినియోగించే విధానాన్ని రద్దుచేస్తున్నారు. దేశ, విదేశీ బడా పెట్టుబడులే అవసరమైన విజ్ఞానాన్ని తీసుకొస్తాయనీ, కాబట్టి విజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం గురించి మనం కృషి చేయాల్సిన అవసరం లేదనీ చెబుతారు. అందువలననే విద్యాసంస్థలను, విజ్ఞానాభివృద్ధి కేంద్రాలను రద్దుచేస్తున్నారు. మనభూమి పవిత్రమైనది కాబట్టి మనదేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడులు శుద్ధి అవుతాయని ప్రకటిస్తున్నారు.

విజ్ఞానాభివృద్ధికి మనం ఏమీ చేయాల్సినపనిలేదనీ, పురాతన గ్రంథాలలో ఉన్న విజ్ఞానమే మనకు సరిపోతుందనీ చెబుతున్నారు. బ్రహ్మాస్త్రాలు, పుష్పక విమానాలు, బయో ఇంజనీరింగ్ ఎలా చేయాలో పురాతన గ్రంథాల్లో చెప్పారనీ, అటువంటి బోగస్ విజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తే సరిపోతుందనీ చెబుతున్నారు. ప్రశ్నించటమూ, శాస్త్రీయాభివృద్ధికి దారితీసే సంస్థలూ వారికి ప్రమాదం కలిగిస్తాయి, కాబట్టి విద్యాసంస్థలలో ప్రశ్నించటం అనేదే లేకుండా చేస్తున్నారు. ఉన్నత విద్యాసంస్థలు, విజ్ఞానకేంద్రాలను విధ్వంసం చేసేవారి చేతికిస్తున్నారు. ప్రశ్నించటం అనేది లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. ప్రశ్నకు, విజ్ఞానాభివృద్ధికి పరస్పర సంబంధం ఉంది. ప్రశ్నించటం అంటేనే విజ్ఞానం కోసం ప్రయత్నం చేయటం. ఉనికిలో ఉన్నదానిని ప్రశ్నించకపోతే, గతంలోని గ్రంథాలలో ఉన్నదే సరిపోతుందనుకుంటే విజ్ఞానం పెరగదు.

సామ్రాజ్యవాదం భారతదేశానికి వచ్చిన తర్వాత ఏం జరిగిందనే విషయాలను నేను ప్రస్తావిస్తాను. సామ్రాజ్యవాదం కొనసాగించిన మూకుమ్మడి హత్యాకాండ, జాతుల నిర్మూలనలను గురించి నేను ప్రస్తావించటం లేదు. వారి దోపిడీని గురించిన కొన్ని అంశాలను మాత్రమే వివరిస్తాను. వలస విధానం ప్రారంభం కావటానికి ముందు ప్రపంచ జిడిపిలో భారతదేశం, చైనాల జిడిపి 50 శాతంగా ఉంది. ఆనాడు ఈ రెండు దేశాల జనాభా ప్రపంచజనాభాలో 40 శాతం ఉంది. 200 సంవత్సరాల వలస పాలన తర్వాత మనం సాంకేతతిక పరిజ్ఞానాన్నీ, విజ్ఞానాన్నీ కోల్పోయి పారిశ్రామిక రహితం అయ్యాం. మన రెండు దేశాల జిడిపి అట్టడుగుకు దిగజారింది. నల్లమందు యుద్ధాల పేరుతో చైనాను లొంగదీసుకున్నారు. బ్రిటన్ పారిశ్రామిక సరుకులను ఈ రెండు దేశాలలో కుమ్మరించారు. ఫలితంగా ఈ దేశాలు పారిశ్రామిక రహితం కావటంతో పాటు బ్రిటన్‌కు ముడి సరుకులను ఎగుమతి చేసే దేశాలుగా మారాయి. కాబట్టే వలసపాలన తర్వాత ఈ దేశాలు అభివృద్ధి సాధించటం కోసం అవసరమైన విజ్ఞానాన్ని సమూపార్జించుకోవటంతో పాటు, పారిశ్రామికాభివృద్ధిని సాధించటానికి ప్రయత్నం చేశాయి. ఒక రంగంలో ఒకదేశం ముందున్నా, మరో రంగంలో మరోదేశం ముందున్నా మొత్తంగా రెండు దేశాల అభివృద్ధిలో పెద్ద వ్యత్యాసం లేదు. కాని గత 30, 40 సంవత్సరాలుగా, ముఖ్యంగా గత 30 సంవత్సరాలలో చైనా అభివృద్ధిలో ముందుకు వెళ్ళింది. ఉత్పత్తిలో పెద్ద పెరుగుదలను నమోదు చేస్తున్నది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో అభివృద్ధిని సాధించింది. విజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం, అనేక వైజ్ఞానిక రంగాలలో అభివృద్ధి సాధనలో చైనా అమెరికాతో పోటి పడుతున్నది. కానీ ఆ విధంగా భారతదేశం అభివృద్ధిని సాధించలేకపోతున్నది. భారతదేశంలో కొంత అభివృద్ధి జరిగినప్పటికీ అసమానతలు పెరుగుతున్నాయి.

పెట్టుబడిదారి విధానాభివృద్ధికి, మిగతా వ్యవస్థల్లో అభివృద్ధికి మధ్య ఉన్న వ్యత్యాసం గురించి వివరిస్తాను. బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవానికి 100 సంవత్సరాల ముందు సామ్రాజ్యవాద వలసలు ప్రారంభమయాయి. ఆఫ్రికా, అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియా ఖండాలలో వలస వాదులు దారుణమైన హత్యాకాండను కొనసాగించారు. ఆఫ్రికా ప్రజలను బానిసలుగా తీసుకొచ్చారు. 20వ శతాబ్దంలో, ముఖ్యంగా గత 50, 60 సంవత్సరాలుగా శాస్త్ర, సాంకేతికాభివృద్ధిని విజ్ఞానంతో మేళవించి, ఉత్పత్తిలో వినియోగించటం పెరిగింది. 20 శతాబ్దపు చివరి కాలంలో సాంకేతికాభివృద్ధి, యూనివర్శిటీలలో పరిశోధనలను సమన్వయపరిచి, పారిశ్రామికాభివృద్ధికి వినియోగించుకోవటం ప్రారంభించారు. ఈ విధంగా మేళవించటం అత్యంత ముఖ్యమైన అంశమని నేను భావిస్తున్నాను. ఈ విధంగా గత 20, 30 సంవత్సరాలలో సాంకేతికాభివృద్ధి, విజ్ఞానాన్ని సమగ్రంగా వినియోగించటం ఉత్పత్తి వేగంగా పెరగటంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. ఈ రోజు పెట్టుబడిదారీ ప్రపంచంలో మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో ఆపిల్ కంపెనీ మొదటిస్థానంలో ఉన్నది. మార్కెట్ క్యాపిటలైజేషన్ అంటే కంపెనీ షేర్ల మొత్తం విలువ. ఆపిల్ కంపెని కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు తయారు చేయదు. అయినా అది నంబర్ ఒన్ కంపెనీగా ఎలా రాణించ గలుగుతున్నది? విజ్ఞానం వలననే ఇది సాధ్యపడుతున్నది. సెల్‌ఫోన్‌లు తయారు చేసే ఫాక్స్‌కాన్ కంపెనీ తైవాన్ కేంద్రంగా ఉన్నది. దాని అనుబంధ సంస్థలు చైనాలో ఐ-ఫోన్‌లను తయారు చేస్తాయి. ఫోన్‌ల అమ్మకం ద్వారా సంపాదించిన విలువలో 3 శాతం మాత్రమే ఫాక్స్‌కాన్ కంపెనికి వెళుతుంది. ఆపిల్ కంపెనికి ఒక్కో ఐ-ఫోన్ అమ్మకంపై 300 డాలర్లు వెళతాయి. విజ్ఞానంపై ఆపిల్ కంపెనీకి ఉన్న మేధోపరమైన హక్కుల వలననే ఇలా జరుగుతున్నది. పేటెంట్లు, కాపీరైట్లు తదితరాల ద్వారా

విజ్ఞానంపై ఆధిపత్యం సంపాదిస్తున్నారు. ఈ రోజు ప్రపంచంలో సిమెంటు, ఉక్కు, భారీయంత్ర పరిశ్రమలు ప్రధానం కాదు. రేపటికి ఉపయోగపడే విజ్ఞానమే ప్రధానమైనది. విజ్ఞానాన్ని పెంపొందించటానికి రూపొందించే మౌలిక సదుపాయాలే ప్రధానమైనవి.

ప్రస్తుతం అమెరికా, చైనాల మధ్య జరుగుతున్న పరిణామాలను 'టెక్ వార్' అని పిలుస్తున్నారు. గత కొంతకాలం నుండి టెక్‌వార్, చిప్‌వార్ అనే మాటలు వింటున్నాం. 21 శతాబ్దంలో అమెరికా, చైనాల మధ్య టెక్‌వార్ నిర్ణయాత్మకంగా ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఎవరు పెద్ద పరిశ్రమలను నడుపుతున్నారనేది, ఎవరు ఎక్కువ మౌలిక సదుపాయాల పరిశ్రమలను నిర్వహిస్తున్నారనేది ప్రధానం కాదు. ఎవరు విజ్ఞానంపై ఆధిపత్యం కలిగివున్నారనేదే ప్రధానం. భవిష్యత్‌కు సంబంధించిన విజ్ఞానాన్ని ఎవరు అభివృద్ధి చేస్తారు, దానిని ఈ నాటి పరిశ్రమలతో ఏ విధంగా సమ్మిళితం చేస్తారనేదే ప్రధానమైనది. దీనికి సంబంధించి రెండు ఉదాహరణలు తీసుకుందాం. ఒకటి చిప్‌లను తయారు చేయటానికి సంబంధించినది. వాస్తవంగా చిప్‌ల తయారీపై అమెరికాకు గుత్తాధిపత్యం ఉండేది. ఈ రోజు కూడా అమెరికాయే చిప్‌లను డిజైనింగ్ చేస్తున్నది. సాంప్రదాయక మార్క్సిస్టులకు పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రధానం కాదు. ఉత్పత్తిని రూపొందించటానికి వినియోగిస్తున్న యంత్రాలు ప్రధానమైనవి. కార్ల్‌మార్క్స్ దీనిని పెట్టుబడిదారి ఉత్పత్తిలో మొదటి విభాగం (డిపార్ట్‌మెంట్ ఒన్) అని పిలిచాడు. చిప్‌లను తయారు చేసే యంత్రాలు ఉంటాయి. దురదృష్టవశాత్తు ఈ రంగంలో పశ్చిమదేశాల కంపెనీలే ఆధిపత్యం వహిస్తున్నాయి. అవి చైనా కంపెనీల కన్నా 10, 15 సంవత్సరాలు ముందున్నాయి. అందువలననే ఆధునిక తరం యంత్రాలను చైనాకు అమ్మటంపై ఆంక్షలు విధిస్తున్నాయి. ఆధునిక యంత్రాలను రూపొందించాలంటే యంత్రాలతో పాటు విజ్ఞానాన్ని సమ్మిళితం చేసి వినియోగించాలి. పెట్టుబడిదారి ఉత్పత్తిలో ఈ 'డిపార్ట్‌మెంట్ ఒన్' లో యంత్రాలను వినియోగించి, వినియోగ సరుకులను తయారు చేస్తారు. ఆధునిక యంత్రాలను తయారు చేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని, విజ్ఞానాన్ని సమ్మిళితం చేసి వినియోగించాలి. అత్యంత సున్నితమైన సెమి కండక్టర్లను తయారు చేయటానికి విస్తృతమైన విజ్ఞానం కావాలి. ఒక రంగానికి సంబంధించినది మాత్రమే కాక, వివిధ రంగాలకు సంబంధించిన విజ్ఞానం కావాలి. ఒక సెమి కండక్టర్‌ను లక్షలాది అవసరాల కోసం వినియోగించుకోవచ్చు. అందుకోసం యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలలో జరుగుతున్న పరిశోధనలను, ఉత్పత్తిరంగంలో జరుగుతున్న అభివృద్ధినీ సమ్మిళితం చేసి వినియోగించుకోవాలి. రాజ్యం మద్దతుతో విజ్ఞానాన్ని అభివృద్ధి చేసి, ఉత్పత్తిరంగంలో వినియోగించాలి. చిప్స్‌ను ఉత్పత్తి చేయటంలో ఆ విధంగా అత్యధునిక విజ్ఞానాన్ని వినియోగించుకోవటానికి కృషిచేయాలి.

" ప్రస్తుతం అమెరికా, చైనాల మధ్య జరుగుతున్న పరిణామాలను 'టెక్ వార్' అని పిలుస్తున్నారు. గత కొంతకాలం నుండి టెక్‌వార్, చిప్‌వార్ అనే మాటలు వింటున్నాం. 21 శతాబ్దంలో అమెరికా, చైనాల మధ్య టెక్‌వార్ నిర్ణయాత్మకంగా ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఎవరు పెద్ద పరిశ్రమలను నడుపుతున్నారనేది, ఎవరు ఎక్కువ మౌలిక సదుపాయాల పరిశ్రమలను నిర్వహిస్తున్నారనేది ప్రధానం కాదు. ఎవరు విజ్ఞానంపై ఆధిపత్యం కలిగివున్నారనేదే ప్రధానం. "

రెండవది, సమాచార-సాంకేతిక పరిజ్ఞానం. ఈ రోజు సమాచార, సాంకేతిక రంగంలో విజ్ఞానం శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్నది. దానిలో ఒకభాగం కంప్యూటర్ల ద్వారా కౌంటింగ్ చేయటం. కంప్యూటర్ చిప్స్ తయారి రంగంలో తీవ్రమైన పోటి నెలకొని ఉంది. చిప్స్‌ను ఉత్పత్తి చేసే యంత్రాలను ఉత్పత్తి చేయటంలో చైనాతో పోల్చినపుడు పశ్చిమదేశాలన్నీ కలిపి చైనా కన్నా ముందున్నాయి. దీనిలో రెండవ అంశం కృత్రిమ మేధ. కృత్రిమ మేధతో డాటాను విశ్లేషించటం ద్వారా ఎక్కువగా సమాచారాన్ని రాబట్టటానికి, దానిని అనేక రకాల అవసరాల కోసం కూడా ఉపయోగించుకోవచ్చు. ఎక్కువ డేటా ఉంటే యంత్రాలను సమర్ధవంతంగా వినియోగించుకోవచ్చు. తర్వాతి తరం యంత్రాలతో బయో-టెక్నాలజీ డాటాను కూడా విశ్లేషణ చేసి, వినియోగించుకోవచ్చు. వీటికి డేటాను గురించిన శిక్షణ కావాలి. ఈ కార్యకలాపాలలో పాల్గొనే వారికి ఈ విజ్ఞానానికి సంబంధించిన శిక్షణ ఇవ్వాలి. వైర్‌లెస్ సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో, 5జి సాంకేతిక పరిజ్ఞానంలో అమెరికా కన్నా చైనా నాలుగైదు సంవత్సరాలు ముందున్నది. ఎక్కువ డేటా ఉంటే కృత్రిమ మేధ ద్వారా ఎక్కువ సమర్ధవంతంగా యంత్రాలకు శిక్షణ ఇచ్చి బాగా పనిచేయించవచ్చు. ఎవరు ఎక్కువ డేటాను ఉత్పత్తి చేస్తున్నారు? 140 కోట్ల చైనీయులు అనేక రకాలైన డాటాను ఉత్పత్తి చేస్తున్నారు. 30 కోట్ల అమెరికన్లూ డాటాను ఉత్పత్తి చేస్తున్నారు. యూరప్, జపాన్‌లలోనూ ఉత్పత్తి చేస్తున్నారు. ఎవరు ఎంత డాటాను ఉత్పత్తి చేస్తున్నారన్నది ప్రధానం కాదు. ముఖ్యమైన దేమిటంటే 5 జి సాంకేతిక పరిజ్ఞానం ఉత్పత్తిలో చైనా ప్రపంచంలో నాయకత్వ స్థానంలో ఉన్నది. అమెరికా 5 జి వైర్‌లెస్ పరికరాలను ఉత్పత్తి చేయటం లేదు. 4 జి కన్నా 5 జి ద్వారా పది రెట్లు ఎక్కువ డేటాను పొందవచ్చు. ఇది నూతన తరం యంత్రాలను ఉత్పత్తి చేయటంలో చైనాకు ఆధిక్యతను కల్పిస్తున్నది. కృత్రిమ మేధను ఉత్పత్తి చేయటంలో అమెరికా, యూరప్ దేశాల కన్నా చైనా ఆధిక్యతా స్థానంలో ఉన్నది. రానున్న పదిహేను, ఇరవై సంవత్సరాలలో చైనా సాంకేతిక రంగంలోనే కాక, ఆర్థికరంగంలో కూడా తమను అధిగమిస్తుందని అమెరికా భయపడుతున్నది.

మానవ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటానికి మౌలిక సదుపాయాలను కల్పించటంలో చూపుతున్న వ్యత్యాసమే వీటిలో ప్రధానమైనది. ఎన్ని ఉన్నత విద్యాసంస్థలను, విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశాం, ఎందరు ఉన్నత విద్యను బోధించే అధ్యాపకులున్నారు, ఎందరు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు అన్న అంశాలు ప్రాధాన్యత కలిగినవి. మానవ మేధను అభివృద్ధి చేయటం ద్వారా మాత్రమే యంత్రాలను అభివృద్ధి చేయటం, సక్రమంగా వినియోగించటం, ప్రపంచంలో ఉత్పత్తిశక్తులను అభివృద్ధి చేసుకోవటం సాధ్యమౌతుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం ద్వారా దానిని ఉత్పత్తిరంగంలో వినియోగించటానికి, ఉత్పత్తిశక్తులను అభివృద్ధి చేయటానికి దారితీస్తుంది. ఈ రోజు చైనా సాంకేతిక పరిజ్ఞానంపై పరిశోధనలు చేయటానికి ఎక్కువ మందిని పంపుతున్నది. సాంకేతిక పరిజ్ఞానం

**“ విజ్ఞానానికి సంబంధించి, ప్రస్తుతం మనల్ని పాలిస్తున్న బిజెపి దృక్పథం గురించి చెప్పుకోవాలి. విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటం ప్రభుత్వ బాధ్యత అని వారు భావించరు. ప్రైవేటురంగం తమకు కావలసిన విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటుందని చెబుతారు. కాబట్టే యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలను ప్రైవేటు వారికి ఇస్తున్నారు. తమకు విజ్ఞానం అవసరం అనుకున్నవారు డబ్బు చెల్లించి నేర్చుకుంటారని భావిస్తున్నారు. ”**

వినియోగించటంలో శిక్షణ ఇవ్వటం మాత్రమే కాక, ఆ రంగంలో పరిశోధనలకు ఎక్కువ మందిని పంపుతున్నది. వారు ఉత్పత్తిరంగానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించటంలో అభివృద్ధిని సాధిస్తున్నారు. ప్రస్తుతం చిప్స్ డిజైనింగ్, ఉత్పత్తిలో నూతన సాంకేతిక పరిజ్ఞానం జీవిత కాలం మూడు నుండి ఐదు సంవత్సరాలు మాత్రమే.

చైనా తన విజ్ఞానాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చేసుకుంటున్నది. శాస్త్ర, సాంకేతికాభివృద్ధికి సంబంధించిన అనేక ఆధునిక రంగాలలో అమెరికాను అధిగమించింది. 1990లలో చైనాకు దీటైన సాంకేతిక పరిజ్ఞానం భారతదేశం వద్ద కూడా ఉన్నది. ఐఐటిలు, బెంగుళూరు ఐఐఎస్‌సి, వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని, వైద్యరంగాన్ని అభివృద్ధి చేసుకోవటానికి పరిశోధనలు జరిగాయి. ఆసుపత్రులను అభివృద్ధి చేసుకోవటానికి, వైద్య విద్యార్థులకు శిక్షణ ఇవ్వటానికి ప్రభుత్వం కృషి చేసింది. 90వ దశాబ్దం వరకు ఈ విధమైన కృషి జరిగింది. ఆ తర్వాత పెట్టుబడిని, విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే సంస్థలను ప్రభుత్వం ప్రైవేటు వారికి అప్పగించింది. పెట్టుబడిదారీ అమెరికా, సోషలిస్టు చైనా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటం రాజ్యం బాధ్యత అని చెబుతున్నాయి. అందుకవసరమైన నిధులు అందజేస్తున్నాయి. అందువలననే యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలను స్థాపించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నాయి. అమెరికాలో సమాచార, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర వైజ్ఞానిక రంగాల అభివృద్ధికి నిధులు ప్రధానంగా సైన్యం నుండి వస్తాయి.

మన దేశంలో స్వాతంత్ర్య పూర్వపు దృక్పథాన్ని గనుక చూసినట్లైతే దేశం స్వతంత్రం సంపాదించిన తర్వాత మన పాలకులు స్వతంత్ర దేశంగా శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని, జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని భావించారు. సమస్య లేబొరేటరీలను ఏర్పాటు చేయటం కాదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనుగోలు చేయటం కాదు. సాంకేతిక పరిజ్ఞాన రంగంలో ప్రతి ఐదు సంవత్సరాలకు అప్పటికి ఉన్న పరిజ్ఞానం పాతదైపోతుంది. ప్రతి మూడు, ఐదు సంవత్సరాలకు మనం సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనగలమా?

భారతదేశం గతంలో సాధించుకున్న సాంకేతిక పరిజ్ఞానం పాతదైపోతున్నది. భారతదేశం స్వయం సమృద్ధి సాధన కోసం కృషి ప్రారంభించిన నాటికే ఈ మార్పు ప్రారంభమైంది. గత ఇరవై ఐదు ముప్పై సంవత్సరాల నుండి మనం కొత్త విద్యుత్ కేంద్రాలు, ఉక్కు ఫ్యాక్టరీలు నిర్మించలేదు. ఎలక్ట్రానిక్స్, ఐటి పరిశ్రమలలో మరింత అత్యధునిక సాంకేతిక పరిజ్ఞానం వస్తున్నది. బయో టెక్నాలజి, ఫార్మస్యూటికల్ రంగాలలో వలయాలు (సైకిల్స్)గా సాంకేతికాభివృద్ధి, విజ్ఞానాభివృద్ధి జరుగుతున్నది. ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు ఉత్పత్తిరంగంతో సమ్మిళితం చేసి వినియోగించుకోవాలి. బయో టెక్నాలజి, వ్యాక్సిన్‌లు తదితరాల విజ్ఞానం మూడు నుండి ఏడు సంవత్సరాల లోపు పాతబడిపోతుంది. సరళీకరణ విధానాలతో ప్రభుత్వం వీటిని వదులుకున్నది.

విజ్ఞానానికి సంబంధించి, ప్రస్తుతం మనల్ని పాలిస్తున్న బిజెపి దృక్పథం గురించి చెప్పుకోవాలి. విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటం ప్రభుత్వ బాధ్యత అని వారు భావించరు. ప్రైవేటురంగం తమకు కావలసిన విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటుందని చెబుతారు. కాబట్టే యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలను ప్రైవేటు వారికి ఇస్తున్నారు. తమకు విజ్ఞానం అవసరం అనుకున్నవారు డబ్బు చెల్లించి నేర్చుకుంటారని భావిస్తున్నారు. ఇది విద్యను, సాంకేతిక పరిజ్ఞానాన్ని, విజ్ఞానాన్ని డబ్బుతో కొనుగోలు చేయవచ్చునన్న భావనపై ఆధారపడివుంది. చదువుకునే వారిలో పేదలుంటే వారికోసం విద్యారుణాలను అందజేస్తున్నారు. మేధావులు పరిశోధనలు చేయాలన్నా డబ్బు చెల్లించాల్సిందే. డబ్బు చెల్లించి పరిశోధనలు చేసినవారినే మేధావులుగా ముద్ర వేస్తున్నారు.

ఇదీ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల సిద్ధాంతం, వారి దృక్పథం. మన భవిష్యత్‌కు కావలసిన విజ్ఞానాన్నంతా మన పూర్వీకులే అభివృద్ధి చేశారనీ, మనం అదనంగా అభివృద్ధి చేయవలసినది ఏమీ లేదనీ, వారు అభివృద్ధి చేసిన విజ్ఞానాన్ని అర్థం చేసుకుంటేచాలనీ చెబుతారు. విజ్ఞానాన్ని అభివృద్ధి చేయటానికి ఇది పూర్తిగా ప్రతికూలమైన వైఖరి. మన పూర్వీకులు అభివృద్ధి చేసిన విజ్ఞానాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించటం, మన భవిష్యత్‌ను గురించి విమర్శనాత్మకంగా ఆలోచించటం ప్రమాదకరమని వారు భావిస్తారు. మన గతానికి సంబంధించిన వెలికిరాని అంశాలను పరిశోధించి వెలికితీయటం, వాటిని మన భవిష్యత్ అభివృద్ధి కోసం వినియోగించుకోవటానికి ప్రయత్నం చేయటం ద్వారా అప్పటి వరకు ఉనికిలో లేని, నూతన విజ్ఞానం సృష్టి అవుతుంది. నూతన విజ్ఞానాన్ని సృష్టించాలంటే ఉన్నదానిని ప్రశ్నించాలి. ప్రశ్నించటం ప్రారంభమైతే ప్రభుత్వ వ్యవస్థను కూడా ప్రశ్నించాలి. కొద్దిమంది అధికారం చెలాయించే వ్యవస్థను ప్రశ్నించాలి. దేశంలో రాజకీయ, ఆర్థిక అధికారాలను నిర్వహిస్తున్నవారు వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించాలి. ప్రభుత్వ పునాదిని, అసమానతలతో కూడిన సమాజాన్ని ప్రశ్నించాలి. ఈ విధంగా అసమానతలతో కూడిన సమాజం ఏ విధంగా ఉనికిలోకి వచ్చిందనేది కూడా ప్రశ్నించాలి. కులం ఏమిటి? కులానికి, అధికారానికి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? కొన్ని కులాల నుండి వచ్చిన వారే రాజకీయంగా శక్తివంతులు, సంపద్వంతులు ఎందుకవుతున్నారన్న అంశాన్ని ప్రశించాలి. కొన్ని కులాల నుండి వచ్చిన వారే సామాన్య ప్రజలు ఉత్పత్తి చేస్తున్న సంపదలను ఏ విధంగా స్వంతం చేసుకొంటున్నారు? భూమిపై ఏ విధంగా ఆధిపత్యం చెలాయిస్తున్నారు.? రైతులు, కార్మికులు ఉత్పత్తి చేస్తున్న సంపదను కొద్దిమంది ఏ విధంగా కాజేస్తున్నారన్న అంశాన్ని ప్రశ్నించాలి. గతంలో పర్మినెంట్ కార్మికులుగా, ఉద్యోగులుగా పనిచేస్తున్న

(మిగతా 11వ పేజీలో)

ఇంటర్వ్యూ

# ఎల్‌డిఎఫ్ నిర్మాణమే ప్రధాన కర్తవ్యం



ప్రకాశ్ కరత్

(వామపక్ష సంఘటన నిర్మాణం అనేది చాలా వరకు పార్టీ ప్రచార నినాదంగా ఉండిపోయిందని, దాన్ని ఆచరణ నినాదంగా మార్చాలని విశాఖపట్టణంలో జరిగిన సిపిఐ(ఎం) 21వ మహాసభ నిర్ణయించిందని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ చెప్పారు. ఎల్‌డిఎఫ్ అనేది వివిధ పార్టీలను పోగుచేసి ఏర్పాటు చేసే రాజకీయ సంఘటన కాదని, వామపక్ష ప్రజాతంత్ర శక్తులను పోరాటాల్లోకి సమీకరించడం ద్వారా దాని నిర్మాణానికి కృషి చేయాలని చెప్పారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ ఉద్యమం సందర్భంగా ఏర్పాటు చేసిన సంయుక్త కిసాన్ మోర్చా అటువంటి క్రమంలో భాగమని వివరించారు. డిసెంబర్ 27 నుండి 29 వరకు గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగిన సిపిఐ(ఎం) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహాసభల్లో పాల్గొనడానికి వచ్చిన ప్రకాశ్‌కరత్‌తో మార్క్సిస్టు సంపాదకులు **ఎస్. వెంకట్రావు** చేసిన ఇంటర్వ్యూను కింద ఇస్తున్నాం.)

**ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు క్రమంగా ప్రచ్ఛన్న యుద్ధం వైపుకు మళ్లుతున్నట్లున్నాయి. దానికి కారణాలు వివరిస్తారా?**

అమెరికా చైనాల మధ్య ఘర్షణ తీవ్రతరం కావడం ఇటీవల మనం అంతర్జాతీయ పరిణామాల్లో ప్రధానంగా గమనిస్తున్నాం. రానున్న కాలంలో ఇది అంతర్జాతీయంగా ఒక నిర్ణయాత్మకమైన అంశంగా ఉండబోతోంది. అమెరికా ఒకవైపు ప్రపంచంలోనే అతి శక్తివంతమైన సామ్రాజ్యవాద దేశంగా ఉండడం, చైనా ప్రపంచంలోనే అతి శక్తివంతమైన సోషలిస్టు దేశంగా ఉండడం, వీటి మధ్య తీవ్రమౌతున్న ఘర్షణ నేడు ప్రపంచంలో సామ్రాజ్యవాదానికీ, సోషలిజానికీ మధ్య తీవ్రమైన వైరుధ్యంగా ముందుకు వచ్చింది. చైనా ఎదుగుదల, ప్రపంచంలో దాని ప్రభావం పెరగడంతో అమెరికా తీవ్రమైన ఆందోళనకు గురవుతోంది. అందువల్ల చైనాను నిలువరించడానికీ, ఏకాకిని చేయడానికీ అది చేయాల్సినదంతా చేస్తోంది. ఐరోపాలోనూ, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనూ, నాటోలోని తన మిత్రులందరినీ చైనాకు వ్యతిరేకంగా కూడగట్టడానికి అమెరికా అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. ఆస్ట్రేలియా, ఆసియాలో జపాన్, దక్షిణ కొరియా మొదలైన వాటిని చైనాకు వ్యతిరేకంగా సమీకరిస్తోంది. ఈ పూర్వరంగంలోనే మరో ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభమవుతున్నదనే భయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇది గతంలో సంభవించిన ప్రచ్ఛన్నయుద్ధ రూపంలో ఉండకపోవచ్చు. కానీ ఈ ఘర్షణ ఇలాగే కొనసాగితే అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త కూటములు ఏర్పడ్డం ఖాయం అన్న దాంట్లో సందేహం లేదు.

**ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల్లో భారతదేశం పాత్ర, విదేశాంగ విధానం క్రమంగా అమెరికాకు తోకగా మారుతున్నది. అదే సమయంలో కొన్ని విషయాల్లో, ముఖ్యంగా రష్యాతో సంబంధాల విషయంలో అది అమెరికాను ధిక్కరిస్తున్నది. దీని గురించి వివరించండి.**

మోడీ ప్రభుత్వ హయాంలో ప్రధానంగా జరుగుతున్నదేమంటే మనం దేశం క్రమంగా వ్యూహాత్మకంగా అమెరికా వైపు జరుగుతున్నది. గత రెండు దశాబ్దాలుగా జరుగుతున్న ఈ పరిణామం నేడు మరింత వేగం పుంజుకున్నది. దీని వెనుక సైనిక పరమైన అంశాలు కూడా ఉన్నాయి. రెండు దేశాల మధ్య సైనిక, రక్షణ సహకారం పెరిగింది. చైనాను ఏకాకిని చేయడానికి ప్రయత్నిస్తున్న అమెరికా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో రకరకాల కూటములు కట్టడానికి ప్రయత్నిస్తోంది. భారతదేశం ఇందులో భాగం అయింది. అమెరికా నాయకత్వంలో జపాన్, ఆస్ట్రేలియాల సరసన భారతదేశం కూడా చేరి 'చతుర్ముఖ కూటమి'గా ఏర్పడ్డం చూసినప్పుడు భారతదేశం అమెరికా యొక్క ఈ చైనా వ్యతిరేక వ్యూహంలో భాగంగా ఉండడానికి అంగీకరించిందని అర్థమవుతుంది. ఇదంతా కూడా రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన క్రమం యొక్క ఫలితం.

అదే సమయంలో భారతదేశం ఈ ప్రాంతంలో ఒక పెద్ద శక్తి గనుక దానికి ఇతర దేశాలతో కూడా సంబంధాలున్నాయి. సుదీర్ఘకాలం నుండి రష్యాతో భారత్ సంబంధాలను కొనసాగిస్తున్నది. ఆనాటి సోవియట్ యూనియన్ నుండి నేటి వరకు భారతదేశం ఆయుధాల సరఫరాల కోసం రష్యాపై ఆధారపడి ఉన్నది. నాడు సోవియట్ నుండి ఆయుధాలు కొనుగోలు చేసేది నేడు రష్యా నుండి కొనుగోలు చేస్తున్నది. ఇటీవలి కాలంలో ఆయుధాల సరఫరాల కోసం భారత్ అమెరికా, ఇజ్రాయిల్ వైపు మళ్లినప్పటికీ కొన్ని రకాల కీలకమైన ఆయుధాలు, పరికరాల విషయంలో మనం ఇప్పటికీ రష్యాపై ఆధారపడి ఉన్నాం. రష్యా నుండి ఇటీవలి కాలంలో భారతదేశం ఎస్ 400 క్షిపణులు కొనుగోలు చేయడం నాటి సంబంధాల కొనసాగింపుగానే సాగింది. వాస్తవం ఏమంటే ఎస్ 400 క్షిపణులు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన హ్రస్వశ్రేణి రకానికి చెందినవి. చివరికి అమెరికా దగ్గర కూడా ఇంతటి శక్తివంతమైన క్షిపణులు లేవు. అందువల్ల ఈ క్షిపణులు కొనుగోలు చేయడం అనేది అమెరికాతో బలమైన సంబంధాల

నుండి దూరం అవడం కిందకు రాదు. వాస్తవానికి అమెరికా మిత్రులు, నాటో సభ్య దేశాలు కూడా కొన్నిసార్లు, కొన్ని విషయాల్లో అమెరికా మాట జవదాటిన ఘటనలు ఉన్నాయి. ఉదాహరణకు నాటోలో దీర్ఘకాలంగా సభ్య దేశమైన టర్కీ కూడా ఈ క్షిపణులను రష్యా నుండి కొనుగోలు చేసింది. అమెరికా దాని మీద కొన్ని ఆంక్షలు కూడా విధించింది. అయితే భారతదేశం విషయంలో అమెరికా ఆంక్షలు విధిస్తుందని నేననుకోను. అది తన అసమ్మతిని వ్యక్తం చేసింది అంతే. ఎందుకంటే నేటి భౌగోళిక రాజకీయ వ్యూహాల్లో అమెరికాకు భారతదేశం అవసరం చాలా ఎక్కువగా ఉన్నది.

**లాటిన్ అమెరికా దేశాల్లో ఒకదాని వెంట మరొకటిగా ప్రజలు నయా-ఉదారవాద విధానాలను తిరస్కరిస్తూ వామపక్ష ప్రభుత్వాలను ఎన్నుకుంటున్నారు. సరికొత్తగా ఇటీవల చిలీలో వామపక్ష అభ్యర్థి గాబ్రియెల్ బోరిక్‌ను ఎన్నుకున్నారు. భారతదేశంలో కూడా అటువంటి పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందా?**

లాటిన్ అమెరికాలో గతంలోనే ఈ క్రమాన్ని మనం చూశాం. 1990వ దశకంలోనూ, 2000 దశకం ప్రారంభంలోనూ అక్కడ అనేక దేశాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. తరువాత సామ్రాజ్యవాదం ఎదురుదాడి చేయడంతో అనేక దేశాల్లో మితవాద ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. మళ్లీ ఇప్పుడు పరిస్థితి తిరగబడుతోంది. చిలీలో వామపక్ష సంఘటన అభ్యర్థి గెలుపొందడం అనేది చాలా ప్రాముఖ్యత గల పరిణామం. ఎందుకంటే 1970వ దశకంలో అక్కడే మొట్టమొదటి సారిగా సాల్వడార్ అలెండీ నేతృత్వంలో ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కుట్రతో కూల్చివేశారు. ఫాసిస్టు సైనిక నియంతృత్వాన్ని నెలకొల్పారు. అలాగే ప్రపంచంలోనే మొట్టమొదటి నయా-ఉదారవాద విధానాలను ప్రయోగాత్మకంగా అమలు జరిపింది కూడా అక్కడే. అలాంటి దేశంలో అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థి గెలుపొందడం నిజాంగా చాలా ప్రాముఖ్యత గల అంశం. దీన్ని ప్రభావం ఇతర లాటిన్ అమెరికా దేశాల మీద ఉంటుంది. బొలీవియాలో రెండేళ్ల క్రితం కుట్ర ద్వారా వామపక్ష ప్రభుత్వాన్ని కూల్చేశారు. ఏడాది తిరగక ముందే అక్కడ తిరిగి వామపక్ష ప్రభుత్వం వచ్చింది. పెరూలో మొట్టమొదటి సారిగా ఒక వామపక్ష అభ్యర్థి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అందువల్ల లాటిన్ అమెరికాలో మరోసారి వామపక్షాలు తిరిగి అధికారంలోకి వస్తున్నాయి. అయితే ఈ క్రమం ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో అంతకు ముందు మనకు కనిపించదు. అందువల్ల అటువంటి పరిణామమే భారతదేశంలో కూడా జరుగుతుందని మనం చెప్పలేం. మన అంచనా ఏమంటే భారతదేశ రాజకీయాల్లో మితవాద మలుపు మరింత సమీకృత మవుతోంది. అందువల్ల భారతదేశంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడ మితవాద శక్తులు ఇప్పటికీ ఆధిపత్యం వహిస్తున్నాయి.

**దేశంలో మోడీ 1 ప్రభుత్వానికీ, మోడీ 2 ప్రభుత్వానికీ మధ్య మీరు ఏమైనా తేడాను గమనిస్తున్నారా?**

అవును వాటిమధ్య ఖచ్చితంగా తేడా ఉంది. తేడా ఏమిటంటే రెండోసారి మరింత మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రభుత్వం హిందుత్వ ఎజెండాను మరింత దూకుడుగా అమలు చేస్తోంది. అదే సమయంలో నయా ఉదారవాద విధానాలను కూడా మరింత తీవ్రంగా అమలు చేస్తోంది. ఒక రకంగా కార్పొరేట్-హిందుత్వ కలగలుపు విధానాలను అది అమలు చేస్తోంది. దేశంలో నేడు హిందుత్వ-కార్పొరేట్ శక్తుల అనుబంధం చాలా బలపడింది. అందుకే అది ఒకవైపు ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతమైన హిందుత్వను దూకుడుగా అమలు చేస్తూ మరోవైపు కార్పొరేట్, ద్రవ్య పెట్టుబడి అనుకూల నయా-ఉదారవాద విధానాలను బలవంతంగా అమలు చేయడం చూస్తున్నాం.

**భారతదేశంలో నేడు ఒక ప్రత్యేకమైన పరిస్థితి చూస్తున్నాం. ఒకవైపు ఆర్థికవ్యవస్థ దిగజారుతోంది. మరోవైపు స్టాక్ మార్కెట్ పైపైకి పెరుగుతున్నది. అంతే కాదు, భారత జిడిపి పెరుగుదల 9 నుండి 10 శాతం ఉంటుందని చాలా రేటింగ్ ఏజెన్సీలు చెబుతున్నాయి. దీన్ని మనం ఎలా వివరిస్తాం?**

స్టాక్ మార్కెట్ బూమ్ అనేది ప్రపంచ వ్యాపితంగా జరుగుతోంది. ప్రపంచాన్ని కోవిడ్ మహమ్మారి చుట్టుముట్టిన తరువాత ఆర్థిక వ్యవస్థలు స్తంభించిపోవడంతో ప్రపంచంలోని ప్రధాన పెట్టుబడిదారీ దేశాలన్నీ ద్రవ్య ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించాయి. ద్రవ్య ఉద్దీపన అంటే ఆర్థికవ్యవస్థలోకి మరింత డబ్బును పంపించడమే. అయితే ఆ డబ్బును ప్రధానంగా ద్రవ్య సంస్థల్లోకి అంటే బ్యాంకులు, కార్పొరేట్ సంస్థల్లోకి పంపు చేశారు. అందువల్ల సులువుగా లభించే డబ్బు పెద్దమొత్తంలో ఆర్థికవ్యవస్థలోకి చేరుకున్నది. ఆ డబ్బే స్టాక్ మార్కెట్లను పైకి నడిపిస్తోంది. అంతేగానీ ఆర్థికవ్యవస్థలోని వివిధ రంగాల్లో ఉత్పత్తి పెరగడం ద్వారా ఈ పరిణామం జరగడం లేదు. కానీ వాస్తవ ఆర్థికవ్యవస్థ మాంద్యంలో ఉంది. ఉత్పత్తి నెమ్మదించింది. అదే సమయంలో వాల్‌స్ట్రీట్, అంటే ద్రవ్యరంగం మాత్రం పైకి పోతున్నది. దీనివల్ల సంపద కొద్దిమంది వద్ద కేంద్రీకృతం అవడం పెరిగిపోతున్నది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. ఈ కరోనా కాలంలో ప్రపంచంలోని శతకోటీశ్వరులంతా తమ సంపదను పెంచుకున్న తీరును మనం చూస్తున్నాం. ఎందుకంటే స్టాక్స్‌లో అత్యధిక భాగం వారి దగ్గరే ఉంటాయి. ఇది ఒక అంశం.

రెండో అంశం ఏమంటే, జిడిపి పెరుగుదల గురించి చెబుతున్నవన్నీ తప్పుత్రోవ పట్టించే లెక్కలు. ఈ ఏడాది జిడిపి 5 శాతం దిగజారిపోయి వచ్చే ఏడాది దాని మీద 9 శాతం పెరిగితే అది వాస్తవంగా 9 శాతం పెరిగినట్లు కాదు. ఎందుకంటే మనం క్రితం ఏడాది మీద పెరుగుదలను లెక్కిస్తాం కాబట్టి 5 నుండి లెక్కించుకుంటూ రావాల్సి వస్తుంది. అందువల్ల 2020తో పోలిస్తే జిడిపి కొంత పుంజుకుని ఉండవచ్చు కానీ, అది కోవిడ్ ముందునాటి స్థితికి చాలా దూరంలోనే ఉంది. కోవిడ్ ముందు కాలంలో అంటే 2018, 2019 సంవత్సరాల్లో మన ఆర్థికవ్యవస్థ క్రమంగా దిగజారడం మనం చూసాం. జిడిపి తగ్గుతూ వచ్చింది. అన్ని రంగాల్లో ఉత్పత్తి తగ్గుతూ వచ్చింది.

**రైతుల అందోళన తరువాత మోడీ ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలు అమలు చేయడంలో ఎత్తుగడలు మారుస్తున్న సూచనలేమైనా కనిపిస్తున్నాయా? ఎందుకంటే రైతుల ఆందోళన తరువాత మోడీ ప్రభుత్వం తన విధానాలను అమలు చేయడానికి కొత్త మార్గాలు వెదుకుతోందని వార్తలు వస్తున్నాయి.**

దాని ఆర్థిక విధానాల్లో మౌలికంగా ఎటువంటి మార్పూ లేదు. వ్యవసాయానికి సంబంధించిన మూడు నల్ల చట్టాల ద్వారా మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రయత్నించింది. అయితే రైతాంగం ఏడాది పాటు నిర్వహించిన విశాలమైన పోరాటం ఫలితంగా అది వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఎందుకంటే ఈ ప్రతిఘటనా పోరాటాన్ని అధిగమించడానికి దానికి మార్గాలన్నీ మూసుకుపోయాయి. నిజానికి వాళ్లు ఉద్యమాన్ని నీరుగార్చడానికి అన్ని రకాల పద్ధతులూ అనుసరించారు. కాని సఫలం కాలేకపోయారు. ఇప్పుడు చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతంగా జరిగిన ఉత్తరప్రదేశ్, పంజాబ్ ఎన్నికలు ముందుకు రావడంతో వాళ్ళు ఇబ్బందులను

ఎదుర్కోవాల్సివచ్చింది. ఎన్నికల్లో గెలవటాన్ని ప్రధానంగా భావిస్తున్న వారు ఉద్యమ ఫలితంగా ఎదురౌతున్న సమస్యలను ఎదుర్కోవటానికి సిద్ధంగా లేరు. అందువల్ల వాళ్లు నష్ట నివారణా చర్యలకు పూనుకున్నారు. అయితే దీనర్ధం వాళ్లు మొత్తం నయా–ఉదారవాద విధానాల అమలులో వెనక్కి తగ్గారని కాదు. ఇతర అన్ని రంగాల్లో నయా–ఉదారవాద విధానాలను అదే దూకుడుతో అమలు చేస్తున్నారు. పరిశ్రమలను ప్రయివేటీకరించే విషయంలో గానీ, ద్రవ్య సంస్థలు, బ్యాంకుల వగైరాలను ప్రయివేటీకరించే విషయంలో గానీ వారు వెనక్కి తగ్గలేదు. వ్యవసాయ రంగాన్ని ప్రైవేటు మార్కెట్లకు, కార్పొరేట్లకు తెరిచే విషయాన్ని మాత్రం వాళ్లు వాయిదా వేసుకున్నారు. తరువాత వాళ్లు ఇంకో రూపంలో దాన్ని అమలు చేయడానికి పూనుకుంటారు.

**విశాఖపట్టణంలో జరిగిన సిపిఐ(ఎం) 21వ మహాసభ వామపక్ష , ప్రజాతంత్ర శక్తులను కూడగట్టాలని పిలుపునిచ్చింది కదా, ఆ కృషి ఎంతవరకు వచ్చింది?**

వాస్తవానికి మనం వామపక్ష, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం నిర్మించాలని వరుసగా అన్ని మహాసభల్లో కూడా పిలుపునిస్తూ వచ్చాం. కిందిస్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం నిర్మించడానికి ప్రయత్నించలేదనీ, అది చాలా వరకు ఒక ప్రచార నినాదంగా మాత్రమే ఉండిపోయిందని మనం సమీక్షలో అంచనాకు వచ్చాం. కానీ విశాఖపట్టణంలో జరిగిన 21వ మహాసభలో మనం వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం దీర్ఘకాలిక ప్రచార నినాదం కాదనీ, మనం అటువంటి సంఘటనను అభివృద్ధి చేయడానికి కృషి చేయాలనీ నిర్ణయానికి వచ్చాం. దీనికి సంబంధించి మనం అర్థం చేసుకోవలసిన మరో విషయం ఏమంటే ఈ సంఘటన నిర్మాణం అనేది ఒక క్రమంలో జరగాలి. కొన్ని పార్టీలను ఒక చోట చేర్చి సంఘటన నిర్మాణం జరిగింది అని ప్రకటించడం కాదు. వర్గ, ప్రజా పోరాటాల నుండి ప్రధానంగా ఇటువంటి సంఘటన ముందుకు వస్తుంది. ఈ క్రమంలో మనం అన్ని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేస్తాం. ఆ కృషి చేయడం కోసం కొన్ని రాష్ట్రాల్లో ప్రయత్నాలు జరిగాయి. కాని మొత్తం మీద చూసినప్పుడు మనం గణనీయమైన పురోగతి సాధించలేకపోయాం. గత మహాసభ తరువాత రెండేళ్ల పాటు కరోనా వల్ల కార్యకలాపాల నిర్వహణకు అటంకాలు ఏర్పడ్డం ఒక కారణం. ఇది సాధారణ సమయం కాదు కదా! అందువల్ల మనం వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన నిర్మాణానికి అవసరమైన శక్తులను సమీకరించడంపై పెద్దగా దృష్టి కేంద్రీకరించలేకపోయాం. కానీ వామపక్ష ప్రజాతంత్ర సంఘటన అనేది ఎన్నికల సంఘటన కాదు. కొన్ని రాజకీయ పార్టీలను ఒక చోట చేర్చి ఏర్పాటు చేసేది కాదు. అది వర్గ సంఘటన. రైతు ఉద్యమంలో ఏం జరిగింది? సంయుక్త కిసాన్ మోర్చా ఏర్పడింది. పోరాటాల ద్వారా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను కూడగట్టడంలో ఇది ఒక అంశం. అందువల్ల వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన నిర్మాణానికి అవసరమైన శక్తులను సమీకరించే కృషి జరుగుతున్నది. పోరాటాలు అభివృద్ధి చెందుతున్నాయి. మనం వాటికి సరైన దిశానిర్దేశం చేయాలి. మనం అర్థం చేసుకోవాల్సిన రెండో విషయం ఏమంటే సిపిఐ(ఎం) ఒక్కటే ఈ పని చేయలేదు. మనం చొరవ తీసుకోవాలి. మనం వామపక్ష ప్రజాతంత్ర శక్తులన్నిటినీ పోరాటాల్లోకి సమీకరించాలి. అటువంటి క్రమం కొనసాగుతోంది. ❊

# శాస్త్రీయాభివృద్ధి - మతోన్మాదం

(8వ పేజీ తరువాయి)

వారు ఇపుడు ఎందుకు క్యాజువల్, కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారన్నదీ ప్రశ్నించాలి.

ఈ విధమైన ప్రశ్నలు అడగటం అధికారంలో ఉన్నవారికి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. కాబట్టి మితవాదులకు, మతోన్మాదశక్తులకు ప్రశ్నించటం ప్రమాదకరం అవుతుంది. విస్తృతమైన ఐక్యతను నిర్మించటం, ఉత్పత్తిశక్తుల అభివృద్ధి గురించి మాత్రమే కాక, విజ్ఞానాన్ని ప్రజలలోకి విస్తరింపచేయటం వంటి భవిష్యత్‌ను గురించిన దీర్ఘకాలిక దృక్పథం ఈ శక్తులకు ప్రతికూలంగా పరిణమిస్తుంది. అందువల్ల ప్రశ్నించే వారిని ఆర్ఎస్ఎస్, బిజెపిలు శత్రువులుగా చూస్తున్నాయి. అందువలననే యూనివర్సిటీలు, ప్రణాళికా విధానంపై మాత్రమే కాక, ప్రశ్నలను రేకెత్తించే మొత్తం ఈ నిర్మాణంపైనే దాడి చేస్తున్నారు. నూతన విజ్ఞానాన్ని, రేపటికి అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని సృష్టించేవారే ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబడతారు. ఉన్నతమైన విజ్ఞానాన్ని అభివృద్ధి చేయలేనివారు బానిసలుగా మారే పరిస్థితి వస్తుంది. భారతదేశ ఆర్థికవ్యవస్థ కొన్ని ఉత్పత్తుల విషయంలో ఎక్కువెక్కువగా దిగుమతులపై ఆధారపడుతున్నది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరం లేని బట్టలు, ఇతర కొన్ని ఉత్పత్తులను మనం చేయగలుగుతున్నాం. కాని అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధికి సంబంధించి మన పరిస్థితి ఏమిటి? చిప్స్, సెమి కండక్టర్లను మనం ఉత్పత్తి చేయలేకపోతున్నా. ఒకనాడు ఉత్పత్తి పేటెంట్లను నిషేధించి, ప్రాసెస్ పేటెంట్లను మాత్రమే అనుమతించినందు వలన అత్యున్నత విజ్ఞానంతో చేసే మందులను మనం ఉత్పత్తి చేయగలిగాం. వాస్తవంగా ఫార్మస్యూటికల్ రంగాన్ని మనం అభివృద్ధి చేశాం. కానీ ఇప్పుడేమి జరుగుతున్నది? కోవిడ్ వ్యాక్సిన్‌ను మనం ఆస్ట్రాజెనెకా నుండి తీసుకున్నాం. దేశంలో సీరం ఇన్స్టిట్యూట్ దానిని ఉత్పత్తి చేస్తున్నది. ప్రభుత్వరంగంలోని వ్యాక్సిన్ ఉత్పత్తి సంస్థలు ఎంతమాత్రం పోటీపడే పరిస్థితిలో లేవు. వాటిని ప్రైవేటురంగానికి అప్పగిస్తున్నారు. క్రమంగా మనం ఉన్న స్థానం నుండి దిగజారిపోతున్నాం. కొన్ని రంగాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అమెరికా నుండి తీసుకొని, వారి కూటములలో భాగస్వాములమై పోతున్నాం. ఈ విధమైన పరిస్థితుల వల్లనే ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తి కేంద్రంగా ఉన్న భారతదేశం మన అవసరాల మేరకు కూడా ఉత్పత్తి చేయలేకపోతున్నది. ఇక ఎగుమతులను గురించి చర్చించే ప్రసక్తి ఎక్కడిది? ప్రశ్నలను ప్రోత్సహించ లేకపోవటం, భవిష్యత్‌ను గురించి సరైన దృక్పథం లేకపోవటం వలన ఇటువంటి స్థితికి చేరుతున్నాం.

మతోన్మాదంతో పోరాడేటపుడు వారు మనలను విభజిస్తున్నారు కాబట్టి పోరాటం చేయటం కాదు. వారు ఎందుకు విభజిస్తున్నారనేది పరిశీలించాలి. మనం ప్రశ్నిస్తున్నాం కాబట్టే వారు మనలను విభజించటానికి ప్రయత్నిస్తున్నారు. ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయటం, ఉత్పత్తిని పెంచటం, పెరిగిన ఉత్పత్తిని ప్రజలకు పంపకం చేయటం గురించిన ప్రశ్నలు రాకూడదని వారు భావిస్తున్నారు. కాబట్టి జరుగుతున్న ఉత్పత్తిని, అభివృద్ధి ఫలాలను అందరికీ అందించాలని మనం పోరాటం చేయాలి. సైన్స్ కోసం, భారతీయులను ఐక్యం చేయటం కోసం మన పోరాటం చేయాలి. మన చుట్టూ ఉన్న అసమానతలను ప్రశ్నించాలి. అయిన స్వాతంత్ర్యఫలాలను అందరికీ సమానంగా పంచాలి, దేశప్రజలు గౌరవప్రదమైన జీవితం గడపటానికి, ప్రతివారూ తమకు అవసరమైనంత తినటానికి, తమ పిల్లలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వడానికి అవకాశం ఉండాలి అన్న లక్ష్యాలను సాధించే విధంగా మన కృషి ఉండాలి. ఈ విధంగా అభివృద్ధి అయ్యే నూతన తరం ప్రపంచంలోని ఏ దేశంతో అయినా పోటీ పడగలిగే విధంగా విజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలి. ❊

# ప్రజాపునాది సమస్యకు పరిష్కారం ఏమిటి?

**ఎస్ వీరయ్య**



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

కమ్యూనిస్టు పార్టీల ప్రజాపునాది చెదిరిన విషయం నిర్వివాదాంశం. పునాది పెంచుకోవటం ఎట్లా అన్నదే ఇప్పుడు సమస్య. పార్టీ మహాసభల కాలం ఇది. సహజంగానే ప్రజాపునాది చర్చనీయాంశమైంది. సరళీకృత ఆర్థిక విధానాల వల్ల ప్రజాపునాది పెరగటం లేదనే అభిప్రాయం ఉండవచ్చు. ఉదారవాద విధానాల వైఫల్యం వల్లనే కదా గత పన్నెండేళ్ళగా పెట్టుబడిదారీ ప్రపంచం సంక్షోభంలో ఉన్నది. ప్రజాసమస్యలు పెరిగినపుడు ఉద్యమాలకు అవకాశాలు కూడా పెరుగుతాయి కదా! ప్రపంచీకరణ విధానాలతో మొదట పునాది చెదరటాన్ని కొంతమేరకు అర్థం చేసుకోవచ్చు. ఆ విధానాల వైఫల్యాలు నూతనావకాశాలను ఆవిష్కరిస్తాయికదా! అందువల్ల ప్రపంచీకరణ విధానాలే కారణంగా కొట్టిపారేయలేము. అంతేకాదు.... ఇవే విధానాల దెబ్బకు చితికిపోయిన దక్షిణ అమెరికా ఉద్యమం ఊపిరిపోసుకోవటమే కాదు... వెనెజులా, బొలీవియా, పెరూ, చిలీ తదితర దేశాలలో అభ్యుదయశక్తులు, వామపక్షాలు అధికారంలోకి కూడా రాగలిగాయి. మన దేశంలో కూడా కేరళ అనుభవం భిన్నంగా ఉన్నది.

రాజకీయ విధానం నుంచి ప్రజాపునాదిని పూర్తిగా విడదీసి చూడలేము. అలాగని రాజకీయ విధానం, సిద్ధాంతం సరైందైనంత మాత్రాన ప్రజాపునాది దానంతట అది పెరగదు. పార్టీ శ్రేణులకు ప్రజలతో ఉన్న సంబంధాలను కూడా పునాది నుండి విడదీసి చూడలేము. సరైన విధానం ఎంత ముఖ్యమో, దానిని అమలుచేసే పార్టీ శ్రేణులకు ప్రజాసంబంధాలు అంతే ముఖ్యం. అందువల్ల క్షేత్రస్థాయిలో ప్రజాపునాది గురించి చర్చించేటపుడు పార్టీ విధానం ప్రభావాలు అనుభవాలుగా చెప్పగల్గినవన్నీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాల దృష్టికి తేవచ్చు. అదే సమయంలో ప్రజలతో ఉన్న సంబంధాలు లోతుగా పరిశీలించటం అవసరం. ఇందుకు ప్రజా కార్యచరణకు సంబంధించిన అనుభవాలను లోతుగా పరిశీలించాలి. కొన్ని జిల్లాల మహాసభల చర్చలు, నిర్ధారణలు పరిశీలిస్తే అనేక విషయాలు అర్థం చేసుకోవచ్చు.

ఒక జిల్లాలో సమాచార హక్కు చట్టం ప్రకారం సేకరించిన వివరాల ఆధారంగా మంచి ఆందోళనలు నిర్వహించారు. ఈఎస్ఐ ఉన్నతాధికారుల అవినీతి కుంభకోణాన్ని బట్టబయలు చేసారు. వెల్‌నెస్ సెంటర్లలో అవినీతి కుంభకోణాన్ని వెలికితీసారు. కార్మికశాఖ వసూలు చేస్తున్న లేబర్ సెస్ నిధుల దుర్వినియోగాన్నీ ఎండగట్టారు. వీటిమీద ఉన్నతస్థాయి విచారణలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలు పార్టీ ప్రతిష్టను పెంచాయి. ఇవి గమనించిన కొంతమంది కార్మికులు యూనియన్లు కూడా ఏర్పాటుచేసుకున్నారు. నగర అభివృద్ధి సమస్యల మీద, నిధులకోత లాంటి అంశాల మీద, మెట్రోరైలు, ఎంఎంటీఎస్ రైల్ సౌకర్యం లాంటి సమస్యల మీద కూడా నిర్దిష్ట సమాచారంతో విలేకరుల సమావేశాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. ఇవి కూడా పార్టీ ప్రతిష్టను పెంచాయి. ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సమస్యల మీద వైద్యుల సమ్మెలో పార్టీ ప్రత్యక్ష జోక్యం చేసుకుని పూర్తి సహకారం అందించింది. ఇది వైద్యులలో పార్టీ పట్ల గౌరవం పెంచింది. పార్టీ ప్రతిష్టను పెంచింది. మరో జిల్లాలో గురుకుల ట్రస్టు భూముల పరిరక్షణ కోసం పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేసారు. ఫలితంగా ప్రభుత్వం ప్రహరీ గోడ నిర్మించింది. ఈ పోరాటం కూడా పార్టీ ప్రతిష్ట పెంచింది. ఈ కార్యక్రమాలన్నీ పార్టీ ప్రతిష్టను పెంచాయి. కానీ ఈ కార్యక్రమాలు నిర్దిష్టంగా ఒక ప్రాంతంలో (గ్రామం లేదా బస్తీ లేదా వార్డులో) ప్రజాపునాది పెంచేవి కావు. ఈ కార్యక్రమాలన్నీ మంచివే. ప్రజాసమస్యలే. సమాజానికి అవసరమైనవే. కానీ ఈ సమస్యలు పరిష్కారమైతే లబ్ది పొందే నిర్దిష్ట లబ్దిదారులను గుర్తించటం సాధ్యం కాదు. లబ్దిదారులందరూ నిర్దిష్టంగా ఒక గ్రామం లేదా వార్డు లేదా మండలానికి చెందినవారు కాకపోవచ్చు. వెదజల్లినట్టుగా అనేక ప్రాంతాలలో నివసించవచ్చు. అందువల్ల అది ప్రజాపునాది రూపంలో వ్యక్తం కాలేదు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఒక మండలంలో సమరశీల పోరాటం చేసారు. దాడులు, కేసులు భరించారు. ఈ సమస్య స్వభావం కూడా పై సమస్యల లాంటిదే. దానికితోడు అన్ని రాజకీయ పార్టీలూ స్పందించాయి. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసాయి. అందువల్ల ఇక్కడ ప్రతిష్ట కూడా అన్ని పార్టీల మధ్య పంపకం అయింది. ప్రజలను బాగా వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్య మీద మంచి ఆందోళన చేసారు. అనేక ప్రాంతాల నుంచి చెత్త సేకరించి తమ ప్రాంతంలో డంప్ చేయడం వల్ల దుర్వాసనను ప్రజలు భరించలేక పోతున్నారు. వర్షం పడినపుడు వర్షపు నీటితో కలిసిన మురుగునీరు కాలనీలకు చేరుతున్నది. టన్నులకొద్దీ చెత్త డంప్ చేయుటంతో భూగర్భజలాలు కూడా కలుషితమవుతున్నాయి. ఈ సమస్యల మీద అధికారులకు వినతిపత్రాలిచ్చారు. 36 గంటల నిరాహార దీక్ష చేసారు. విస్తృతంగా కరపత్రాలు పంచారు. కానీ సమస్య పరిష్కారం అయ్యేవరకు ప్రజలను భాగస్వాములను చేసే విధంగా నిరంతర కృషి జరగలేదు. చేసినమేరకు పార్టీమీద మంచి అభిప్రాయం కలిగింది. కానీ వారి రాజకీయ అనుబంధాలను వదులుకుని కమ్యూనిస్టు పార్టీ వెనుక రావడానికి తగినంత కృషి జరగలేదు కదా! డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం ఒక జిల్లాలో విస్తృతంగా క్యాంపెయిన్ చేసారు. కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నాకు పేదలను సమీకరించారు. చాలామంది అప్లికేషన్లు తీసుకుని వచ్చారు. కానీ కొత్త అప్లికేషన్లు

తీసుకోవద్దని అప్పటికే ప్రభుత్వ ఆదేశాలున్నాయి. ఇక్కడ కొత్త సమస్య ఎదురైంది. ముందే తగిన సమాచారం సేకరించకుండానే ధర్నాకు సమీకరించటం వల్ల దరఖాస్తులు తెచ్చినవారిని సంతృప్తిపరచలేకపోయారు. గతంలోనే దరఖాస్తులు పెట్టినవారిని సమీకరిస్తే, నిర్మించిన ఇండ్లు ఎందుకు కేటాయించటంలేదని నిలదీయవచ్చు. లబ్దిదారుల నిర్దిష్ట వివరాలు సేకరించి, వారినే సమీకరిస్తే ఇది సాధ్యం. సమరశీలంగా కూడా పోరాడవచ్చు. కొత్తగా అప్లికేషన్లు తీసుకోవాలని కూడా పోరాడవచ్చు. ప్రభుత్వం కొత్తగా దరఖాస్తులు తీసుకోవడానికి నిరాకరిస్తున్నదని ప్రజలకు ముందే చెప్పి, దరఖాస్తులు తీసుకోవాలన్న డిమాండు మీద సమీకరించి పోరాడవచ్చు. నిర్దిష్ట సమాచారం సేకరించకుండా, లబ్దిదారులెవరన్న స్పష్టత లేకుండా చేసే మొక్కుబడి కార్యక్రమం మీడియాలో లేదా సోషల్‌మీడియాలో వార్త కోసం మాత్రమే ఉపయోగం. ప్రజాపునాది పెరిగే అవకాశం లేదు. కానీ ఇలాంటి కార్యక్రమాలు అనేకం నిర్వహిస్తున్నాం. మీడియా/సోషల్ మీడియా వార్తలతో సంతృప్తి చెందుతున్నాం.

ఒక గ్రామం మధ్య నుండి వాహనాల రాకపోకలతో దుమ్ములేస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేసారు. ఆ సమస్య మీద, పరిష్కారం అయ్యేంతవరకూ పార్టీ పోరాడింది. వాహనాల రాకపోకలకు అధికారులు బైపాస్ రోడ్డు వేసారు. తర్వాత జరిగిన ఎంపీటీసీ ఎన్నికలలో పార్టీకి ఓట్లు పెరిగాయి. మరొక జిల్లాలో నకిలీ విత్తనాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆ రైతులను సమీకరించి పోరాడింది. రైతులకు నష్టపరిహారం అందింది. ఒక మండలంలో పరిశ్రమల కోసం అసైన్‌మెంట్ భూములు తీసుకున్న ప్రభుత్వం నష్టపరిహారం నిరాకరించింది. పట్టా భూములతో సమానంగా అసైన్డ్ భూములకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని పార్టీ రైతులను సమీకరించి

> **"గ్రామాలలో భూమి, కూలి, ఇండ్లు, ఇండ్లస్థలాలు, కౌలురైతులు, పేదరైతులు, అసంఘటిత కార్మికుల సమస్యల మీద కృషి చేయాలి. పట్టణ ప్రాంతాలలో అసంఘటిత కార్మికుల సమస్యల మీద పనిచేయాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలన్న తేడాలేకుండా మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, రేషన్‌కార్డులు లాంటి సమస్యల మీద నిరంతరం కృషి చేయాలి."**

పోరాడింది. న్యాయపోరాటం కూడా చేసింది. రైతులకు అనుకూలంగా కోర్టు ఆదేశాలు వచ్చాయి. రైతువేదిక నిర్మాణం కోసం ప్రభుత్వం పేదల భూములు గుంజుకునే ప్రయత్నం చేసింది. పేదరైతుల వైపు పార్టీ నిలబడింది. పేదలకు తమ భూమి దక్కింది. ఇలాంటి కార్యక్రమాలలో నిర్దిష్ట లబ్దిదారులు న్నారు. వారినే సమీకరించి పోరాడారు. సమస్య పరిష్కారం కావటంతో వారు పార్టీ లేదా ప్రజాసంఘాలతో ఉంటున్నారు. నిరంతరం వారితో సంబంధాలు కొనసాగిస్తూ, సంఘటితం చేస్తూ, చైతన్యపర్చితే పునాదిగా మారుతారు. సమస్య పరిష్కారం కాని సందర్భాలలో కూడా పార్టీ శక్తిమేరకు పోరాడిందన్న విశ్వాసం కలిగితే పార్టీకి దగ్గరవుతారు. మరికొన్ని జిల్లాలలో వందలు లేదా వేలమందితో ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసారు. అవి నిలబడిన చోట ఆ మేరకు ప్రజాపునాది బలపడ్డది. గుడిసెవాసులు పార్టీతో ఉంటున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా, నిర్లక్ష్యం ప్రదర్శిం చినా, అక్కడ కూడా గండిపడే సందర్భాలూ ఉన్నాయి.

అంతేకాదు. అత్యధిక సందర్భాలలో పార్టీ శ్రేణులు నిరంతరం ఏదో ఒక పనిలో ఉంటున్నారు. కానీ అవన్నీ పై కమిటీల పిలుపులు అమలుచేయటమే. నిరసన కార్యక్రమాలే. అవి స్థానిక సమస్యల మీద పోరాటం కాదు. ఏదో ఒక మేరకు ప్రతిష్ట పెంచేవే తప్ప పునాది పెంచేవి కాదు. అయితే... ప్రతిష్ట ఉన్నపుడే పునాది కూడా బలపడుతుంది. అందువల్ల ప్రతిష్ట పెంచే కార్యక్రమాలు చేయవల్సిందే. వాటితో పునాది పెరుగుతుందనుకోవద్దు. పునాది పెంచే విధంగా స్థానికంగా ప్రజలలో నిరంతరం పనిచేయాలి.

గ్రామాలలో భూమి, కూలి, ఇండ్లు, ఇండ్లస్థలాలు, కౌలురైతులు, పేదరైతులు, అసంఘటిత కార్మికుల సమస్యల మీద కృషి చేయాలి. పట్టణ ప్రాంతాలలో అసంఘటిత కార్మికుల సమస్యల మీద పనిచేయాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలన్న తేడాలేకుండా మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, రేషన్‌కార్డులు లాంటి సమస్యల మీద నిరంతరం కృషి చేయాలి. నివాస ప్రాంతాల్లో మహిళలు, యువతీయువకుల సమస్య మీద నిరంతరం కృషి చేయాలి. ఆట, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలలో సమీకరించాలి. సాంఘిక, సాంస్కృతిక సంబంధాలను విస్మరించకూడదు. ప్రజలు ఇండ్లలో ఉన్న సమయంలో కార్యకర్తలు తమ ఇండ్లలో ఉంటున్నారా లేక ప్రజలలో ఉంటున్నారా పరిశీలించాలి. జనం పొద్దున 8 దాటితే పనులకు పోతారు మన కార్యకర్తలు 8 గం॥ తర్వాతనో 9 గం॥ల తర్వాతనో తీరికగా బయటకు వస్తే ప్రజలను కలవటం సాధ్యపడదు.

సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో విద్యా, వైద్యం ప్రజలకు అందని ద్రాక్ష పండ్లైనాయి. ఏ మాత్రం సహాయం చేసినా పేదలకు అది ఊరట. అందువల్ల సేవా కార్యక్రమాలు, సహాయ కార్యక్రమాలకు ప్రాధాన్యత పెరిగింది. ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి, సమస్యల పరిష్కారం కోసం వారిని సమీకరించటంతో పాటు, సహాయ కార్యక్రమాలు చేయగల్గిన చోట మంచి ఫలితాలున్నాయి. ఇట్లా నిరంతరం పనిచేసిన ప్రగతినగర్, అమరచింత, మరి కొన్ని గ్రామాల్లో ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని కూడా తట్టుకుని ప్రజలు పార్టీతో నిలబడ్డారు. ❋


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.


మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# బౌద్ధ ధర్మం

ఎంవిఎస్ శర్మ



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

"బుద్ధం శరణం గచ్ఛామి
ధమ్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి"

– ఇవి మూడు రత్నాలు అని బుద్ధుని శిష్యులు బుద్ధుడి మరణానంతరం తమ మత విశ్వాసానికి ప్రాతిపదికగా ప్రకటించారు, నేటికీ అదే ప్రాతిపదిక. అశోకుడి కాలం (క్రీ.పూ. 3వ శతాబ్దం) నాటి బైరాత్ రాతి శిల్పం మీద ఈ మూడు రత్నాలూ మనకు కనిపిస్తాయి. బుద్ధుడి జీవితానికి సంబంధించి కొన్ని విశేషాలు మనకు తెలిసినవే. శాక్యగణానికి నాయకుడిగా ఉన్న శుద్ధోధనుడికి, భార్య మహామాయకు సంతానంగా సిద్ధార్థుడుగా బుద్ధుడు జన్మించాడు. తన రక్త సంబంధీకురాలైన యశోధరను వివాహం చేసుకున్నాడు. వారికి రాహులుడు అనే పుత్రుడు కలిగాడు.

చిన్నప్పటినుంచీ సిద్ధార్థుడికి వైరాగ్య లక్షణాలు ఉండేవి. ఒక ముసలివాడిని, ఒక రోగిష్టి వాడిని, ఆ తర్వాత స్మశానానికి తీసుకుపోతున్న ఒక శవాన్ని చూసి తీవ్రంగా ఆవేదన చెందిన సిద్ధార్థుడు ఆ తర్వాత పసుపుపచ్చని దుస్తులు ధరించి బిచ్చమెత్తు కుంటూన్నప్పటికీ, ప్రశాంతంగా, లోలోపల ఆనందంగా ఉండగలుగుతున్న ఒక సన్యాసిని చూసిన తర్వాత అన్నింటినీ విడిచిపెట్టివేయాలన్న నిర్ణయానికి వచ్చాడు. భార్యా, పుత్రులను విడిచిపెట్టి సన్యాసిగా మారాడు. పలువురు సన్యాసులను కలిసి ధ్యానం గురించి తెలుసుకున్నాడు. కాని ఇంకా అనేక సందేహాలు అతడిని వీడలేదు. అలా తిరుగుతూవుండగా, అప్పటికి సిద్ధార్థుడికి 35 సంవత్సరాల వయస్సులో, గయ పట్టణ శివార్లలో ఉన్న ఒక పెద్ద మర్రి చెట్టుకింద (దీనినే ఇప్పుడు బోధివృక్షం అంటారు) ధ్యానానికి కూర్చున్నాడు. ఆ ప్రాంతం బింబిసారుడు రాజుగా ఉన్న మగధ రాజ్యం లోనిది. సిద్ధార్థుడికి ఆ సమీపంలో ఉన్న ఒక రైతుకుమార్తె సుజాత పాలతో చేసిన పాయసం ఆహారంగా ఇచ్చేది. బాధలకు, కష్టాలకు పరిష్కారం ఏమిటన్నది తేల్చుకునేవరకూ అక్కడినుండి కదిలేది లేదని నిశ్చయించుకున్న సిద్ధార్థుడు 49 రోజుల నిరంతర చింతన (ధ్యానం) అనంతరం స్పష్టత పొందగలిగాడు. అలాజ్ఞానోదయం అయినప్పటినుండీ సిద్ధార్థుడు బుద్ధుడు అయ్యాడు. అక్కడినుండి తిరిగి ప్రయాణం కొనసాగించి వారణాసి సమీపం లోని సారనాథ్ వద్ద ఉన్న హరిణారణ్యం (లేళ్ళ గుంపులు ఎక్కువగా తిరుగాడే అడవి) చేరాడు. అక్కడికి అతని పూర్వ సహచర సన్యాసులు అయిదుగురు కూడా చేరారు. అక్కడే వారికి బుద్ధుడు తన మొదటి బోధ చేశాడు. దాంతో ధమ్మ చక్ర పరివర్తన (ధర్మం లో మార్పు) మొదలైంది.

40 సంవత్సరాలపాటు తన బోధనలను బుద్ధుడు కొనసాగించాడు. వైశాలి నగరం వద్ద తన చివరి, 80వ వానాకాలాన్ని గడిపాడు. ఆ సమీపంలోని పావ అనే పట్టణంలో చండా అనే ఒక కమ్మరివృత్తిలో ఉన్న సాధారణ వ్యక్తి బుద్ధుడి శిష్యుడు. అతడి ఆతిథ్యంలో కొన్నాళు ్ళన్నాడు. ఆ తర్వాత అతనికి జీర్ణసంబంధ వ్యాధి సోకింది. అయినా తన సంచారాన్ని కొనసాగించాడు. అక్కడికి సమీపంలో ఉన్న కుశీనార అనే పట్టణాన్ని చేరాడు. ఇది ఇప్పటి గోరఖ్‌పూర్ సమీపంలో ఉంది. ఆ నగర శివార్లలో ఒక సాళవృక్షంకింద విశ్రమించాడు. అక్కడే ప్రాణాలు విడిచాడు. "అత్త దీపో భవ" అన్నవి బుద్ధుడి చివరి మాటలు. "నీకు నువ్వే ఒక దివ్వెగా జీవించు" అని ఆ మాటలకు అర్థం.

బుద్ధుడి దేహానికి అతడి శిష్యులు దహనసంస్కారాలు నిర్వహించిన అనంతరం, ఆ అస్థికలను హిమాలయ పర్వత సానువులలో నివసించే వివిధ గణాలవారు పంచుకున్నారు. ఒక భాగం మగధ రాజు అజాతశత్రు తీసుకున్నాడు.

ఈ గాథలో కొంతవరకూ కల్పితాలు ఆ తర్వాత చేరివుండవచ్చు. ఎక్కువమంది చరిత్ర పండితులు బుద్ధుడి మరణం క్రీ.పూ. 484 లో జరిగిందని భావిస్తున్నారు. ఇది ఇంకో వంద సంవత్సరాల తర్వాత జరిగిందని ఇప్పుడు కొందరు సూచిస్తున్నారు.

బుద్ధుని బోధనల సారాంశం అతడి తొలి బోధనలో ఉంది.

"కోరికల వెంబడి, ఆ కోరికలను నెరవేర్చుకుంటే వచ్చే ఆనందం వెంబడి పోవాలనుకోకూడదు. ఆ కోర్కెలను తీర్చు కోడానికి బాధలను, కష్టనష్టాలను ఎదుర్కోవలసి వస్తుంది. నీచానికి ఒడిగట్టవలసివస్తుంది. కనుక కోరికలకు లోబడకుండా ఉండగలిగితే మనకు స్పష్టత వస్తుంది. శాంతి లభిస్తుంది. లోతైన అవగాహన కలిగి జ్ఞానం సిద్ధిస్తుంది. అందుకోసం మనం అష్టాంగ మార్గం అనుసరించాలి.

(అత్తాంగిక మాగ్గ) అష్టాంగ మార్గం అంటే (సమ్మ దిత్తి) సరైన అవగాహన, (సమ్మ సంకప్ప) సరైన నిశ్చయం, (సమ్మ వాచ) సరైన పలుకు, (సమ్మ కమ్మాంత) సరైన నడవడిక, (సమ్మ అజీవ) సరైన జీవనోపాధి, (సమ్మ వాయామ) సరైన ప్రయత్నం, (సమ్మ సతి) సరిగా గుర్తుంచుకోవడం, (సమ్మ సమాధి) సరైన ధ్యానం – ఈ ఎనిమిది విధానాలు.

**(అరియ సచ్చాని) గొప్ప సత్యం:** బాధల గురించి ఇలా చెప్తుంది. పుట్టుక, వయసు మీద పడడం, రోగం, చావు, మనకు నచ్చనివి తారసిల్లడం, నచ్చినవి దూరం కావడం, తీరని కోరికలు – ఇవన్నీ దు:ఖాన్ని కలిగించేవే.

**కష్టాల గురించిన గొప్ప సత్యం ఇలా చెప్తుంది:** కోరికలను తీర్చుకోవాలనే దాహం మనం పడే కష్టాల్లోంచే వస్తుంది. అది పునర్జన్మకు దారి తీస్తుంది. అది సంతోషాన్ని స్తుంది. ఉద్రేకపరుస్తుంది. వీలైనప్పుడల్లా సుఖాన్ని కోరుతుంది. ఇంద్రియ సంబంధ ఆనందాలను కోరుతుంది. ఇంకా ఎక్కువ కాలం జీవించాలన్న వాంఛను రేపుతుంది. అధికార వాంఛను రగిలిస్తుంది.

**కష్టాలనుండి విముక్తికి సంబంధించిన గొప్ప సత్యం ఇలా చెప్తుంది:** కోరికలను

తీర్చుకోవాలనేదాహాన్ని వదిలించుకోవాలి. అప్పుడు ఎటువంటి ఉద్రేకమూ కలగదు. కోరికలను వదిలించుకోవాలి, దానినుండి విముక్తి పొందాలి, దానికి ఎటువంటి స్థానమూ ఇవ్వరాదు.

**విముక్తి మార్గానికి సంబంధించిన గొప్ప సత్యం ఇలా చెప్తుంది:** అన్ని కష్టాలనుంచివిముక్తి పొందడానికి అష్టాంగమార్గాన్ని అనుసరించండి.

బుద్ధుడు ప్రపంచంలో ఆనందం అనేది లేదని ఎక్కడా చెప్పలేదు. జీవితంలో ఏదోఒక రూపంలో దు:ఖం వెంటాడుతుందని చెప్పాడు. "సముద్రానిది ఒకటే రుచి. ఉప్పగా ఉంటుంది. అదే విధంగా నా సిద్ధాంతానిదీ ఒకటే రుచి. బాధలనుండి విముక్తి ఏ విధంగా కలుగుతుందో వివరించడం."

"సుఖాలను పొందడానికి తాపత్రయపడే వారు అనివార్యంగా ఆ సుఖాలతో కలగలిసి వుండే బాధలకు లోనవుతారు. అటువంటి తాపత్రయం లేనివారికి బాధలనుండి విముక్తి కూడా లభిస్తుంది."

బుద్ధుడికి సోదరుడి వరస అయిన నందుడు అనేవాడు కళ్యాణి అనే యువతి ప్రేమలో పడి యువరాజుగా తన బాధ్యతలను పూర్తిగా విస్మరిస్తాడు. అప్పుడు బుద్ధుడు నందుడితో "నువ్వు నేను చెప్పే అష్టాంగమార్గాన్ని ఆచరించు. ఆ తర్వాత నేనే నీకు 8 మందిఅప్సరసలను కానుకగా ఇస్తాను." అని చెప్పి అష్టాంగ మార్గాన్ని ఉపదేశిస్తాడు. ఆ మార్గాన్ని ఆచరించిన తర్వాత నందుడు పూర్తి సంయమనాన్ని పొంది తన విధులను సక్రమంగా నెరవేర్చడం మొదలుబెడతాడు. అంతేగాక కళ్యాణి పట్ల ఉన్న అతి వ్యామోహాన్ని కూడా అధిగమిస్తాడు.

ఈ కథ ద్వారా అష్టాంగ మార్గం ప్రాధాన్యత తెలుస్తుంది.

కోర్కెల పట్ల వ్యామోహానికి మూలం 'అవిజ్జ' – అంటే అజ్ఞానం అన్నాడు బుద్ధుడు. (1) దు:ఖం విశ్వవ్యాప్తం అని, (2) సమస్తమూ 'అనిచ్చ' – అంటే అనిత్యం (మారిపోతూ వుండేది) అని, (3) అంతా 'అనత్త' – అంటే సారరహితం అని అర్థం అయితే అజ్ఞానం తొలగిపోతుంది అని బుద్ధుడు తెలిపాడు.

శాశ్వతంగా ఉండిపోయేది అంటూ ఏదీ ఉండదని, అదే విధంగా నశించకుండా ఉండే 'ఆత్మ' అనేది (ఉపనిషత్తుల్లో చెప్పినది) ఏదీ లేదని బుద్ధుడు గట్టిగా చెప్పాడు. బుద్ధడి బోధనల్లో ఎక్కడా 'సృష్టికర్త' కు చోటు లేదు. నిరంతరం మారిపోతూ నశించిపోయే ప్రపంచం, ప్రకృతి గురించిన పూర్తి గ్రహింపు

> **"బుద్ధుడు ప్రపంచంలో ఆనందం అనేది లేదని ఎక్కడా చెప్పలేదు. జీవితంలో ఏదోఒక రూపంలో దు:ఖం వెంటాడుతుందని చెప్పాడు. "సముద్రానిది ఒకటే రుచి. ఉప్పగా ఉంటుంది. అదే విధంగా నా సిద్ధాంతానిదీ ఒకటే రుచి. బాధలనుండి విముక్తి ఏ విధంగా కలుగుతుందో వివరించడం.""**



బోధి వృక్షం కింద శాక్య ముని (గౌతమ బుద్ధుడు) జ్ఞానోదయాన్ని వివరిస్తూ క్రీ.పూ రెండవ శతాబ్దంలో చెక్కిన శిల్పం

> “ బుద్ధుడి బోధనలు వైదిక ఛాందసత్వాన్ని, బ్రాహ్మణాధిపత్యాన్ని శక్తివంతంగా సవాలు చేశాయి. బుద్ధుడు, మహావీరుడు ముందుకు తెచ్చిన తాత్విక సిద్ధాంతాలు ఆ నాటి సమాజంలో తాత్విక తిరుగుబాట్లకు దారి తీశాయి. బ్రాహ్మణ సాంప్రదాయాన్నుంచి, ఆ భావజాల చట్రం నుంచి విడగొట్టుకుని స్వతంత్రంగా రూపొందింది కనుకనే బౌద్ధం ఆ తర్వాత కాలంలో, ముఖ్యంగా అశోకుని కాలంలో భారతీయ సమాజాన్ని దాటి ప్రపంచంలో ఇతర ప్రాంతాలకు విస్తరించ గలిగింది. ”

పొందగలగడమే నిర్వాణం (నిబ్బాన) అన్నాడు బుద్ధుడు.

ప్రేమ, ధర్మనిష్ట, ఆనందంగా ఉండడం, ప్రశాంతంగా ఉండడం, తోటి మానవుల పట్ల కనికరాన్ని ప్రదర్శించడం – ఈ అయిదు విలువలను ఆచరించమని బుద్ధుడు ప్రబోధించాడు.

సామాన్యులకు ఆచరించడానికి “దశ శీల” అనే పది మంచి నడవడిక సూత్రాలను బుద్ధుడు సూచించాడు. 1. ప్రాణాలు తీయవద్దు. 2. దొంగతనానికి పాల్పడవద్దు. 3. ఇంద్రియానందంలో మునిగిపోవద్దు. 4. అబద్ధాలు చెప్పవద్దు. 5. మత్తుపదార్థాలను సేవించవద్దు. 6. ఇతరుపై నిందలను మోపడం, అవహేళన చేయడం వద్దు. 7. స్వంత పొగడ్తలు కూడదు. 8. కాపట్యం, దాపరికం కూడదు. 9. శతృత్వం, విద్వేషం వద్దు. 10. ధర్మాన్ని, త్రిరత్నాలను వ్యతిరేకించవద్దు.

బుద్ధుడు, మహావీరుడు దాదాపు ఒకే కాలంలో ఒకే విధంగా తమ బోధనలతో ముందుకు రావడం ఆనాటి చారిత్రక పరిస్థితులలో వచ్చిన పరిణామాలతో ముడిపడివుంది. వ్యవసాయం, పశుపోషణ ఆనాటి గ్రామీణ ప్రాంతాల విస్తరణకు, అభివృద్ధికి దోహదం చేశాయి. అదే సమయంలో పెరిగిన సంపద మిగులుగా పోగుబడి పట్టణాలు, వ్యాపార కార్యకలాపాలు కూడా బాగా పెరిగాయి. తీవ్రంగా ఆ కాలంలో సాగిన మేధోపరమైన, తాత్విక పరమైన పరిణామాలు ప్రధానంగా గ్రామాల్లోని వైదిక జీవితం నుండి కాకుండా, పట్టణాలలోని జీవితాల పద్ధతులనుండి, అనుభవాలనుండి తలెత్తాయి. వైదిక జీవితం యజ్ఞాలచుట్టూ, జంతువధ చుట్టూ తిరుగుతూవుంటే, బుద్ధుడు. మహావీరుడు పశు సంపదను కాపాడుకోవడం గురించి నొక్కిచెప్పారు. “అన్నదా, వన్నదా, సుఖదా” అని బుద్ధుడు పశువుల గురించి చెప్పాడు. అంటే ఆహారాన్ని, అందాన్ని, ఆనందాన్ని ఇచ్చేవి అని అర్థం. బ్రాహ్మణ మతం వడ్డీలకు అప్పులివ్వడాన్ని ఆక్షేపించింది. బుద్ధుడు అప్పులిచ్చేవారు, తీసుకునేవారు పరస్పరం పాటించవలసిన విధులగురించి నొక్కి చెప్పారు. నిజాన్ని చెప్పాలని, దొంగతనం కూడదని, న్యాయం పాటించాలని, దురాశ కూడదని చెప్పడం వెనుక అప్పటికే రూపొందుతున్న వ్యక్తిగత ఆస్థి, కుటుంబ వ్యవస్థలను పటిష్టంగా నిర్వహించడం అనే సామాజిక ఆవశ్యకత ఉంది. రైతులు, వ్యాపారులు, ఆస్థిపరులు అందరూ పరస్పర సమన్వయంతో వ్యవహరించగలిగితేనే ఆనాటి సమాజం పురోగమిస్తుంది. వేట ప్రధానంగా జీవించే ఆదివాసీలు ఎక్కువగా జీవించే ఆరణ్యాలలోకి వ్యవసాయాన్ని విస్తరింపచేయడానికి అహింస సిద్ధాంతం తోడ్పడింది. అదే సమయంలో అడవుల్లో జీవించే తెగలు వ్యవసాయ సమాజానికి లంగి వ్యవహరించాలన్న ఆధిపత్య భావజాలాన్ని కూడా ఇది బలపరచింది. వ్యవసాయ సమాజపు అహింస ఆటవిక సమాజపు హింస కన్నా గొప్పది అన్న వాదన ఆ విధమైన ఆధిపత్యాన్ని సమర్ధించింది.

బుద్ధుడి బోధనలు వైదిక ఛాందసత్వాన్ని, బ్రాహ్మణాధిపత్యాన్ని శక్తివంతంగా సవాలు చేశాయి. బుద్ధుడు, మహావీరుడు ముందుకు తెచ్చిన తాత్విక సిద్ధాంతాలు ఆ నాటి సమాజంలో తాత్విక తిరుగుబాట్లకు దారి తీశాయి. బ్రాహ్మణ సాంప్రదాయాన్నుంచి, ఆ భావజాల చట్రం నుంచి విడగొట్టుకుని స్వతంత్రంగా రూపొందింది కనుకనే బౌద్ధం ఆ తర్వాత కాలంలో, ముఖ్యంగా అశోకుని కాలంలో భారతీయ సమాజాన్ని దాటి ప్రపంచంలో ఇతర ప్రాంతాలకు విస్తరించ గలిగింది. ఆ యా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా బౌద్ధం తన బోధనలను సవరించుకుంటూ పోగలిగింది గనుకనే ఆ విధమైన విస్తరణ సాధ్యపడింది. దు:ఖాన్ని జయించడం అనే బౌద్ధ తాత్విక సిద్ధాంతం విశ్వవ్యాప్తంగా వర్తింపజేయడానికి తోడ్పడగల స్వభావం కలిగివుంది. ఆ విశ్వవ్యాప్త స్వభావమే బౌద్ధాన్ని ఆసియా అంతటా, అటు ఇరాన్ వరకూ విస్తరింపజేయడానికి తోడ్పడింది. క్రైస్తవం, ఇస్లాం మతాల వలే బౌద్ధం ఒక విశ్వ మతం అయింది. ❃

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# భారత జాతీయ కాంగ్రెస్ 36వ వార్షిక సభలు (1921) కోసం కమ్యూనిస్టు పార్టీ రచించిన ప్రణాళిక

**(1921లో అహ్మదాబాద్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ 36వ మహాసభలను ఉద్దేశించి కమ్యూనిస్టు పార్టీ సభ్యులు యంయన్ రాయ్, అబని ముఖర్జీలు ఈ ప్రణాళికను రచించారు. విదేశాలలో ఉన్న యంయన్ రాయ్ దాన్ని మహాసభలకు పంపారు.)**

సోదర భారతీయులారా!

మన దేశచరిత్రలో అత్యంత సంక్లిష్ట పరిస్థితిలో జాతి భవిష్యత్తు, అభివృద్ధికి సంబంధించి ఎదురౌతున్న అనేక ప్రశ్నలపై చర్చించేందుకు మీరు సమావేశమౌతున్నారు. కేవలం రాజకీయపరమైనదే కాక ఆర్థిక, సామాజిక పరమైన గొప్ప విప్లవం ముంగిట నేడు మనదేశం నిలిచివుంది. విస్తారమైన మన ప్రజానీకం ఒక నిర్దిష్టమైన లక్ష్యం వైపు ప్రయాణం ప్రారంభించింది. అనేక శతాబ్దాల ఆర్థిక, రాజకీయ అణచివేత, స్థబ్దత అనంతరం అది మేల్కొంటున్నది. ఈ మేల్కొలుపు వుద్యమానికి భారత జాతీయ కాంగ్రెస్ శిఖరాగ్ర స్థానంలో నిలుస్తున్నది. మీది అత్యంత కష్టతరమైన కర్తవ్యం. ఆ మార్గంలో అనేక ఆటంకాలు, అధిగమించటం సాధ్యం కానంత తీవ్రమైన విద్రోహాలు ఎదురౌతాయి. భారతీయులను జాతీయ విముక్తి దిశగా నడిపించాలన్న మీ లక్ష్యం చాలా వున్నతమైనది. ఈ అత్యున్నత లక్ష్యాన్ని మీరే స్వయంగా రూపొందించుకున్నారు. భారత జాతీయ కాంగ్రెస్ నేడు ఉబుసుపోని వాళ్ళకోసం ఉన్న బాతాఖానీ క్లబ్ కాదు. నిరర్ధకమైన తీర్మానాలు రూపొందించే వేదిక కాదు. అదొక రాజకీయ నిర్మాణ సంస్థ. జాతీయ విమోచన వుద్యమానికి నాయకురాలు.

నూతనంగా ఏర్పడిన ప్రాధాన్యతల రీత్యా కాంగ్రెస్ తన తాత్విక నేపథ్యాన్ని మార్పు చేసుకుని తీరాలి. అదొక స్వీయాత్మక వేదికగా కొనసాగరాదు. నాయకుల ఊహలు, నమ్మకాలు, కోర్కెలు, వ్యక్తిగత అభిప్రాయాలకు అనుగుణంగా కాక, భౌతిక వాస్తవాలపై ఆధారపడి దాని చర్చలు, నిర్ణయాలు వుండాలి. కాంగ్రెస్ పేరుకే జాతీయ సంస్థగా వున్న కాలంలో దానికి నాయకత్వం వహిస్తున్న కొద్దిమంది నాయకుల అభిరుచులు, అభిప్రాయాలకు అనుగుణంగా పనిచేసే రాజకీయ వేదికగా ఉన్నపుడు అటువంటి నిర్ణయాలు జరిగేవి. మెహతా–గోఖలే–బోస్, బెనర్జీల ఆధిపత్యంలో నడచిన పాత కాంగ్రెస్ శకం అంతమైంది. అది ఆచరణాత్మక రాజకీయ క్షేత్రానికి దూరమైంది. తమ స్వీయ వూహలకు అనుగుణమైన ఒక దేశాన్ని నిర్మించాలని వారు కోరుకున్నారు. సమాజంలోని నిర్దిష్ట వాస్తవాలను వారు పరిగణనలోకి తీసుకోలేదు. ప్రజల నాడిని పట్టుకోవటంలో వారు విఫలమైనారు. తాము ఏమి ఆలోచిస్తున్నారో, తమకు ఏం కావాలో వారికి తెలుసు. కానీ దేశంలోని ప్రజల గురించి, తమ సంక్షేమానికి, అభివృద్ధికి వారేం కోరుతున్నారో తెలుసుకోవటం పట్ల వారు పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. సాధారణ ప్రజల అవసరాలను గమనంలోకి తీసుకోనందునే పాత కాంగ్రెస్ రాజకీయంగా దివాళా తీసింది. కేవలం పాలనాపరమైన, ఆర్థిక సంస్కరణలతో కూడిన డిమాండ్లే సాధారణ ప్రజల ప్రయోజనాలను ప్రతిబింబిస్తాయని వారు ఏకపక్షంగా నిర్ధారించుకున్నారు.

తమ మేధో సంపత్తి, తెలివితేటలే జాతికి నాయకత్వం వహించేందుకు అవసరమైన లక్షణాలుగా మితవాద పార్టీలోని వృద్ధ నేతలు నమ్మారు. అన్ని వుద్యమాల్లో అంతర్లీనంగా వుండే సామాజిక శక్తులు ఆ ఉద్యమాలకు అవసరమైన బలాన్ని సమకూర్చుతాయన్నది చారిత్రక సత్యం. స్వీయ మానసిక ధోరణిగల భారత జాతీయోద్యమనేతలు ఈ సత్యాన్ని అవగాహన చేసుకోవటంలో విఫలమైనారు. ఈ ధోరణి వారి స్వీయ పతనానికి, అవమానాలకు, రాజకీయ మరణానికి దారితీసింది. నూతన కాంగ్రెస్ నాయకులారా, గత తప్పులు పునరావృతమైతే గత వైఫల్యాలు పునరావృతం అవుతాయి. అందుకే గత కాలపు తప్పులు పునరావృతం కాకుండా మీరు జాగ్రత్త పడాలి.

సహాయ నిరాకరణ వుద్యమంతో తమ నాయకత్వంలో, అతి తక్కువ సమయంలో స్వరాజ్యాన్ని సాధించాలని కాంగ్రెస్ ప్రణాళిక రూపొందించింది. చట్టబద్ధమైన ఆందోళనలతో స్వల్ప సంస్కరణలు సాధించవచ్చన్న గత కాలపు శక్తిహీనమైన ఎత్తుగడలను ఈ ప్రణాళిక తిరస్కరిస్తున్నది. ఒక సంవత్సరంలో స్వరాజ్యాన్ని సాధిస్తామన్న నినాదాన్ని కాంగ్రెస్ సగర్వంగా, నిశ్చయంగా ప్రకటించింది. ఈ నినాదాన్ని సమున్నతంగా నిలుపుతూ భారతీయులందరూ ఏకం కావాలని ఆకాంక్షించింది. సమున్నతమైన ఈ లక్ష్యం సాధించే వరకూ ముందుకు, మున్ముందుకే సాగిపోవాలని దిశానిర్దేశం చేసింది. స్వయం పాలనకై భారతీయులు పోరాడాలన్న నినాదం సహజసిద్ధమైనది. కానీ జాతీయ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ తన లక్ష్యాన్ని స్పష్టంగా ప్రకటించటమే కాదు. మెట్టు మెట్టుగా తన ప్రజలను లక్ష్యసాధన దిశగా నడిపించాలి. తన కర్తవ్యాన్ని కాంగ్రెస్ అర్థం చేసుకున్నట్లు, దాని అమలుకు ఉత్తమ మార్గానికై అన్వేషిస్తున్నట్లు గత సంవత్సరపు దాని కార్యక్రమాలను బట్టి స్పష్టమౌతున్నది. స్వరాజ్యం కోసం పోరాడాలన్న వుత్సాహాన్ని ప్రజల్లోకి చొప్పించాలి. అందుకే ఈ పోరాటంలో ప్రజలను ఐక్యం చేయాలి.

జాతీయ స్వాతంత్ర్యాన్ని ప్రధాన అంశంగా పాత కాంగ్రెస్ ప్రజల ముందు వుంచలేక పోయింది. పాత నాయకుల కాలంలో అప్రధాన సంస్కరణలకే పరిమితమైన కాంగ్రెస్ రాజకీయ పెదధోరణి మురుగ్గుంటలో పడింది.

**"బాధ్యతారహితమైన అల్లరి విద్యార్థుల సమూహాలు, ఉన్మాదాలు, క్షణికావేశ ప్రేరేపితు లైన మధ్య తరగతి మేధావుల బృందాలు ఒక దేశపు రాజకీయ విభాగానికి సామాజిక పునాదిగా మనజాలవు. ఒక ఉద్యమం శక్తివంతం కావాలంటే పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని కోట్లాది శ్రమజీవులను అక్కున చేర్చుకోవాలి. అలాంటి ప్రజా వుద్యమాన్ని ఎలా నిర్మించాలన్నది ఈ మహాసభ ముందున్న కీలక సమస్య."**

ఆచరణ యోగ్యంకాని ఆదర్శవాదం, రాజకీయ గందరగోళాలకు లోనయింది. ఎంత పేరుగలవారైనప్పటికీ, ఎంతటి దేశభక్తులైనప్పటికీ కొద్దిమంది వ్యక్తుల భావావేశాలు, ఆదర్శవాదా లతో జాతీయ కాంగ్రెస్ కొట్టుకు పోరాదు. భౌతిక వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజల రోజువారీ జీవనాన్ని, వారి కోర్కెలను, వారి బాధలను శ్రద్ధగా అధ్యయనం చేయాలి. మనది కేవలం రాజకీయ క్రీడ కాదు. ఇది గొప్ప సామాజిక పోరాటం. దేశ విముక్తి కోసం ప్రజల హృదయపూర్వక మద్దతును కూడగట్టడం ఎలా అన్నదే 36వ మహాసభ ముందున్న బృహత్తర కర్తవ్యం. వెనుకబడిన ప్రజలను స్వరాజ్ పతాకం వెనుక సమీకరించటం ఎలా ? వారిని పట్టిపీడిస్తున్న సమస్యల పరిష్కారానికి మార్గమేమిటి? వారి భౌతిక జీవనాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన వాతావర ణాన్ని కల్పించేందుకు తక్షణం ఏం చేయాలి? ప్రజలను వేధిస్తున్న తక్షణ సమస్యల పరిష్కారాలతో సహా పలు అంశాలను తన ప్రణాళికలో చేర్చాలి. తద్వారా మాత్రమే కాంగ్రెస్ దేశంలోని విస్తారమైన ప్రజానీకానికి ఆచరణాత్మక నాయకత్వ పాత్రను అందించగలదు.

బాధ్యతారహితమైన అల్లరి విద్యార్థుల సమూహాలు, ఉన్మాదాలు, క్షణికావేశ ప్రేరేపితు లైన మధ్య తరగతి మేధావుల బృందాలు ఒక దేశపు రాజకీయ విభాగానికి సామాజిక పునాదిగా మనజాలవు. ఒక ఉద్యమం శక్తివంతం కావాలంటే పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని కోట్లాది శ్రమజీవులను అక్కున చేర్చుకోవాలి. అలాంటి ప్రజా వుద్యమాన్ని ఎలా నిర్మించాలన్నది ఈ మహాసభ ముందున్న కీలక సమస్య. దేశ స్వాతంత్ర్య సాధనే తమ బాధలకు చరమగీతం పాడుతుందని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులను, పొలంలో శ్రమిస్తున్న కర్షకులను నమ్మించడం ఎలా ? సంపన్న భారతీయుల మిల్లులు, కార్ఖానాల్లో వేలాది కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో కొద్దిమంది కూడా జాతీయోద్యమ నాయకత్వ స్థానాల్లో లేరు. వారి పరిస్థితులు భరించశక్యంగా లేవు. వారితో యాజమాన్యాలు వ్యవహరిస్తున్న తీరుతో తిరుగుబాట్లు అనివార్యమౌతున్నాయి. కొందరు తెలివిగలవారు, దేశ స్వాతంత్ర్యం సాకు చూపి తమకు ఇబ్బందికరమైన ప్రశ్నలను నొక్కేస్తున్నారు. " ముందు విదేశీయుల ఆధిపత్యం నుండి బైటపడనివ్వండి...." అనేది అలాంటి చతురులైన రాజకీయ నేతల తెలివైన వాదనగా వుంది. అవి కేవలం ఉన్నత వర్గాల ముఖస్తుతి కోసం వల్లిస్తున్న కబుర్లు మాత్రమే. కాని నిరుపేద శ్రామికులు ఆకలితో మాడుతున్నారు. వారిని స్వాతంత్ర్య పోరాటంవైపు నడిపించాలంటే వారి భౌతిక పరిస్థితులు మెరుగుపడాలి. "దున్నేవారికే భూమి", "కార్మికునికి రొట్టె" –ఈ నినాదాలు మాత్రమే అత్యధిక ప్రజానీకపు ప్రయోజనాలను ప్రతిబింబిస్తాయి. తద్వారా వారందరూ సమరోత్సాహంతో స్వాతంత్రోద్యమంలో భాగస్వాములౌతారు. చైతన్యయుతులై పోరాడుతారు. 'జాతీయ స్వయం నిర్ణయ హక్కు' వంటి ఆదర్శాలను వల్లించే సిద్ధాంతాలు వారిని నిష్క్రియాపరులను చేస్తాయి. నాయకుల వ్యక్తిగత ఆకర్షణలతో కల్గే వుత్సాహం త్వరగా సడలి, గతించి పోతుంది.

ఖిలాఫత్ పేరుతో ప్రజల్లో శాశ్వతమైన వుత్సాహాన్ని నెలకొల్పాలని కాంగ్రెస్ ఎలా కోరుకుంటుంది? అలాంటి నినాదాల వెనుక దాగివున్న రాజకీయాలను విద్యావంతులైన మేధావులు అర్థం చేసుకోవచ్చు. అత్యధిక భారతీయుల గ్రహణ శక్తి పరిమితం. అలాంటి నినాదాలను వారు అందుకోలేరు. కారణం వారు అజ్ఞానంలో కూరుకుపోయి వున్నారు. అది కేవలం విదేశీ పాలకులు సృష్టించేదే కాదు. మన మతాలు, సామాజిక సంస్థలు కూడా ప్రజలను అజ్ఞాన అంధకారంలోకి నెట్టేశాయి. అలాంటి ప్రజలు కాంగ్రెస్ సిద్ధాంతాలను అర్థం చేసుకుని, అమలు చేయగలరా ? అలాంట పుడు కోరుకున్న ఫలితాలను సాధించటం సాధ్యమా? కాదు. విశాల ప్రజానీకాన్ని అజ్ఞానంలో వుంచి భారత స్వాతంత్ర్య పోరాటంలో వారిని భాగస్వాములను చేయటం సాధ్యం కాదు. మొదట వారి చైతన్య స్థాయిని పెంచాలి. తాము ఎందుకు పోరాడుతున్నారో వారికి స్పష్టంగా అర్థం కావాలి. ఏ లక్ష్యసాధన కోసం పోరాడుతున్నారో, అది వారి తక్షణ అవసరాల్లో భాగమై వుండాలి. సాధారణ భారతీయుడి తక్షణ అవసరాలేమిటి ? రెండు పూటలా తిండి దొరకాలనేదే వారి చిరకాల వాంఛ. అలాంటివారు దేశ ప్రజానీకంలో 90 శాతంగా వున్నారు. అందుకే ఆ ప్రజల అకాంక్షలతో నిమిత్తం లేని వుద్యమాలకు ఎలాంటి ప్రాధాన్యతా వుండదు. అవి శక్తివంతంగానూ రూపొంద లేవు.

కాబట్టి భావోద్రేక తతంగాలకు అతీతంగా కాంగ్రెస్ సిద్ధాంతాలు వుండాలి. ఆచరణ యోగ్యం కాని వున్నత శిఖరాల నుండి సాధారణ ప్రజలు అందుకోగల స్థాయికి దాని సిద్ధాంతాలను దించాలి. ఇహ లోకపు అంశాపై చర్చించేటపుడు కాంగ్రెస్– సాధారణ ప్రజల అవసరాల నుండి విడగొట్టుకోరాదు. శ్రామిక ప్రజల కనీస కోర్కెలను ఎలుగెత్తి ఘోషించాలి. భారతీయుల పోరాట లక్ష్యాన్ని చూపేటపుడు మెసపొటేమియా, అరేబియా, కానిస్టాంటినోపిల్ వంటి గుర్తు తెలియని, సుదూర ప్రాంతాల గురించి ప్రస్తావించరాదు. వారి నివాసాలైన పూరి గుడిసెలు, పని ప్రదేశాలైన భూములు, కార్ఖానాలు వంటి తమ సమీప పరిసరాల్లో పోరాట లక్ష్యాన్ని దర్శించగల్గేలా చేయాలి. ఆకలితో అలమటిస్తున్నవారు తమకు ఆచరణయోగ్యం కాని సిద్ధాంతాల సాధనకు పోరాడగలరని వూహించలేము. ఈతి బాధలకు, వ్యక్తిగత త్యాగాలకు నిలువెత్తు సాక్షీ భూతమైన ప్రజలను కేవలం స్వరాజ్యం కోసం కష్టాలకు సిద్ధం కమ్మని, త్యాగాలకు వెనుకాడవద్దని కాంగ్రెస్ పదేపదే కోరటం సరికాదు. తమ జీవితకాలపు కష్టాలు అంతమౌతాయన్న ఆశావహ పరిస్థితిని వారు మొదట దర్శించగల్గాలి. ఆర్థిక పోరాటాల్లో వారికి సహాయపడాలి. దేశానికి ఒక నిర్దిష్ట ఆర్థిక, సామాజిక పునర్నిర్మాణ ప్రణాళికను రూపొందించటాన్ని కాంగ్రెస్ ఇంకే

మాత్రమూ వాయిదా వేయరాదు. అలాంటి నిర్మాణాత్మక ప్రణాళికలో పీడిత ప్రజల నిత్య జీవిత సమస్యల పరిష్కారాలను సూచించటం, అందుకు అవసరమైన డిమాండ్లను రూపొందించటం 36వ మహాసభ కీలక కర్తవ్యంగా వుండాలి.

ప్రతిభావంతులైన న్యాయవాదుల చర్చా వేదికగా కాంగ్రెస్ వుండరాదన్న గాంధీగారి ప్రకటన సరైనదే. కానీ అదే ప్రకటనలో “ కాంగ్రెస్ వ్యాపారులు, కార్ఖానదారుల విభాగం”గా మారాలని ఆయన సూచిచారు. మెజారిటీ ప్రజల ప్రయోజనాల కోణంలో చూసినపుడు గాంధీ చికిత్సతో కాంగ్రెస్ స్వభావంలో ఎలాంటి మార్పు రాబోదు. దానితో మెజారిటీ ప్రజలకు కాంగ్రెస్ దూరమవటం అనివార్యం. కేవలం వ్యాపారులు, కార్ఖానాల యజమానులే జాతీయ పోరాటాన్ని విజయపథాన నడపలేరు. వీరితో మేధావులు, చిన్నషాపుల యజమానులు తోడైనప్పటికీ వుద్యమానికి తగు బలం సమకూరదు. అందుకు తరగని ప్రజాశక్తి కావాలి. వారి చైతన్యయుతమైన కార్యాచరణ ద్వారా మాత్రమే దేశం విముక్తి పొందుతుంది. స్వరాజ్యం సిద్ధిస్తుంది. తన కర్తవ్య నిర్వహణలో జయ ప్రదం కావాలంటే ప్రజాశక్తిని ఎలా మేల్కొల్పాలో కాంగ్రెస్ తెలుసుకోవాలి. ప్రజలను శక్తివంతమైన పోరాటాల వైపు నడిపించటమెలాగో నేర్చుకోవాలి.

కాని కాంగ్రెస్ అనుసరిస్తున్న ఎత్తుగడలు, దాని అవగాహన ప్రజా ప్రయోజనాలకు భిన్నంగా వున్నాయి. ఒక వైపున ప్రజల అమాయకత్వాన్ని కొల్లగొట్టాలని చూస్తున్నది. వేరొక వైపున ప్రజలు గుడ్డిగా తమ నాయకత్వాన్ని అనుసరించాలని ఆశిస్తున్నది. అది జరుగబోదు. ప్రజలు మేల్కొంటున్నారు. తాము శక్తి సంపన్నుల మన్న సంకేతాలను వెలువరిస్తున్నారు. తమ ప్రయోజనాల కోసం పోరాడేందుకు వారు సిద్ధమౌతున్నారు. వారికి సముచిత స్థానం కల్పించకుండా, వారిని కేవలం తమ చేతి పనిముట్టుగా వినియోగించుకోవాలన్న కాంగ్రెస్ ప్రణాళిక బెడిసికొడుతుంది. సంపన్న వర్గాల చేతిలో రాజకీయ సాధనంగా మారితే కాంగ్రెస్ పెద్ద తప్పు చేసినట్లవుతుంది. జాతీయోద్యమ నాయకత్వ స్థానాన్ని కోల్పోవలసి వస్తుంది. కొన్ని సామాజిక శక్తులు ఆర్థిక, సామాజిక ప్రయోజ నాల సాధనకు కార్మికులు, కర్షకులను నిరంతరం చైతన్యపరిచే పనిలో వున్నాయి. ఆ శక్తులు

“కాంగ్రెస్ అనుసరిస్తున్న ఎత్తుగడలు, దాని అవగాహన ప్రజా ప్రయోజనాలకు భిన్నంగా వున్నాయి. ఒక వైపున ప్రజల అమాయకత్వాన్ని కొల్లగొట్టాలని చూస్తున్నది. వేరొక వైపున ప్రజలు గుడ్డిగా తమ నాయకత్వాన్ని అనుసరించాలని ఆశిస్తు న్నది. అది జరుగబోదు. ప్రజలు మేల్కొంటున్నారు. తాము శక్తి సంపన్నుల మన్న సంకేతాలను వెలువరిస్తున్నారు. తమ ప్రయో జనాల కోసం పోరాడేందుకు వారు సిద్ధమౌతున్నారు. ”



ఎంఎన్ రాయ్



అబని ముఖర్జీ

మున్ముందు తమ సొంత రాజకీయ పార్టీని నిర్మించుకుంటాయి. ఉన్నత వర్గాల రాజకీయ నేతల నాయకత్వంలో దారి తప్పి నడిచేందుకు ఆ పార్టీ తిరస్కరిస్తుంది.

సహాయ నిరాకరణోద్యమం దేశాన్ని ఐక్యం చేయలేదు. ఆర్థిక సూత్రాలను పరిగణనలోకి తీసుకోనందున ఆ వుద్యమం విఫలమైంది. శ్రామికవర్గ అధీనంలో వుంటేనే సహాయ నిరాకరణ ఒక శక్తివంతమైన ఆయుధంగా వుపయోగపడుతుంది. అంత కీలకమైన సామాజిక వర్గాన్ని జాతీయోద్యమ ప్రణాళికకు దూరంగా పెట్టారు. సహాయ నిరాకరణ ప్రవక్త ప్రకటన ఇలా వుంది: “ రాజకీయ అవసరాల కోసం పారిశ్రామిక కార్మికులను వినియోగించ టం ప్రమాదకరం.” ఫలితంగా తన సామా జిక, ఆర్థిక స్థానాన్ని వినియోగించి సహాయ నిరాకరణ వుద్యమాన్ని జయప్రదం చేయగల ఏకైక సామాజిక వర్గం దూరంగా నెట్టబడింది. అందుకు కారణాలు తెల్సుకోవటం కష్టం కాదు. సంపన్నవర్గాల దోపిడీ హక్కును ప్రశ్నించేందుకు వేతన జీవులను సమాజంలో ఎవ్వరూ ప్రోత్సహించరాదని వ్యాపారులు, కార్ఖానవేత్తల పరిరక్షకులు భావిస్తున్నారు. సహాయనిరాకరణ లో పాల్గొనేందుకు వుద్దేశించిన వర్గాలన్నీ ఆర్థికంగా ప్రస్తుత వ్యవస్థపైనే ఆధారపడు తున్నాయి. ఈ వ్యవస్థ ఎంత హేయమైనదో తెలిసినప్పటికీ దాని నుండి వారు తమంతట తాముగా వేరుపడ లేరు.

విదేశీ ప్రభుత్వంపై పోరాడేందుకు సహాయనిరాకరణే సరైన ఆయుధంగా ప్రచారం పొందవచ్చు. విదేశీ ఆధిపత్యం అంతం చేయటం అన్న నినాదం ఒక్కటే విస్తారమైన ప్రజానీకాన్ని కార్యాచరణకు ప్రేరేపించజాలదు. స్వరాజ్య సాధనతో వారికి ఎలాంటి ప్రయోజనాలు కల్గుతాయో స్పష్టంగా వివరించగల్గాలి. జాతీయ సార్వభౌమత్వాన్ని సాధిస్తే అది తమ నిత్య జీవిత సమస్యల పరిష్కారానికి, తమ జీవితాలు సాఫీగా సాగేందుకు సాయపడుతుందన్న విశ్వాసాన్ని వారిలో కల్పించాలి. వాగాడంబరంతో కూడిన ప్రకటనలు, శుష్క వాగ్దానాలతో ప్రయోజనం లేదు. తన కార్యాచరణతో తనకు తానుగా

> **శాసనోల్లంఘన ఆచరణలో ఒక విధమైన జాతీయ సమ్మె వంటిదే. అందరూ పనిమానేస్తే ప్రభుత్వం కుంటుపడుతుందని, తన పిలుపులకు యావన్మందీ సత్వరం స్పందిస్తారని కాంగ్రెస్ ఖచ్చితంగా నమ్ముతున్నదా? అదే నిజమైతే ప్రజల భౌతిక పరిస్థితులు, సర్వ సామాజిక శక్తుల రాజకీయ చర్యలను నిర్ణయించే ఆర్థిక చట్టాలపై వారి అజ్ఞానం మోసపూరితమని భావించాలి.**

కాంగ్రెస్ నిరూపించుకోగల్గాలి. సుదూర భవిష్యత్తులో సాధించబోయే స్వాతంత్ర్యం గురించి చెబుతూ, పేదల తక్షణ అవసరాలను నిర్లక్ష్యం చేయబోమన్న భరోసాను వారిలో నింపాలి.

స్థానిక పారిశ్రామికవేత్తల ప్రయోజనాలను కాపాడేందుకు, వారిని ప్రోత్సహించేందుకు విదేశీ వస్తు బహిష్కరణ ప్రణాళిక ఉపయోగపడుతుంది. బ్రిటీష్ పెట్టుబడిదారీ వర్గాన్ని కట్టడి చేసేందుకు, బ్రిటీష్ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు కూడా ఉపకరించవచ్చు. కానీ అంతిమ విజయావకాశాలను అవి చాలా సమస్యాత్మకం చేస్తాయి. కాంగ్రెస్ పతాకం వెనుక ప్రజలను ఐక్యం చేసేందుకు వుద్దేశించిన విదేశీ వస్త్ర బహిష్కరణ నినాదం విఫలమై తీరుతుంది. కారణం– అత్యధిక ప్రజానీకపు ఆర్థిక పరిస్థితుల మెరుగుదలకు అనుగుణంగా కాంగ్రెస్ పనితీరు లేదు. వారి సమస్యలపై సానుకూల స్పందన కూడా లేదు. విదేశీ వస్త్రాలను దగ్ధం చేయటం వంటి వెర్రిమొర్రి వుత్సాహపు పునాదిపై ఆధారపడే మార్గాన్ని కాంగ్రెస్ ఎంపిక చేసుకోవటమంటే గాలిలో మేడలు నిర్మించాలనుకోవటమే. అలాంటి వుత్సాహం ఎక్కువ కాలం మనలేదు. ప్రజలకు బట్టల కొరత ఎదురౌతుంది. విదేశీ వస్త్రాలు చౌకగా మార్కెట్‌లో అందుబాటులో వున్నంత కాలం ఆ బట్టలు కొనకుండా పేదలను ఆపలేము. లేదా వారిని బట్టలు లేకుండా నగ్నంగా వుండమని చెప్పలేము.

చరఖాకు అనువైన స్థలం మ్యూజియం. అందుకే దాన్ని మ్యూజియంకు తరలించాలి. ఈ కాలపు యంత్రాలతో పోల్చుకుని మన పరిస్థితిని సమీక్షించుకోవాలి. 32 కోట్లమంది ప్రజల అవసరాలను తీర్చేవిధంగా సరఫరా చేయటంపై మన దృష్టి సారించాలి. విదేశీ వస్తు బహిష్కరణ పిలుపుకు స్థానిక ఉత్పత్తిదారుల మద్దతు పొందవచ్చు, కానీ వినియోగదారుల నుండి స్థిరమైన మద్దతును కూడగట్ట లేదు. ఆత్మను శుద్ధి చేసుకునే సిద్ధాంతాలు సంపన్న వర్గ మేధావులకు మంచిగా వుండవచ్చు. కానీ కోట్లాది అన్నార్తులు వారి పట్ల శాశ్వతంగా ఆకర్షితులు కాలేరు. భౌతిక అవసరాలకు హద్దులు లేవు. భౌతిక కారణాలు, అవసరాలకు మించి ఒక రాజకీయ వుద్యమం తన రూపాన్ని మార్చుకొన జాలదు. భారతీయ నాగరికత స్వచ్ఛమైనదని, ఆధ్యాత్మికమైనదని చెప్పేవారు పొరబడుతున్నారు. ఇతర మానవుల గతిని నిర్ణయించే భౌతిక సూత్రాలు భారతీయులకు వర్తించవన్న వారి అవగాహన కూడా పూర్తిగా తప్పు.

శాశ్వత ప్రయోజనాల కోసం ఆశించిన దానిలో స్వల్పభాగం మాత్రమే సహాయ నిరాకరణ సాధించగల్గింది. ఆ దిశలో ఒక అడుగు ముందుకు వేసేందుకే 36వ మహాసభ వుద్దేశించబడింది. ఖిలాఫత్ వుద్యమం, సహాయ నిరాకరణ వుద్యమాల వల్ల ప్రజల్లో రేకెత్తిన వుత్సాహం నానాటికీ తగ్గిపోతున్నట్లు కాంగ్రెస్ నాయకులు గమనించారు. ఈ పరిణామం వారికి ఇబ్బందికరంగా వుంది. లక్షల సభ్యత్వం చేర్పించటం, తిలక్ స్వరాజ్య నిధిని సేకరించటమే కాంగ్రెస్ పట్ల ప్రజాదరణ పెరుగుదలకు సంకేతంగా భావించరాదు. అనుచర బృందాల దృఢత్వము, సహాయ నిరాకరణ ప్రదర్శనల్లో స్థిరత్వం పట్ల ఈ కాలంలో బాధ్యతగల కాంగ్రెస్ నాయకులు పత్రికల ద్వారా, వేదికలపైనా తరచూ తమ నైరాశ్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒక వ్యక్తి కాంగ్రెస్ సభ్యుడిగా చేరటం, స్వరాజ్య నిధికి ఒక రూపాయి చందా ఇవ్వడంతోటే ఆ వ్యక్తి పోరాటంలో చురుగ్గా పాల్గొనేందుకు సిద్ధంగా వున్నాడని నిర్ధారించరాదు.

కృత్రిమంగా ప్రేరేపించబడిన ప్రజాదరణను సజీవంగా నిలబెట్టేందుకు, ఉత్తేజకరమైన పాత్ర కోసం కొత్త దారులు వెతుకుతున్నారు. తెలిసిగాని, తెలియకగానీ ప్రజానీకపు అసంతృప్తిపై వారు దృష్టి సారించటం లేదు. ప్రజల అసంతృప్తిని చైతన్యయుతమైన స్థాయికి అభివృద్ధి చేసేందుకు వారు తోడ్పడటం లేదు. మరొక బాధ్యతా రహితమైన చర్యకు పూనుకున్నారు. కాంగ్రెస్ వార్షిక సమావేశాల వరకూ ఆగకుండానే, శాసనోల్లంఘనకు అఖిల భారత కాంగ్రెస్ కమిటి తీర్మానించింది. ఈ శాసనోల్లంఘన పిలుపును, సహాయ నిరాకరణ కంటే మిన్నగా అమలు చేయటంపై ఆ తీర్మాన రూపకర్తలే సందిగ్ధంలో వున్నట్లు తీర్మానంలో వినియోగించిన భాష తెల్పుతున్నది. "ఈ వుద్యమానికి మద్దతిచ్చే వారందరూ ప్రభుత్వ వుద్యోగాలను వదులుకోవాలని" తీర్మానం కోరుతున్నది. కానీ ప్రభుత్వ వుద్యోగుల్లో 90 శాతం మందికి చాలీచాలని వేతనం లేకుంటే పూట గడవదన్నది వాస్తవం. అందుకే ఈ పిలుపుకు గుర్తించదగిన స్పందనను వూహించలేము.

శాసనోల్లంఘన ఆచరణలో ఒక విధమైన జాతీయ సమ్మె వంటిదే. అందరూ పనిమానేస్తే ప్రభుత్వం కుంటుపడుతుందని, తన పిలుపులకు యావన్మందీ సత్వరం స్పందిస్తారని కాంగ్రెస్ ఖచ్చితంగా నమ్ముతున్నదా? అదే నిజమైతే ప్రజల భౌతిక పరిస్థితులు, సర్వ సామాజిక శక్తుల రాజకీయ చర్యలను నిర్ణయించే ఆర్థిక చట్టాలపై వారి అజ్ఞానం మోసపూరితమని భావించాలి. పౌర, సైనిక వృత్తులను వదిలేయటం అంటే లక్షలాది మంది ప్రజలు తమ జీవనాధారాలను కోల్పోతారు. వారందరికీ కాంగ్రెస్ ఉపాధి కల్పించగలదా? ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న మధ్య తరగతి ఉద్యోగులు శారీరక శ్రమకు సిద్ధంకారని మరచిపోరాదు. కాంగ్రెస్ నాయకులు ఈ సంక్లిష్ట పరిస్థితులను అంచనా కట్టగలరని అనిపిస్తున్నది. సైన్యాన్ని వీడిన వారందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించలేమని గాంధీ గారే స్వయంగా చెప్పారు. కేవలం ప్రజా ప్రదర్శనలతోనే ఒక దేశపు రాజకీయ విభాగం తన కర్తవ్యాన్ని అమలుపరచ లేదు. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడం మాత్రమే మన లక్ష్యం కాదు. మనం స్వాతంత్ర్యం కొరకు పోరాడుతున్నాం. నిర్మాణాత్మక కార్యక్రమానికి అనుగుణంగా కార్యాచరణ వుండాలి. కాంగ్రెస్ నాయకత్వం ప్రజలను రెచ్చగొట్టేవారుగా కాకుండా, మరింత బాధ్యతాయుతంగా వుంటేనే పై లక్ష్యాన్ని సాధించటం సాధ్యమౌతుంది.

శాసనోల్లంఘన తీర్మానాన్ని తేలిగ్గా తీసుకుంటే కాంగ్రెస్ నవ్వులపాలౌతుంది. ఎందుకంటే దేశంలోని అన్ని తరగతులు, వర్గాల ప్రయోజనాలకు కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహించటం లేదు. ప్రజానీకంలో అత్యధికులైన కార్మికులు, రైతాంగం సంక్షేమంపై అది అతి తక్కువగా దృష్టిపెట్టింది. గంభీరమైన ఉపన్యాసాలకు అనుగుణంగా నిర్ణయాత్మకమైన, నిరంతర కార్యాచరణ లేకుంటే ఆ ఉపన్యాసాల వల్ల ప్రయోజనం ఏమిటి? అలాంటి శక్తిహీనమైన ఎత్తుగడలతో ప్రజల స్ఫూర్తిని పెంచలేము. ప్రభుత్వాన్ని భయపెట్టలేము. అలాంటి ఉపన్యాసకులు ముందో వెనుకో అప్రదిష్ట పాలౌతారు. స్వాతంత్ర్య సాధన గడువును నెలల పర్యంతం వాయిదా వేసే ప్రక్రియ మేధావుల్లో విశ్వాసాన్ని నింపలేదు. శబ్దాడం బరపు కాంగ్రెస్ తీర్మానాలు, గాలి మాటల గారడీ నుండి బైటపడటం లేదెందుకు? సామాజిక మార్పులకు అనుగుణంగా కాంగ్రెస్ తన ఎత్తుగడలను నిర్ణయించలేకపోవటమే అందుకు కారణం. పట్టణాల్లో సమ్మెలు, గ్రామాల్లో వ్యవసాయ తిరుగుబాట్ల ద్వారా జనిస్తున్న ప్రజా ఉద్యమాలు ఉద్రిక్తతలకు దారితీస్తున్నట్లు చిత్రించటం కేవలం ఊహాజనితమే. ఇదంతా కాంగ్రెస్, ఇంకా చెప్పాలంటే సహాయ నిరాకణోద్యమ ఫలితమే.

'పైశాచికమైన పశ్చిమ నాగరికత"లను నిరంతరం విమర్శించటం, పంజాబ్ పొరపాట్లను నిరంతరం పునరుద్ఘాటించటం, నిగూఢమైన ఖిలాఫత్ విధానం గానీ పీడిత ప్రజల్లో వ్యతిరేకతను పెంచటం లేదు. వారు నిష్క్రియాపరమైన రాజీనామాల స్ఫూర్తిని శాశ్వతంగా తోసేశారు. ప్రజలను జీవితాంతం వెంటాడుతున్న ఆర్థిక దోపిడి, సామాజిక బానినత్వవే జాతీయ పోరాటానికి మహిమాన్విత రూపాన్ని, శక్తిని సమకూర్చిన ఏకైక అంశం. అదే వారి పోరాట స్ఫూర్తికి మూలం. జాతీయతతో నిమిత్తం లేకుండా ఆ ప్రజా తిరుగుబాటు మొత్తం సంపన్న వర్గాలపై ఎక్కుపెట్టబడింది. చాలాకాలంగా ఈ దోపిడి తీవ్రమౌతున్నది. కానీ యుద్ధ (మొదటి ప్రపంచ యుద్ధం) కాలంలోని ఆర్థిక సంక్షోభం దాన్ని మరింత వేగవంతం చేసింది. యుద్ధానంతరం ప్రజల్లో రగులుతున్న అసంతృప్తి బద్దలవటానికి కాంగ్రెస్ జోక్యం మాత్రం కారణం కాదు. ప్రభుత్వం ప్రజలకు చేసిన వాగ్దానాలన్నింటినీ ఉల్లంఘించింది. అంతే కాదు. యుద్ధానంతరం అసాధారణంగా పెరిగిన వాణిజ్యాభివృద్ధి ఆర్థిక

"కొత్తగా అభివృద్ధి చెందిన పరిశ్రమలు వేలాది కార్మికులను రద్దీ నగరాలకు తరలించా యి. అంతిమంగా వారిలో తిరుగుబాటును అనివార్యం చేశాయి. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తల సంపదల అకస్మికాభివృద్ధి, కార్మికుల పేదరికాన్ని, కడగండ్లను పెంచేసింది. నగర జీవితం కార్మికుల్లో నూతన చైతన్యాన్ని నింపింది. ఇప్పటి వరకూ బ్రిటీష్ పాలనతో నెలకొన్న దయనీయ పరిస్థితులకు స్వస్థి చెప్పాలని వారు సంకల్పించారు."



**1921 డిసెంబర్‌లో జరిగిన అహ్మదాబాద్ సమావేశంలో పతాకావిష్కరణ సందర్భంగా గాంధీజీ, పటేల్, సరోజినీ నాయుడు తదితరులు**

దోపిడిని తీవ్రతరం చేసింది. దానితో ప్రజలలో అసంతృప్తి రగులుకుంది. ఎంతో కాలంగా వారిని కట్టేసిన సహనపు బంధానాలన్నీ తెగిపోసాగాయి. అనివార్యమైన స్థితిలో తెగించి పోరుబాట పట్టారు.

కొత్తగా అభివృద్ధి చెందిన పరిశ్రమలు వేలాది కార్మికులను రద్దీ నగరాలకు తరలించాయి. అంతిమంగా వారిలో తిరుగుబాటును అనివార్యం చేశాయి. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తల సంపదల అకస్మికాభివృద్ధి, కార్మికుల పేదరికాన్ని, కడగండ్లను పెంచేసింది. నగర జీవితం కార్మికుల్లో నూతన చైతన్యాన్ని నింపింది. ఇప్పటి వరకూ బ్రిటీష్ పాలనతో నెలకొన్న దయనీయ పరిస్థితులకు స్వస్థి చెప్పాలని వారు సంకల్పించారు.. ఆస్తులు, సౌకర్యాల మధ్య అసమానతలు స్పష్టంగా కనపడసాగాయి. ఉసూరుమంటూ మౌనంగా కష్టాలను భరించే భారతీయ రైతు స్వభావానికి మంగళం పాడిన సైనికులు తిరగబడ్డారు. ఆ పరిస్థితుల్లో అతని తిరుగుబాటు ఈ ప్రభుత్వంపైనా, ఆ ప్రభుత్వంపైనా అని కాదు. తనను మట్టిలోకి తొక్కెయ్యాలని కోరే క్రూరమైన వ్యవస్థకు వ్యతిరేకంగా అతని తిరుగుబాటు ఎక్కుపెట్టబడింది. ప్రజా తిరుగుబాటు భయంకరంగా అంటుకుంటుంది. ఆ స్ఫూర్తి పలు మార్గాల్లో గ్రామాలకు చేరింది. ఫలితంగా వ్యవసాయ రంగంలో తిరుగుబాట్లు చెలరేగాయి. అవి నేడు దేశమంతటా దావాన లంలా

> **“ భారతదేశాన్ని పునాదులతో సహా కుదిపేస్తున్న విప్లవోద్య మానికి నాయకత్వం వహించాలని కాంగ్రెస్ భావిస్తే కేవలం ప్రదర్శనలు, అత్యుత్సాహంతో కూడిన కార్యక్రమాలకు స్వస్తి చెప్పాలి. కాన్పూర్ కార్మికులు ప్రతిపాదించిన ట్రేడ్ యూని యన్‌ల తక్షణ డిమాండ్లను, కిసాన్‌సభ ప్రణాళికను కాంగ్రెస్ ఆమోదించాలి. ప్రజలు తగినంత త్యాగాలు చేయనందునే స్వరాజ్యం సాధనకు నిర్దిష్ట తేదీని ప్రకటించలేమన్న కాంగ్రెస్ సణుగుడును ఆపితీరాలి. ”**

విస్తరిస్తున్నాయి. ఈ భౌతిక పరిస్థితుల్లో సామాజిక శక్తులు అభివృద్ధి చెందాయి. ఈ శక్తులకు తామే సృష్టికర్తలమన్న మిధ్యా వాదాన్ని రాజకీయ వుద్యమాలు వదిలేయాలి. అంగలుపంగలతో సాగుతున్న సామాజిక శక్తుల ముందు ఆ వుద్యమాలు తలవంచి తీరాలి. వారి చర్య ప్రతి చర్యలకు అనుగుణంగా రాజకీయ వుద్యమాలు తమకు తాము మార్పు చెందాలి. ఈ సామాజిక శక్తులే రాజకీయ వుద్యమాలకు నిజమైన శక్తిని, స్ఫూర్తిని సమకూర్చుతాయి. 'కొన్ని సామాజిక శక్తుల అభివృద్ధి ఫలితమే రాజకీయ వుద్యమాలు' అనేది వాస్తవం.

కార్మికులు, రైతాంగ ఆర్థిక పోరాటాలను నడిపేందుకు కాంగ్రెస్ ఏం చేసింది ? తన రాజకీయ అవసరాల కోసం ప్రజా వుద్యమా లను వాడుకునేందుకు అది ప్రయత్నించింది. ప్రతి సమ్మెను లేదా రైతాంగ తిరుగబాటును తమ రాజకీయ ప్రదర్శనల కోసం సహాయ నిరాకరణ వుద్యమ నిర్వాహకులు వినియోగిం చారు. సమ్మెలు చేస్తున్న ప్రజలు ఆర్థిక ప్రయోజనాలను త్యాగం చేశారు. కాంగ్రెస్ మేధోపరంగా, సైద్ధాంతికంగా, భౌతికంగా ప్రజా సమూహాల నుండి వేరుపడి స్వరాజ్యాన్ని డిమాండు చేస్తున్నది. కానీ అదే ప్రజా సమూహాలను తనతో అత్యంత సన్నిహితంగా కలసిరావాలని కోరుతున్నది. జాతీయ సంక్షేమం కోసం కార్మికులు, రైతాంగం ఎన్ని త్యాగాలకైనా సిద్ధం కావాలని ఎలాంటి సంకోచం లేకుండా పిలుపునిస్తున్నది. కానీ వారి త్యాగాలతో విదేశీ పాలకులకు జరిగిన నష్టం కంటే స్వదేశీ సంపన్నులకు అధిక ప్రయోజనాలు సమకూరాయి. ఈ దేశపు రాజకీయ నాయకురాలిగా కాంగ్రెస్ ప్రకటించుకుంటున్నది. కానీ దాని ప్రతి చర్యా మెజారిటీ ప్రజల భౌతిక ప్రయోజనాలను విస్మరిస్తున్నది. వారికి ద్రోహం చేస్తున్నది. ప్రజలు చేస్తున్న ప్రతి పోరాటం విజయవంతం కావటానికి తన యావత్ శక్తి, సామర్థ్యాలను వినియోగించనంత కాలం ప్రజల నుండి నిలకడైన, చైతన్యవంతమైన మద్దతును కాంగ్రెస్ పొందజాలదు. కాంగ్రెస్ మద్దతు లేకుండానే కార్మికులు, కర్షకులు తమ ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారం కోసం స్వయంగా పోరాటాలను సాగిస్తున్నారు. అంతిమంగా తమ కోర్కెలను సాధించుక ొంటున్నారు. ఈ వాస్తవాన్ని విస్మరించరాదు. అందుకే ఈ నేపధ్యంలో ప్రజలకు కాంగ్రెస్ నాయకత్వ అవసరం అంతగా లేదు. కానీ కాంగ్రెస్ రాజకీయ విజయాలు పూర్తిగా ప్రజల చైతన్యయుతమైన మద్దతుపైనే ఆధారపడి వున్నాయి. అందువలన ప్రజల భౌతిక ప్రయోజనాల పరిరక్షణకు తాను ఎలాంటి కృషి చేయకపోయినప్పటికీ వారు బేషరతుగా తనకు నాయకత్వాన్ని కట్టబెడతారని కాంగ్రెస్ ఆశించరాదు.

గాంధీగారు తన వ్యక్తిగత లక్షణాలతో ప్రజలకు నాయకత్వం వహించవచ్చు. మహాత్మునిగా ప్రార్థనలు అందుకోవచ్చు. కొన్ని పైసలు వేతనం పెంపుదల కోసం పోరాటం చేస్తున్న కార్మికులు 'మహాత్మాకు జై' అంటూ కీర్తించవచ్చు. ఆరంభంలో కసితోనే తిరుగు బాటు ప్రారంభమౌతుంది. తర్వాత దానిలో నూతనోత్సాహం వెల్లువెత్తుతుంది. అది తన పోరాట వాస్తవ లక్ష్యాలతో సంబంధం లేని అనేక అసంకల్పిత చర్యలను చేపట్టే దిశలో సాగవచ్చు. అనేక తరాలుగా ఆకలితో అలమటిస్తున్నవారు అలాంటి నూతనోత్సాహం ఆవరించిన క్షణాల్లో ఏమి కోరతారు? రాజకీయ సార్వభౌమత్వాన్ని కాదు. ఖిలాఫత్ పునరుద్ధర ణను అంత కంటే కాదు. తమను పోరు మార్గం పట్టించిన అత్యల్పమైన నిత్య జీవిత అత్యవసరాలను మాత్రమే వారు కోరతారు. పట్టణ కార్మికులు వేతనాల పెంపును, పని కాలం తగ్గింపును, జీవన పరిస్థితుల మెరుగుదలను కోరుతున్నారు. భూమి, కౌలు, పన్నుల భారం తగ్గింపు, భూస్వాముల అమానుష దోపిడీ నుండి స్వేచ్ఛ కోసం రైతాంగం పోరాడుతున్నారు. సామాజిక పీడన, ఆర్థిక దోపిడీలకు వ్యతిరేకంగా వారు తిరుగుబాటు చేస్తారు. దోపిడీదారులు ఏ జాతి, ఏ ప్రాంతం వారన్న తేడాలతో పోరాడేవారికి నిమిత్తం లేదు. నిజమైన, వస్తుగతమైన విప్లవతత్వంతో పోరాడే శక్తుల స్వభావానికి మచ్చుతునక అది. ఈ దేశపు రాజకీయ పాలనలో జరిగే ఎలాంటి మార్పులనైనా ఈ శక్తులు ప్రభావితం చేస్తాయి. పై సత్యాన్ని కాంగ్రెస్ ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

ప్రజలకు నాయకత్వం వహించాలని కాంగ్రెస్ కోరుకుంటే, ప్రజాశక్తిని మేల్కొల్పేందుకు కృషి చేయకుండా ఆ కోర్కె నెరవేరదు. లేకుంటే గత నాయకత్వం ఎదుర్కొన్న అవమానాలను తానూ ఎదుర్కొనేందుకు అది సిద్ధం కావాల్సి వస్తుంది. ప్రజల చైతన్యయుతమైన మద్దతు పొందేందుకు గొప్ప రాజకీయాలు, అత్యున్నత సిద్ధాంతాలు తోడ్పడవు. కేవలం వారి తక్షణ కోర్కెల సాధనలో సాయపడటం ద్వారా మాత్రమే కాంగ్రెస్ ప్రజలకు చేరువకాగలదు. అపుడు మాత్రమే అది క్రమంగా ప్రజలను ముందుకు నడుపగలదు. ఖిలాఫత్ నినాదాలు, బహిష్కరణ తీర్మానాలు, “చేతిలో చక్రంతో వేదాల పూర్వ కాలానికి చేరటం” వంటి అసంబద్ధమైన సిద్ధాంతాలు అందుకు వుపకరించవు. మధ్య తరగతి మేధావులు, వ్యాపారులను జాతీయ సమ్మెలకు దించే పథకాలు కూడా దేశంలోని మెజారిటీ ప్రజలను కాంగ్రెస్ వెనుక సమీకరించలేవు. మాటలతో ప్రజలను పోరాటాల వైపు మళ్లించలేరు. వారు తిరుగులేని వస్తుగత శక్తులచేత ప్రేరేపించ బడాలి. అణచివేయబడ్డవారు, అప్పులపాలైన వారు, బాధాతప్త కార్మికులు, కర్షకులు తెగించి పోరాడి తీరుతారు. ఎందుకంటే వారికి భవిష్యత్‌పై ఎలాంటి ఆశా మిగల్లేదు. కార్మికులు, కర్షకులను కాంగ్రెస్ తన వెనుక నిలుపుకోవాలి. ఉన్నత లక్ష్యమైన జాతీయ ప్రయోజనాలపేర వారిని త్యాగం చేయమనటాన్ని మానుకోవాలి. అపుడు మాత్రమే కాంగ్రెస్ వారి విశ్వాసాన్ని శాశ్వతం గా నిలబెట్టుకోగలుగుతుంది. వాస్తవంగా వ్యాపారులు, పారిశ్రామిక వేత్తల లబ్ది కోసమే కాంగ్రెస్ జాతీయ ప్రయోజనాల జపం

(మిగతా 34వ పేజీలో)

మతతత్వం

# బ్రిటీష్ వలసపాలనకు నకలు మోడి పాలన



రచయిత న్యూయార్క్, బెర్లిన్ యూనివర్శిటీల్లో ప్రొఫెసర్

**అర్జున్ అప్పాదురై**

గతంలో బ్రిటీషు పాలకులు తమ వలస విధానాల కొనసాగింపుకు ముప్పు వాటిల్లుతుందని భావించినపుడు అమలుచేసిన విధానాలనే నేడు మోడీ అనుసరిస్తున్నాడు.

చాలా మంది వ్యాఖ్యాతల మాదిరిగానే భారతదేశంలో జరుగుతున్నవాటిని ఎలా అర్థం చేసుకోవాలా అని నేను ఆలోచిస్తున్నాను. వలసవాద పరిపాలన అనంతరం ప్రజాస్వామ్య భారతదేశం హిందుత్వవాదుల పాలనలో నిరంకుశంగా మారటం, అవినీతిలోకి దిగజారడం పట్ల నేను చాలా అయోమయంలో ఉన్నాను.

ఎప్పటిలాగే ఇందుకు మనకు అనేక వివరణలు అందుబాటులో ఉన్నాయి. 2014 నుంచి భారతదేశంలో మోడీ అతి బలమైన వ్యక్తిగా మారడంతో పాటు, 2019లో జరిగిన ఎన్నికలలో భారతీయ ఓటర్లు ఆయన పాలనను పునరుద్ధరించారు. మోడీ 2002లో గుజరాత్‌లో ముస్లింలను ఎలా నిర్మూలించాలో చూపించి ఢిల్లీవైపుగా సాగాడు. అంతకుముందు 1992లో జరిగిన బాబ్రీ మసీదు విధ్వంసాన్ని వీటికి నాందిగా చెప్పవచ్చు. ఇంకా వెనక్కు వెళితే దేశ విభజన చేసిన గాయాలు, 1975-77లో ఇందిరాగాంధీ దేశంలో విధించిన ఆత్యయికస్థితి భారత ప్రజాస్వామ్యాన్ని తాత్కాలికంగానైనా అచేతనంగా చేయడం ఎంత సులభమో స్పష్టం చేసింది. ఇతర నిర్ధారణలు కాలానుగుణమైనవి కావు కానీ అంతర్గత శక్తుల మధ్య పోరాటం, ప్రపంచం మితవాద నిరంకుశాధికారం వైపు మరలటాన్ని అవి సూచిస్తాయి.

ఈ కాలక్రమాలను గురించి పేర్కొనడానికి పలురకాల కారణాలున్నాయి. నేను మరో అంశం మీ ముందుంచుతున్నాను. ఇది హిందుత్వ ధోరణికి, తన గురించి అది చేసుకొంటున్న ప్రచారానికి వ్యతిరేకమైనది. 19వ శతాబ్దంలో ఈస్టిండియా కంపెనీ మహారాణి ప్రకటన ద్వారా 1858లో భారతదేశాన్ని బ్రిటీషు సామ్రాజ్యంలో భాగంగా మార్చింది. నాటి బ్రిటిష్ పాలన కాలాన్ని ప్రస్తుత బిజెపి పాలన గుర్తుచేస్తున్నది. ఈ కాలక్రమంలో నేను మోడీ పాలనను, వివిధ రాష్ట్రాలలో పాలిస్తున్న ఆ పార్టీ ప్రభుత్వాలన్నింటినీ భారతదేశంలోని బ్రిటీష్ పాలన ప్రత్యక్ష వారసులుగా చూస్తున్నాను. 1860 అనంతర దశాబ్దాలలో బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన విధానాలు, ప్రస్తుత బిజెపి పాలనలో అమలు జరుగుతున్న విధానాలను పరిశీలిస్తే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పాలించిన బాటలోనే మోడి, ఇతర బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు సాగుతున్నాయని, బిజెపి ప్రభుత్వం బ్రిటిష్ వలస ప్రభుత్వం 2.0 అని స్పష్టమౌతున్నది.

ఈ సారూప్యత వాస్తవామా, కాదా అని నిర్ధారించుకునేందుకు మనం కొన్ని అంశాలను పరిశీలిద్దాం. భారతదేశంలో మొఘల్ పాలనను రాక్షసపాలనగా చూపేందుకు బ్రిటిష్ వారు మొదట చాలా కష్టపడ్డారు. వారు సాధారణంగా భారతదేశ ముస్లిం పాలకులను నిరంకుశులు, హింసావాదులు, అవినీతిపరులు, మోసపూరితమైనవారని చూయించేందుకు ప్రయత్నించారు. 18వ శతాబ్దం అస్తవ్యస్తంగా ఉన్నదని దీనిని తాము క్రమబద్ధీకరించామన్న భ్రమలను వ్యాపింపచేయటానికి ప్రయత్నించారు. దేశ విభజన తర్వాత కాంగ్రెస్ హయాంలోని భారతదేశం కూడా ఇలాంటిదేనని బిజెపి అభిప్రాయం. బ్రిటీష్ వారి ముస్లిం వ్యతిరేక భావనలు ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా నేరుగా దాని బిడ్డ బిజెపికి సంక్రమించాయి. వాస్తవానికి బ్రిటీష్ వారికి హిందువుల పట్ల, ముఖ్యంగా బ్రాహ్మణుల పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఉంది. హిందుమతాన్ని మూఢనమ్మకాలు, విగ్రహారాధన, అసభ్యతకు పరాకాష్టగా భావించారు.

హిందూయిజాన్ని సంస్కరించే నిజమైన సంస్కర్తలు తాము మాత్రమేనని బ్రిటీషువారు భావించిన విషయాన్ని ఇక్కడ మనం గుర్తుచేసుకోవాలి. సతికి వ్యతిరేకంగా, వితంతు వివాహాలను చట్టబద్ధంగా ప్రోత్సహించటం, హిందుమతంలోని ఇతర ఛాందసాలను పారదోలేందుకు విక్టోరియా పాలన తోడ్పడిందని బ్రిటిష్ పాలకులు భావించారు. మోడీ కూడా అదేరీతిగా సమాజంలో ఆత్మ విశ్వాసంతో అభివృద్ధి సాధించటానికి, సాంకేతికాభివృద్ధికి, సామరస్య జీవనానికి వ్యతిరేకతతో అసహన ధోరణులతో కూడిన పితృస్వామ్య, పురుషాధిక్యత వైపుగా హిందూమత సంస్కరణలకు సిద్ధమైనాడు. సామరస్య దృక్పథంతో కూడిన ఒక మృదువైన, మహిళలు, సమాజంలోని మైనారిటీల పట్ల అతి-సహనశీలమైన నెహ్రూ తరహా హిందూయిజం స్థానంలో మూస పద్ధతిలో తీవ్రస్థాయిలో అసహనాన్ని పెంచే ఇస్లామిక్ వ్యతిరేక డిఎన్ఎను ప్రవేశపెట్టడం కోసం స్థిరంగా ప్రయత్నాలు చేయటాన్ని చూడవచ్చు.

ఈ ఆవిష్కరణలోని రెండు భాగాలు 19వ శతాబ్దం ఆరంభంలో హిందూమతం, ఇస్లాం గురించి బ్రిటిష్ పాలకుల అభిప్రాయాలకు ప్రత్యక్ష దర్పణంగా ఉన్నాయి. మనం 21వ శతాబ్దాన్ని పరిశీలిస్తే మోడి, అతని సన్నిహితులు బ్రిటీష్ వారి లాగానే కాంగ్రెస్, గాంధి, నెహ్రూ విధానాల పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తారు. బ్రిటీష్ వారు గాంధీని స్వరాజ్యం కోసం భారతీయులను ఉద్యమంలోకి సమీకరించిన నగ్న ఫకీర్‌గా తృణీకార భావంతో చూశారు. నెహ్రూ పట్ల వారికి పెద్దగా గౌరవం లేదు.

> **"భారతదేశంలోని సంపద అంతా బ్రిటన్‌లోని ఇంపీరియల్ ఖజానాకు చేర్చటమే బ్రిటిష్ సామ్రాజ్యవాదుల లక్ష్యం. భారతదేశ ప్రయోజనాలను పక్కన పెట్టి దానిని తమ స్వప్రయోజనాల కోసం వినియోగించుకొనే వారు. ఈరోజు ఆ విధంగా దేశసంపదను కాజేస్తున్న భారతీయ శత కోటీశ్వరులు, ప్రపంచ కుబేరులు తమ నల్లధనంలో కొంత భాగాన్ని బిజెపి ఎన్నికల ప్రయోజనాల కోసం అందజేస్తున్నారు."**

గాంధీ వారసత్వం పొందేందుకు తన ఆంగ్ల గురువులను పక్కన పెట్టిన ద్రోహిగా పరిగణిస్తారు. గాంధి, నెహ్రూల పట్ల తనకున్న వ్యతిరేకతను బ్రిటీష్ వారి నుంచి మోడి అరువు తెచ్చుకున్నాడు.

కాని మోడీ ఇతర విధాలుగా కూడా బ్రిటన్ సామ్రాజ్యవాదుల బిడ్డగానే వ్యవహరిస్తున్నాడు. ఆయన అమిత్ షా సహాయంతో దేశద్రోహచట్టం, వాక్ స్వాతంత్ర్యం, సమావేశమై నిరసన తెలిపే హక్కుకు సంబంధించి వలసవాద చట్టాలలోని అత్యంత క్రూరమైన నిబంధనలను ఉపయోగిస్తున్నాడు. సైనిక, పోలీసు అధికారాలను ఢిల్లీలో కేంద్రీకరించే చట్టపరమైన నిర్మాణాన్ని అతను ఇష్టపడతాడు. ఆదేశాలను జారీ చేయటం ద్వారా పరిపాలించే విధానాలను అతడు ఆస్వాదిస్తాడు. తన సామ్రాజ్యవాద ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగ వ్యవస్థలను చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నాడు. రిజర్వుబ్యాంక్‌ను, పన్నుల నిర్వహణ యంత్రాంగాన్ని, పోలీసు వ్యవస్థ, తదితరాలను తన అదుపాజ్ఞలలో పెట్టుకుని, వీటిని వక్రీకరించి తన కనుసన్నల్లో నడుపుతున్నాడు. విచిత్రమైన ఆయన ఆర్థిక విధానాలకు కూడా ఇది వర్తిస్తుంది. ముఖ్యంగా పెద్ద నోట్లరద్దు, జిఎస్‌టి లేదా ఇటీవల రద్దు చేయబడిన వ్యవసాయ చట్టాలపై ఆయన అనుసరించిన విధానాలు ఈ అంశాలను స్పష్టం చేస్తున్నాయి. ఆర్థికాభివృద్ధి , జాతీయ ప్రయోజనాల రీత్యా చూసినపుడు ఈ విధానాలు నిరుపయోగమైనవని స్పష్టమయింది.

గత ఐదేళ్లలో ప్రపంచ ఆర్థిక సూచిల్లో భారతదేశం స్థానం తీవ్రంగా పడిపోయిందని చాలామంది విశ్లేషకులు అంగీకరిస్తున్నారు. అయినప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదు. బ్రిటిష్ సామ్రాజ్యానికి వారు ప్రత్యక్ష వారసులు కావడమే దీనికి కారణం. మోడినామిక్స్ అనేవి అదానీలు, అంబానీలు, వారి తాబేదార్లకు మాత్రమే ప్రయోజనం కలిగిస్తాయి. స్థానికంగా ఉండే అవినీతి అధికారులు, గూండా గుంపుల మద్దతుతో భారతీయ నదులు, నేలలు, అడవులు, పొలాల నుండి సమస్త సంపదలను వారి అసంఖ్యాక ప్రాంతీయ తాబేదార్లకు అందించడమే బిజెపి, మోడి విధానాల సారాంశం. ఈ స్థానిక ఉన్నతవర్గాలు వలసరాజ్యాల కాలం నాటి "తెల్ల చీమల"కు ప్రతిరూపాలు. వారు స్థానిక వనరులను తినేస్తున్నారు.

భారతదేశంలోని సంపద అంతా బ్రిటన్‌లోని ఇంపీరియల్ ఖజానాకు చేర్చటమే బ్రిటిష్ సామ్రాజ్యవాదుల లక్ష్యం. భారతదేశ ప్రయోజనాలను పక్కన పెట్టి దానిని తమ స్వప్రయోజనాల కోసం వినియోగించుకొనే వారు. ఈరోజు ఆ విధంగా దేశసంపదను కాజేస్తున్న భారతీయ శత కోటీశ్వరులు, ప్రపంచ కుబేరులు తమ నల్లధనంలో కొంత భాగాన్ని బిజెపి ఎన్నికల ప్రయోజనాల కోసం అందజేస్తున్నారు. రెండు సందర్భాల్లోనూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం, వారి డిమాండ్‌లకు అనుగుణంగా వినియోగించటం జరిగింది.

రెండు చివరి అంశాలు మోడీత్వ పై విశ్లేషణకు సమర్ధనగా ఉన్నాయి. పౌర సమాజంలో జరుగుతున్న నేటి వ్యూహాత్మక యుద్ధం గురించి అజిత్‌దోవల్ ఇటీవల చేసిన ప్రసంగాన్ని పరిశీలించండి. ప్రజాస్వామిక దేశంలోని ఒక ప్రముఖ అధికార వ్యాఖ్యాత నుంచి వచ్చిన ప్రధానమైన ప్రకటన ఇది. కార్యనిర్వాహక వర్గానికి పూర్తి అధికారం ఇచ్చిన ఓటర్లుగా నిర్వచించబడిన ''ప్రజలు'', "పౌరసమాజానికి" మధ్య లోతైన చీలికను సృష్టించడం దోవల్ లక్ష్యం. దీని ద్వారా కళాకారులు, పండితులు, పాత్రికేయులు, కార్యకర్తలు, విమర్శకులను ఇకపై "అర్బన్ నక్సలైట్లు" లేదా ఖాన్ మార్కెట్ గుంపు లేదా తుక్డే–తుక్డే ముఠాగా దుమ్మెత్తి పోయాల్సిన పని ఉండదు. కానీ "పౌరసమాజం" పేరు పెట్టి తమ వ్యతిరేకులందరిపై మరింత తీవ్రంగా దాడులు చేస్తారు.

ప్రజాస్వామ్యాన్ని గురించి ఈ విధమైన వ్యతిరేక అభిప్రాయాలను బ్రిటిష్ సామ్రాజ్యం 2.0 దృక్పథం ఉన్నవారు మాత్రమే వ్యక్తం చేయగలదు, ఇది ఒక విధంగా దేశంలోని అహ్మదాబాద్, బరోడా, సూరత్‌ల నుండి ఢిల్లీకి తరలివచ్చి, దేశాన్ని పాలిస్తున్న సెటిలర్ వలసవాదుల పాలనను తలపిస్తున్నది. బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలన ఉజ్వలంగా సాగుతున్న రోజుల్లో కూడా దేశ స్థిరత్వం, సమగ్రత, చట్టబద్ధతకు "పౌర సమాజం" ముప్పుగా పరిణమించిందని చిత్రీకరించలేదు. ఇది స్వదేశంలో పుట్టిన జాతి వ్యతిరేక దృష్టికోణం కాదు, సెటిలర్ వలసవాదులకు స్వదేశీ జనాభా పట్ల ఉన్న వలసవాద ధిక్కార ధోరణికి సంబంధించినది.

నేను బిజెపి పాలనను సెటిలర్ వలసవాద పాలనగా ఎలా పేర్కొంటున్నాను? ఎందుకంటే వారి స్వీయ–చిత్రం, కొత్తగా రూపొందించిన ఆధిపత్య జాతి – దానిని తీవ్రవాద హిందుత్వ దృష్టితో నిర్వచించటం తదితరాల వలన అలా చెబుతున్నాను. పక్కకు నెట్టబడిన వారిని, భిన్నమైన నమ్మకాలున్న వారిని, సమాజంలో అట్టడుగున ఉన్నవారిని తమ ఆధిపత్యానికి లోబడి ఉండే వారిగా చేసుకొనే హక్కు కలిగి ఉన్నామని చెబుతున్నారు. ఈ సెటిలర్ తరగతి పర్వతాల మీదుగా లేదా సముద్రం మీదుగా వచ్చి ఉండకపోవచ్చు. కానీ భారతదేశంలోని జాతి, మత, పర్యావరణ సాంస్కృతికపరమైన మైనారిటీలపై ఆధిపత్యం, జీవసాంస్కృతిక వ్యత్యాసాలు, సామ్రాజ్యవాద దురహంకారంతో కూడుకున్న సంబంధాలు మాత్రమే వారికి ఉన్నాయి.

కాబట్టి భారతదేశాన్ని హిందూ మెజారిటీవాదం స్వాధీనం చేసుకున్నదనే ఆలోచన తప్పు. కోట్లాది ఇతర మైనారిటీలతో ఏర్పాటైన భారతదేశంలోని నిజమైన మెజారిటీని తోసిపుచ్చి ఆధిపత్యం చెలాయించాలని కోరుకునే వలన వలసవాదుల చిన్న తరగతి భారతదేశాన్ని స్వాధీనం చేసుకున్నది. ఈ కోణంలో చూసినపుడు మైనారిటీలలో మెజారిటి అని ప్రచారం చేసుకొంటున్న సెటిలర్ వలసవాదులు ఇపుడు ఉన్న జనాభా వాస్తవాలను వక్రీకరించటానికి, తక్కువ చేయటానికి, తారుమారు చేయటానికి ప్రయత్నం

(మిగతా 32వ పేజీలో)

# మహమ్మారితో పెరిగిన ఆర్థిక అంతరాలు

**సంజయ్ రాయ్**

ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఎదురైన పరిణామాల వల్ల నిరుపేదల జీవన విధానం మరింత దిగజారిపోయింది. జనాభాలోని వివిధ వర్గాలు, తరగతుల ప్రజలపై దాని ప్రభావం విభిన్నంగా పడింది. మరీ ముఖ్యంగా సంపద కేంద్రీకరణ తీవ్రమౌతున్న పరిస్థితులలో పెట్టుబడిదారీ విధానం ప్రజల మధ్య చేస్తున్న లోతైన విభజనను చూడవచ్చు.

20వ శతాబ్దంలో 1918లో 'స్పానిష్ ఫ్లూ', 1957లో 'ఆసియా ఫ్లూ' 1968లో 'హాంకాంగ్ ఫ్లూ' సంభవించాయి. 21వ శతాబ్దంలో ఇప్పటికే మనకు 2002లో సార్స్ (SARS), 2009లో 'ఏవియన్ ఫ్లూ', 2012లో మెర్స్ (MERS), 2013-14లో ఎబోలా, 2020లో కోవిడ్-19 వ్యాపించాయి. మహమ్మారులు సంభవిస్తున్న కాలవ్యవధి క్రమేణా తగ్గుతున్నది. ప్రపంచంలో ఈ మహమ్మారి మూలాలు పేద దేశాల్లో ఉన్నాయి. అదే విధంగా ఒక నిర్దిష్ట భౌగోళిక పరిస్థితులున్న చోటనే ఇవి వ్యాపిస్తున్నవి. ఈ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా, ప్రత్యేకించి వ్యవసాయ వాణిజ్యం ద్వారా పట్టణ కేంద్రాలలో ఒక చోటు నుంచి మరో చోటుకి, ఒక మనిషి నుంచి మరో మనిషికి వ్యాప్తి చెందుతున్నది. వాణిజ్య మార్గాల ద్వారా ఇటీవల దశల వారీగా తీవ్రమౌతూ, ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. పట్టణాలలో రద్దీగా ఉండే మురికివాడలు, పారిశ్రామిక పట్టణాలు, వలసదారుల ద్వారా వైరస్ ఎక్కువగా వ్యాప్తి అయింది. అయితే ఇతర వ్యాధుల వ్యాప్తి విషయంలో జరిగినట్లుగా ఈసారి వ్యాధి విస్తరణ ప్రపంచంలోని అప్రధాన, పేద ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదు. అందుకు బదులుగా అది పెట్టుబడిదారీ కోటలను ధ్వంసం చేసింది. ధనిక సంపన్న కేంద్రాలు కూడా దెబ్బతిన్నాయి. పేద దేశాలకు సహాయం అందించేవిగానూ అవి నిలబడలేకపోయాయి.

**నిర్దాక్షిణ్యంగా లాభాల వేట**

నయా-ఉదారవాద దశలో పెట్టుబడిదారీ విధానం ప్రకృతిని స్వాధీనం చేసుకొనే జోరు పెరిగింది. ఒక పక్క శ్రమ, మరో పక్క ప్రకృతి... ఈ రెండింటినీ తక్కువ వ్యయంతో ఆధీనంలోకి తెచ్చుకొని, అటువంటి ప్రదేశాలకు ఉత్పత్తిని తరలించే కార్యకలాపాలను ముమ్మరం చేసింది. పశు సంవర్ధక విప్లవం, తత్పర్యవసానంగా ఆహార ఉత్పత్తులను సరుకులుగా మార్చటం, సమీకృత నిర్మాణాలతో పెద్ద ఎత్తున ఉత్పత్తి, జీవ సాంకేతిక ఆవిష్కరణలు, ఈ విధంగా విలువ పెంపొందించే కార్యకలాపాలను కార్పొరేటీకరణ చేయటం పెరిగాయి.

స్టాక్ బ్రీడింగ్, ఆక్వాకల్చర్, హార్టికల్చర్, కోళ్ళ పరిశ్రమ, పందుల పెంపకం, ఇతర పరిశ్రమలను భారీ పెట్టుబడులతో కార్పొరేటీకరణ చేశారు. వీటికి ఆహారంగా ఉపయోగించే వ్యవసాయోత్పత్తులు, ముఖ్యంగా మొక్కజొన్న ధరలు తక్కువగా ఉండటం, వీటిని ఉత్పత్తి చేయటానికి వేతనాలు తక్కువగా ఉండటంతో ఈ పరిశ్రమలను అధికంగా పేద దేశాలకు తరలించారు. అంతేకాకుండా పర్యావరణ నిబంధనలను చాలా వరకు సడలించారు. అటువంటి వ్యవసాయ, వాణిజ్య కేంద్రాలున్న ప్రాంతాలలో జంతువులు, పక్షులతో మానవులు ఎక్కువ సన్నిహితంగా జీవిస్తారు. అధిక జీవసాంద్రతతో కూడిన పరిస్థితులల్లో పక్షులు పెరగటంతో వ్యాధికారకాలు మానవ శరీరాలకు సులభంగా బదిలీ అవుతాయి.

వాతావరణ మార్పు, అటవీ నిర్మూలన, జన్యుపరంగా మానవులు జోక్యం చేసుకోవటం తదితరాలు తరచుగా పర్యావరణ అసమతుల్యతకు దారితీస్తున్నాయి. అంతేకాకుండా అడవి జంతువులు, పక్షులు, కీటకాల ఆవాసాలను నాశనం చేయటం వలన ఈ ఆవాసాలకు సమీపంలో జీవనోపాధి పొందుతున్న ప్రజలకు వ్యాధులు సంక్రమిస్తున్నాయి. అన్ని ఇతర జీవుల వలె కాకుండా, మానవులు తమ ఉత్పత్తి, పునరుత్పత్తికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించే ప్రత్యేక సామర్థ్యాన్ని కలిగి ఉన్నారు. వారు తమ పరిసరాలను మార్చుకోగలుగుతారు. ఆ ప్రక్రియ ద్వారా వారు తమను తాము కూడా మార్చుకుంటారు. కానీ మానవులు కూడా వారు నివసించే ప్రకృతిలో భాగమే. పెట్టుబడిదారీ విధానం తన లాభాల కోసం అదుపులేకుండా ప్రకృతిని వినియోగించుకోవటంతో ఇది చివరికి పెట్టుబడిదారీ విధానానికి మాత్రమే కాకుండా మానవజాతికే సంక్షోభంగా పరిణమిస్తుంది.

అంతేకాకుండా అవధులు లేని లాభాపేక్షతో ప్రకృతి సహజ ప్రక్రియలోకి మానవ కార్యకలాపాలను చొప్పించటం, దాని ఫలితంగా సంభవించే ఫలితాలతో నిమిత్తం లేకుండా తమ ప్రయోజనాలకు అనుగుణంగా దానిని అదుపు చేయాని ప్రయత్నం చేయటం ఒక ప్రత్యేక వర్గం యొక్క కార్యకలాపాల ఫలితం. అందువలన పెట్టుబడి కార్యకలాపాలు తీవ్రం కావటం వలన తనపై జరుగుతున్న దాడికి ప్రకృతి పగతీర్చుకొనే పరిణామాలు తలెత్తుతున్నాయి మినహా సహజంగా సాగుతున్న మానవ కార్యకలాపాలు ఇటువంటి ప్రతిక్రియకు దారితీయవు. అయితే ప్రకృతి వైపరీత్యాలు, అంటువ్యాధులు, పర్యావరణ క్షీణత లాంటి వాటి ప్రభావాలు అన్ని తరగతులపైన ఒకేలాగ ఉండవు. పోషకాహారం తీసుకోలేని ఎందరో నిరుపేదలు రోగనిరోధక శక్తి లేక సులభంగా వ్యాధులకు గురవుతున్నారు. మహమ్మారి నుండి తమను తాము కాపాడుకునేందుకు, నివారణ కోసం ఖర్చుచేసే స్తోమత లేక ఎక్కువగా నష్టపోతున్నారు. తాము చేసుకున్న కొద్దిపాటి

**❝ పేద, మధ్యతరగతి ప్రజలపై మహమ్మారి విభిన్నమైన ప్రభావం చూపుతున్నది. నెలకు రూ. 60,000 సంపాదించే వ్యక్తులకు సగటున 10 శాతం ఆదాయం తగ్గిపోగా, నెలకు రూ. 20,000 కంటే తక్కువ సంపాదించే వారు సగటున 37 శాతం ఆదాయాల్ని కోల్పోవాల్సి వచ్చింది. నిరంతర పని లభ్యత, విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాక్సినేషన్, డిజిటల్ విభజన తదితరాలలో పేదలు, పేదలు కాని వారి మధ్య విభజన పెరిగింది. ❞**

పొదుపు డబ్బుతో ఇంట్లో ఉండి జీవించలేని వారు, ఉపాధి కోల్పోయిన అసంఘటిత కార్మికులు, వలస కార్మికులు, స్వయం ఉపాధి పొందేవారు తమ ఉద్యోగాలు, ఆదాయాన్ని కోల్పోయారు. ధనికులు మాత్రం డబ్బు, అధికారం, సామాజిక సంపదలను ఉపయోగించుకొని ఇటువంటి కష్ట సమయాల్లో తమను తాను రక్షించుకోగలుగుతున్నారు.

శారీరక, మానసిక శ్రమ మధ్య విభజన, వర్గ విభజనతో ఉన్న సమాజాలు అసమానతలను పునరుత్పత్తి చేయటం ఇంతకు ముందెన్నడూ లేనంతగా తీవ్రమౌతున్నది. శారీరక శ్రమ చేసేవారు ఎక్కువగా పరస్పర సంబంధాలతో ఉత్పత్తిలో పాల్గొంటుంటారు. వీరు ప్రధానంగా పేదలుగా ఉంటారు. మానసిక శ్రమ కార్యకలాపాలను దూరం నుండి నిర్వహించవచ్చు. సమాజంలోని ధనవంతులు, మధ్యతరగతి వారు ఎక్కువగా ఆ విభాగాలలో పనిచేస్తున్నారు. పైగా వ్యాధి సోకే ప్రమాదకర పరిస్థితులలో పనిచేసే కార్మికులను నేరస్తులుగా పరిగణించకపోయినప్పటికీ 'కరోనాను వ్యాపింపచేసేవారి'గా వారిపై ముద్ర వేస్తున్నారు. మరోవైపు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి ముద్ర వేసి ప్రచారం చేస్తుండటంతో వీరు నగరాల నుండి బహిష్కరణకు గురయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. కొన్ని తరగతులకు చెందిన వారిని వారి స్థానిక ప్రదేశాల నుండి కూడా అమానవీయంగా బహిష్కరణ చేస్తున్నారు.

**పేదలు ఎక్కువగా బాధలు అనుభవిస్తున్నారు**

వాస్తవానికి ఈ మహమ్మారి అన్ని తరగతుల వారికీ ఒకేవిధంగా నష్టం కలిగించడం లేదు. షేర్ మార్కెట్ చాలా ముందుగానే కోలుకుంది. మహమ్మారి సమయంలోనూ పెట్టుబడిదారులు, ధనికులకు లాభాలు పెరిగాయి. ఈ కాలంలో టెక్ దిగ్గజాల లాభాలు అనేక రెట్లు పెరిగాయి. మహమ్మారి సమయంలో ఆన్‌లైన్ కొనుగోళ్ళు భారీగా విస్తరించటంతో పెద్ద రిటైలర్లు ప్రయోజనం పొందారు. 24 శాతం మంది భారతీయులు నెలకు రూ.3000 కంటే తక్కువ సంపాదిస్తుండగా, ఈ కాలంలోనే గంటకు దాదాపు రూ.90 కోట్లు సంపాదిస్తూ ముఖేష్ అంబానీ ప్రపంచంలోని నాల్గవ సంపన్నుడిగా అవతరించాడు. ఈ కాలంలోనే భారతీయ శతకోటీశ్వరుల సంపద 35 శాతం పెరిగింది.

పేద, మధ్యతరగతి ప్రజలపై మహమ్మారి విభిన్నమైన ప్రభావం చూపుతున్నది. నెలకు రూ. 60,000 సంపాదించే వ్యక్తులకు సగటున 10 శాతం ఆదాయం తగ్గిపోగా, నెలకు రూ. 20,000 కంటే తక్కువ సంపాదించే వారు సగటున 37 శాతం ఆదాయాల్ని కోల్పోవాల్సి వచ్చింది. నిరంతర పని లభ్యత, విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాక్సినేషన్, డిజిటల్ విభజన తదితరాలలో పేదలు, పేదలు కాని వారి మధ్య విభజన పెరిగింది. ఆక్స్‌ఫామ్ సర్వే ప్రకారం మహమ్మారి సమయంలో గ్రామీణ భారతదేశంలోని 32 కోట్ల మంది విద్యార్థులు విద్యను నేర్చుకొనే అవకాశాన్ని కోల్పోయారు. వారిలో కేవలం 4 శాతం మంది మాత్రమే కంప్యూటర్లను కలిగి ఉన్నారు. 15 శాతం మందికి మాత్రమే ఇంటర్నెట్ అందుబాటులో ఉంది. మూడవ వంతు మంది విద్యార్థులు పాఠశాలలకు తిరిగి రాలేరని 40 శాతం మంది ఉపాధ్యాయులు భావిస్తున్నట్లు సర్వే వెల్లడించింది. రాబోయే రోజుల్లో సంపాదన పరంగా పేదలు, పేదలు కానివారి మధ్య అంతరాన్ని ఇది మరింత పెంచుతుంది. 2021 మార్చితో ముగిసిన త్రైమాసికలో లిస్టెడ్ కంపెనీలు అదనపు లాభాలను సంపాదించాయని, మిగులు నిధులు, నిల్వలలో అత్యధిక వృద్ధిని సాధించాయని సిఎంఐఇ అంచనా వేసింది. అయితే నిర్వహణ పెట్టుబడి తక్కువగా ఉండటం వల్ల చిన్న వ్యాపారాలు దెబ్బతిన్నాయి. పొదుపు చేసే మొత్తం క్షీణించటం, నిర్వహణ పెట్టుబడి చాలా వరకు అయిపోవటంతో ఆర్థికవృద్ధి ప్రారంభమైన తర్వాత కూడా వారికి తిరిగి నిధులను సమకూర్చటం కష్టంగా మారుతుంది. ఇదే సమయంలో పెద్ద కార్పొరేట్ సంస్థలు చిన్నవాటిని ఎంచుకొని, వాటిని స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చేయటంతో ఎక్కువగా కేంద్రీకరణ జరిగి, గుత్తాధిపత్యం పెరగటానికి దారితీసింది.

మహమ్మారి పరిస్థితిని వినియోగించుకొని వివిధ స్థాయిలలో అధికారాన్ని కేంద్రీకరించుకోవటానికి కూడా ప్రయత్నం చేశారు. పితృస్వామ్య భావజాలం అధికంగా ఉన్న కారణంగా ఈ మహమ్మారి సమయంలో గృహ హింస మరింత పెరగడాన్ని మనం చూశాం. మహమ్మారి బారిన పడకుండా ప్రజలందరూ రక్షణ చర్యలు అమలు జరపటాన్ని ఆసరాగా చేసుకొని వివిధ సంస్థలు, సంఘాలలో ఆధిపత్యస్థానంలో ఉన్నవారు తమ ఆధిపత్యాన్ని మరింత పెంచుకున్నారు. అందులో భాగంగానే ఈ మహమ్మారి సమయంలో నిరంకుశమైన కార్మిక చట్టాలు, వ్యవసాయ బిల్లులను తగిన చర్చ లేకుండానే పార్లమెంటులో ఆమోదించారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరించే ఎజెండాను ప్రభుత్వం దురుసుగా ముందుకు తెచ్చింది. ఈ విధానాల వల్ల ఎక్కువగా నష్టపోయేది కార్మికులే. లెక్కల్లోకి వెళితే 2019-2020 మధ్య కాలంలో క్రమబద్ధమైన, జీతం పొందే కార్మికుల వాస్తవ ఆదాయాలు 7.6 శాతం, స్వయం ఉపాధి పొందుతున్న వారి ఆదాయాలు 26.4 శాతం తగ్గాయి. రెండు పూటలా తినటం కోసం 46 శాతం భారతీయ కుటుంబాలు అప్పులు చేయాల్సివచ్చింది. అందువలన లాభాల మోహం మన జీవనోపాధికి, జీవావరణానికి మరింత ముప్పుని కలగచేస్తుందని స్పష్టమౌతున్నది. అవధులు లేకుండా సహజ వనరులను విధ్వంసం చేయటం మహమ్మారి ప్రబలటానికి, భారీస్థాయిలో ప్రజల మరణాలకు దారితీసింది. సంక్షోభ సమయంలో కార్పొరేట్లకు ఆర్థిక ప్రయోజనాలు (బెయిల్ అవుట్లు) కల్పిస్తున్నారు. మహమ్మారి కారణంగా సంభవించిన ఆదాయం కోల్పోవటం, నిరుద్యోగం, ఆకలి, దరిద్రం, మరణాలు వంటివి పేదలు భరించాల్సి వచ్చింది.

**(అనువాదం : విష్ణువర్థని)**

ఆర్థిక రంగం

# 'వ్యవసాయ సంక్షోభం కారణాలపై చర్చ జరగాలి'

## ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్‌తో జర్నలిస్టు రోహిత్ కుమార్ ఇంటర్వ్యూ


ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్

రైతుల నిరసన సమయంలో ఢిల్లీ సరిహద్దులలో ఉన్న ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్ నెమ్మది గానే ఉన్నా ఆయనకి అక్కడ విశేషమైన స్థానం ఉంది. ఆయన ప్రభుత్వ తప్పిదాలను తేనె పూసి చెప్పే రకం కాదు.

కొత్త ఢిల్లీ: ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్ నెమ్మదిగా, నమ్రంగా ఉంటారు. అందరి దృష్టి తనవైపు లాక్కునే ప్రయత్నం ఆయన చెయ్యరు. నిజానికి, టిక్రి సరిహద్దులో నేను ఎవరితో చానా బతూర తిన్నానో ఆయన మామయ్యే షహీద్ భగత్‌సింగ్ అని ఎవరో నాకు చెప్పిన తరువాతే తెలిసింది.

రైతు నిరసన వార్షికోత్సవ సందర్భంగా టిక్రి దగ్గర వేలాదిమంది రైతులతో సుదీర్ఘమైన, ఎంతో స్ఫూర్తి నిచ్చిన రోజు గడిపిన తరవాత ఇంటికి బయలుదేరుతూ 'ట్రాలీ టైమ్స్' టెంట్ దగ్గర ఒక్కసారి ఆగుదామనుకున్నాను. నేను అలా చేయటం మంచిదే అయింది.

జగ్మోహన్ సింగ్ వచ్చారని అక్కడే తెలుసుకున్నాను. ఇంచు మించు రోజంతా సింఘు సరిహద్దు దగ్గర రైతులతో గడిపి, మిగిలిన సమయం టిక్రి రైతులతో గడపటానికి వచ్చారు.

స్వతంత్ర పోరాటయోధులను సరైన దృక్పథంతో అర్థం చేసుకునేందుకు ప్రజలకు సహాయపడే బాధ్యతను చాలాకాలం క్రితం తల్లి ( భగత్‌సింగ్ చెల్లెలు బీబీ అమర్‌కౌర్) ఆయనకు అప్పగించిందని మా మాటల్లో ఆయన స్పష్టం చేశారు.

ఈ 77 ఏళ్ళ ఆచార్యుడు తన మామయ్య జ్ఞాపకాన్ని, సందేశాన్ని సజీవంగా ఉంచేందుకు జీవితాన్ని అంకితం చేశారు. ప్రస్తుతం ఆయన లూధియానాలోని భగత్‌సింగ్ సృజనాత్మక కేంద్రానికి డైరెక్టర్. ఆయన ఐఐటి ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థి, పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగ విశ్రాంత అధిపతి.

ఆయన రైతులతో సుదీర్ఘమైన రోజు గడిపిన తరవాత కూడా రైతుల నిరసనలపై నేను అడిగిన ప్రశ్నలకు ఎంతో ఓపిగ్గా సమాధానం చెప్పారు.

**రైతుల నిరసనను మీరు ఏ విధంగా చూస్తారు? మీ ఉద్దేశంలో దీని ప్రాముఖ్యత ఏమిటి?**

మూడు విషయాలు నాకు జ్ఞాపకం వస్తాయి. మొదటిది, 113 ఏళ్ళ తరవాత చరిత్ర పునరావృతం అయింది. భగత్‌సింగ్ యొక్క మామయ్య అజిత్ సింగ్, సూఫీ అంబా ప్రసాద్‌తో కలసి 1907 లో పగడి సంభాల్ జత్త (తలపాగా రక్షణ) ఉద్యమం చేశారు.

అది కూడా ఇప్పటి ఉద్యమం లాగానే అతి పెద్ద, శాంతియుత రైతుల ఉద్యమం. యాదృచ్ఛికంగా అది కూడా బ్రిటిష్ వాళ్ళు విధించిన దోపిడీ వ్యవసాయ చట్టాలు మూడింటిని రద్దు చేయాలని ఉద్యమమే.

ప్రస్తుత ఉద్యమం 12 నెలల్లో చేసిన మాదిరిగానే ఆ ఉద్యమం కూడా అప్పటి ప్రభుత్వం చేసిన వ్యవసాయ చట్టాలను తొమ్మిది నెలల్లో వెనక్కి తీసుకునేటట్లు చేయటంలో సఫలీకృతం అయింది.

తరవాతది, గురు గోవిందసింగ్ తన అనుయాయులను వ్యక్తిగతంగా కాక, ఐదుగురు ఒక సమూహంగా ఉండి నిర్ణయాలు తీసుకునేటట్టు ప్రోత్సహించటం గుర్తుకు వస్తోంది. ఐదుగురు కలిసి నిర్ణయం తీసుకుంటే అది చక్కగా, సమగ్రంగా ఉంటుంది. ఈ ఉద్యమంలో 475 మంది నాయకులు కలసి నిర్ణయాలు తీసుకుంటున్నారు!

నాయకత్వంలో వచ్చిన ఈ మార్పు నిజంగా చరిత్రాత్మకం. వ్యక్తి నాయకత్వ పద్ధతి నుండి ప్రజాస్వామ్య పద్ధతిలో ఇంకా విశాల ప్రాతిపదికతో నడవడం గొప్ప విషయం. మన గ్రామాలు ఎలా నడుస్తాయి, ఏ విధంగా నిర్ణయాలు తీసుకుంటాయి అనే దాన్ని కూడా ఈ మార్పు ప్రభావితం చేస్తుంది.

చివరగా, ఈ నిరసన వల్ల గ్రామాలలో ఉన్న మహిళలు తమ గొంతు విప్పటానికి, తాము ఎదుర్కొంటున్న వ్యవసాయ ఇబ్బందుల గురించి మాట్లాడటానికి ఉపయోగపడింది.

**ప్రభుత్వ ప్రతిస్పందన గురించి మీ అభిప్రాయం?**

తన 'తపస్సు' గురించి మోదీ గంభీరమైన ప్రకటనలు చేశారు. కాని కార్పొరేట్లకు పూలదండలు వేయటం తపస్సు కాదు. నిజమైన తపస్సు మన రైతు సోదర, సోదరీమణులు చేసినది. ఈ రోజు నేను పి. సాయినాథ్‌తో చర్చిస్తూ ఈ ఉద్యమం భారత దేశంలో ఎంత పెద్ద సామాజిక మార్పు తేనుందో, అలానే కార్పొరేట్ పెట్టుబడిదారీ సంస్కృతిని చాలా గొప్పగా ఎదుర్కొన్న తీరును గురించి కూడా మాట్లాడాను.

ఈ నిరసనలో ముందుకు వచ్చి పాల్గొన్న యువతని తప్పనిసరిగా మెచ్చుకోవాలి. ఇది చూస్తుంటే సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు యువశక్తి అవసరం అని 1924లో 17 ఏళ్ళ భగత్‌సింగ్ చెప్పినది గుర్తొస్తోంది. కానీ యువత ఉద్యమం యొక్క పునాది ఈ మూడింటి మీద ఉండాలి. 1) మత ఛాందసవాదం, మూఢనమ్మకాల నుండి విముక్తి 2) దుష్టమైన కులవ్యవస్థ నుండి విముక్తి 3) హేతుబద్ధత, శాస్త్రీయ దృష్టి.

సమస్యలు ఎందుకు ఉన్నాయి అని నీకు అర్థం అయినప్పుడు వాటిని పరిష్కరించటం నీకు సాధ్యమౌతుంది.

నిజమైన పోరాటం గురించి భగత్‌సింగ్‌కి పూర్తి స్పష్టత ఉంది. అది కేవలం బ్రిటీష్ వాళ్ళనుండి స్వాతంత్ర్యం తెచ్చుకోటం కాదు, భారతీయుల మధ్య అసమానతలు అంతం

**"ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ (ఒఇసిడి) లోని దేశాలు (ప్రపంచంలోనే అత్యధిక ధనిక దేశాలుగా ఉన్న కొన్ని దేశాలు) 'భారతదేశంలో వ్యవసాయం'పై ఇచ్చిన నివేదిక ప్రకారం భారతదేశంలో రైతులకు ఇస్తున్న కనీస మద్దతు ధర ఇతర దేశాలలో వారి రైతులకు ఇస్తున్న దానికంటే చాలా తక్కువగా ఉంది. వారి నివేదిక ప్రకారం ఇలా అతి తక్కువ మద్దతు ధర ఇవ్వటం వల్ల ప్రపంచ మార్కెట్‌లో భారతీయ వ్యవసాయం మంచి లాభసాటిగా ఉంటుంది."**

కావాలి. పైన ఉన్న 1 శాతం అత్యంత ధనికులుగా,మిగిలిన 99 శాతం పేదవారుగా ఉన్నారు. ఈ అసమానతలు అంతం కావాలి.

ఈ మధ్యనే ఫ్రెంచి ఆర్థికవేత్త పికెటీ ఏమన్నారంటే భారతదేశంలో 20వ శతాబ్దంలో ఉన్న అసమానతలు 2016లో కూడా కొనసాగుతూనే ఉన్నాయి. అంటే ఇంకా మనం ఆ సంక్లిష్ట పరిస్థితులతోనే వ్యవహరిస్తున్నాం, దీనిని పరిష్కారం చూపేది ఒక్క హేతుబద్ధమైన సామ్యవాదమే.

ఈ రైతుల ఉద్యమం నిజమైన ప్రజాస్వామిక విజయానికి, 2024 (ప్రస్తుత ప్రభుత్వ గడువు పూర్తవుతుంది) ప్రజల విజయానికి పునాది వేసింది.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే 1920లలో భగత్‌సింగ్ కార్యకలాపాలలో పాల్గొంటున్న సమయంలో భారతదేశంలో మరొక సంఘటన కూడా జరిగింది. ఆర్.ఎస్.ఎస్. (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) అనే మతసంస్థ కూడా పుట్టింది. సాధు వస్వాని భావాలు తన కాలంలోని యువతని ఎటువైపు లాగుతాయన్న విషయాన్ని భగత్‌సింగ్ ఒక వ్యాసంలో హెచ్చరించారు. జ్ఞానం, వివేకం వేదాలతో పుట్టి, వేదాలతోనే ఆగిపోయింది అనే వస్వాని వాదనతో భగత్‌సింగ్ తీవ్రంగా విభేదించారు.

ఇది ఇలా ఉండగా మత అభినివేశం యువతని ఎంతగా ఆకర్షిస్తుందో ఆయనకి చాలా బాగా తెలుసు. అలానే వివేచన, హేతుబద్ధత మాత్రమే సమస్యలు పరిష్కరించగలుగుతాయి కానీ మతం కాదు అని కూడా ఆయనకి స్పష్టంగా తెలుసు.

### వ్యవసాయ చట్టాల రద్దు మీరు ఏ విధంగా చూస్తారు?

వ్యవసాయ చట్టాల రద్దుని శూన్య ఫలిత క్రీడ అంటాను. ఇది కావాలనుకున్నది కార్పొరేట్ కానీ రైతులు కాదు. భారతదేశంలో వ్యవసాయ సంక్షోభానికి అసలైన కారణాలపై చర్చ జరగాల్సి ఉంది.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ (ఒఇసిడి) లోని దేశాలు (ప్రపంచంలోనే అత్యధిక ధనిక దేశాలుగా ఉన్న కొన్ని దేశాలు) 'భారతదేశంలో వ్యవసాయం'పై ఇచ్చిన నివేదిక ప్రకారం భారతదేశంలో రైతులకు ఇస్తున్న కనీస మద్దతు ధర ఇతర దేశాలలో వారి రైతులకు ఇస్తున్న దానికంటే చాలా తక్కువగా ఉంది. వారి నివేదిక ప్రకారం ఇలా అతి తక్కువ మద్దతు ధర ఇవ్వటం వల్ల ప్రపంచ మార్కెట్‌లో భారతీయ వ్యవసాయం మంచి లాభసాటిగా ఉంటుంది. ఒఇసిడిలోని దేశాలకి రెండు అడ్డంకులు కనబడ్డాయి, ఒకటి అత్యవసర వస్తువుల చట్టం, రెం

డు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ చట్టం (ఈ రెంటినే కేంద్ర వ్యవసాయ చట్టాలు తొలగించపూనుకున్నాయి). భారతదేశం వీటిని తొలగిస్తే వ్యవసాయం 'లాభదాయకంగా' ఉంటుంది అన్నాయి.

ఇప్పుడు రైతులు ఎదుర్కొంటున్న అంశాలపై మాట్లాడటానికి ఒక కమిటిని ఏర్పాటు చేస్తామని అంటోంది. కానీ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలోని లాబీదారులు కార్పొరేట్లకే అనుకూలంగా పని చేస్తారు కానీ రైతాంగానికి అనుకూలంగా పనిచేయరు. దీనికి బదులుగా రైతుల నమ్మకం పొందేందుకు, వ్యవసాయ కమిషన్‌ను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది.

రైతులకు కనీస మద్దతు ధర ఇస్తే ప్రభుత్వ ఖజానా మొత్తం ఖాళీ అవుతుంది అని మరో అబద్ధం ప్రచారం. ఇది పూర్తిగా అబద్ధం. ఒకవేళ ఎక్కువ డబ్బు రైతులకు ఇవ్వగలిగితే అది వారి వినియోగ శక్తిని, తద్వారా దేశంలో గిరాకిని పెంచుతుంది. ఇది ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు సహాయపడుతుంది. కానీ దీనికి బదులుగా ఆర్థికవ్యవస్థ బలపడటానికి ప్రభుత్వం చేస్తున్నది ఏమిటి? పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదారులకు పన్నులు తగ్గిస్తుంది.

### ఏ దారిలో ప్రజలు ముందుకు సాగాలనుకుంటున్నారు?

పల్లె ప్రజలు స్వావలంబన కలిగి ఉండటం నేర్చుకోవాలి. భగత్‌సింగ్ ముత్తాత గారు 1858లో కట్టిన ఇంటి కథ చాలా ఆసక్తికరమైనది. ఈ ఇంటిని ఆయన పూర్వీకుల ఇల్లుగా జాగ్రత్త చేసాము. ప్రజలు ఆయన్ని ఈ ఇల్లు ఎందుకు కట్టారు అని అడిగినప్పుడు ఇలా సమాధానం చెప్పారు, "గ్రామస్థులందరూ కలసి ఒక చోట చేరి, తమ సమస్యలు చర్చించుకునేందుకు, ఒకసారి ఇలా చేస్తే వారే సమస్యలకి పరిష్కారాలు కనిపెట్టడం వీలవుతుంది" అప్పుడు గ్రామస్తులు ఇలా అడిగారు, 'అలా అయితే ఆయన తన పెద్ద స్వంత భవంతినే ఈ పనికి ఎందుకు వాడలేదు అని. దానికి ఆ పెద్దాయన ఇలా అన్నారు, " గ్రామస్తులు నా ఇంట్లో కూర్చుంటే, నిర్ణయానికి నా వైపు చూస్తారు. చివరి మాట నాదవుతుంది. వారు తమ గురించి తాముగా ఆలోచించరు. వేరుగా ఉన్న ఇంటిలో అందరూ స్వతంత్రులే, సమానమే."

ఆయన ఆ పల్లెలో మొట్టమొదటి ప్రజాతంత్ర రాజ్యం సృష్టించారు. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి, మిమ్మల్ని పట్టించుకోవు అందుకే మీ సమస్యల గురించి మీరు మాట్లాడుకుని, పరిష్కారాలు వెతుక్కోడంలో మీకు మీరే సహాయం చేసుకోవాలి అన్నారు.

పంజాబ్ స్త్రీ లని చూడండి. క్రితం సారి జరిగిన రెండు ఎన్నికలకు ఎజెండా వాళ్ళే పెట్టారు – మాదక ద్రవ్యాల దుర్వినియోగం గురించి. మాదక ద్రవ్యాలు ఎవరు తీసుకున్నా కొడుకైనా, భర్తైనా, తండ్రైనా, సోదరుడైనా బాధ అనుభవించేది స్త్రీనే. ఆమే సమాజానికి కేంద్ర బిందువు. ఈ రోజు స్త్రీకి ఆ విషయం తెలిసింది.

చివరిగా మనం గుర్తుంచుకోవలసిన విషయం భారతదేశంలో రకరకాల ఉద్యమాలు ఒకదాన్నొటి ప్రోత్సహించుకొంటూ, ఒక ఉద్యమం మరో ఉద్యమ నిర్మాణానికి ప్రోద్బలం ఇచ్చాయి. 1907లోని తలపాగా రక్షణ ఉద్యమం గదర్ పార్టీ ముందుకు వెళ్ళేలా చేసింది. ఇది 1919లో జలియన్ వాలాబాగ్‌లో హిందు, ముస్లిం, సిక్కులు ఐక్యంగా రామ నవమి చేసుకునేలా చేసింది. ప్రతి ఉద్యమం మరో ఉద్యమానికి పునాది వేసింది. అలాగే రైతుల ఉద్యమం కూడా చాలా గట్టి పునాది వేసింది.

(మిగతా 32వ పేజీలో)

**కరోనా ప్రభావాలు**

# ఆన్‌లైన్ విద్యతో బడికి దూరమైన చిన్నారులు



**మీనా టి పిళ్లై**

కోవిడ్ 19 మహమ్మారి ఫలితంగా వరుసగా విధించిన లాక్‌డౌన్‌లు దేశ విద్యావిధానంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఆన్‌లైన్ విద్యకు అవసరమైన స్తోమత లేనందున లక్షలాది మంది బాలలు విద్యకు దూరం కావాల్సి వచ్చింది. కుల, వర్గ అణచివేతలో నూతన విధానాలు కూడా రంగంలోకి వచ్చాయి.

ఒక ఉదయం నేను హిమాచల్ ప్రదేశ్‌లోని అత్యంత ఎత్తైన కొండలపై ఉన్న కోమిక్ గ్రామానికి వెళ్ళాను. మంచుతో నిండిన కొండ శిఖరాలు దూరంగా, అత్యంత ఎత్తుగా కనిపిస్తున్నాయి. టీ కోసమని ఒక చిన్న దుకాణం వద్ద ఆగాను. ఆకాశంలో పక్షుల వలె స్వేచ్ఛగా తిరుగుతున్న చిన్నారులు నా చుట్టూ చేరారు. మీకు ఆన్‌లైన్ తరగతులు ఎప్పటి నుండి ప్రారంభమౌతాయన్న నా ప్రశ్నతో వారి తల్లిదండ్రులు బాధతో నన్ను చూస్తూ ఉండిపోయారు. హిమాలయ పర్వత ప్రాంతంలో ఉన్న స్పితిలోయలోని ఈ చిన్న గ్రామాలను వెదకటం ప్రారంభించినప్పటి నుండి నా స్మార్ట్‌ఫోన్ డెడ్ అయింది. ఈ చిన్న పిల్లలు బహుశ ఎప్పుడూ పాఠశాలకు వెళ్ళి ఉండరు. వారి తల్లిదండ్రులు వారికి ఇంటి వద్ద విద్య నేర్పించలేరు. వారంతా నిరక్షరాస్యులుగా ఉన్నారు. ఢిల్లీ నుండి టూరిస్టుగా వచ్చిన ఒక మహిళ ఈ పిల్లల దీనస్థితిని చూసిన తర్వాత పక్క గ్రామంలో ఉండి వీరికి విద్య నేర్పుతున్నదని ఇదంతా చూస్తున్న టీ షాపు యజమాని నాతో చెప్పాడు. అనేకమంది ధనికులైన భారతీయుల లాగానే నేను కూడా ఆన్‌లైన్ విద్య అనే ఊహల్లో తేలిపోయానని, కాని ఈ మహమ్మారి వ్యాపించిన కాలంలో హిమాలయ పర్వతప్రాంతంలో అది అసంభవమని అక్కడి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

కోవిడ్ 19 తీసుకొచ్చిన తీవ్రమైన సామాజిక విపరిణామాలలో ఒకటి భారతదేశంలో దాదాపుగా ఒకటిన్నర సంవత్సరం పాటు పాఠశాలలు మూతపడి ఉండటం. జీవనాధారాలను పోగొట్టటం, ప్రాణాలు పోవటంతో పాటు విద్యారంగంలో చోటు చేసుకున్న ఈ అత్యవసర పరిస్థితి కోట్లాది మంది బాలల భవిష్యత్‌పైనా, భవిష్యత్ అవకాశాలపైనా తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయి. సమ్మిళిత, సమానావకాశాలతో కూడిన విద్యను కోట్లాదిమంది బాలలకు తిరస్కరించటం వ్యక్తిగతంగా వారి భవిష్యత్‌కు నష్టమే కాక, తీవ్రమైన విధ్వంసకర పరిణామాలకు కూడా కారణమౌతుంది. బలహీనులైనవారు, సమాజంలో అట్టడుగున ఉన్నవారు ధనికుల కన్నా అత్యధిక సంఖ్యలో ఉన్న దేశంలో అవకాశాలు లేని మెజారిటీ ప్రజలు తీవ్రమైన ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్నపుడు, తమ జీవనాధారం సంపాదించుకోవటం కోసం నిరంతరం పోరాటంలో మునిగి ఉండే ప్రజలు కోవిడ్ లాంటి తీవ్రమైన ప్రమాదం తమను ఎదుర్కొంటున్నపుడు రానున్న ప్రమాదాలను గురించి అర్థం చేసుకోలేరు.

ఈ విధంగా కొనసాగుతున్న పరిస్థితులు తరాలు మారుతున్న కొద్దీ అసమానతలను పెంచటంతో పాటు ఆ సమాజాలు, మొత్తం దేశ భవిష్యత్‌పై కూడా ప్రభావం చూపుతాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందటంతో ముడిపడి ప్రస్తుతం విద్యారంగంలో కొనసాగుతున్న అసమానతలు బాల్య జ్ఞాపకాలపై తీవ్ర గాయాలుగా గుర్తుండిపోతాయి. ప్రస్తుతం సంక్షోభం నెలకొన్న సమయంలో దీర్ఘకాలం కొనసాగే వ్యక్తిగత, సామాజిక విపరిణామాలకు దారితీస్తాయి.

**బాలల్లో పెరుదుతున్న మానసిక ఒత్తిడి**

మహమ్మారి ఫలితంగా ఏర్పడిన అనిశ్చిత పరిస్థితుల వలన మానసిక ఆందోళన, ఒత్తిడి, భవిష్యత్‌ను గురించి భయం, తమకు లభించే మద్దతు తగ్గిపోతున్నదనే తీవ్రమైన ఆందోళన బాలల్లో పెరుగుతున్నదని దేశంలో నిర్వహించిన అనేక సర్వేలలో వెల్లడైంది. ప్రతిగంటకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకొంటున్న దేశంలో ఇది దేనిని సూచిస్తున్నది? మహమ్మారి ప్రారంభమైనప్పటి నుండి భయానకమైన విధంగా ఆత్మహత్యలు పెరుగుతున్నప్పటికీ వీటిని అతి తక్కువగా చూపుతున్నారు. ఈ సమస్యకు మౌలిక కారణాలేమిటో పరిశీలన చేయటానికి కూడా అధికారులు పూర్తి అయిష్టతను చూపుతున్నారు. ఖైదీల వలె తమ గృహాలకే పరిమితమైన వీరు తమకు తెలియని ప్రపంచం నుండి సహాయం కోసం చేతులు చాస్తున్నారు. ఇళ్ళలో సేవకులుగా, వలస కార్మికులుగా పనిచేస్తున్న తమ తల్లిదండ్రులు అత్యంత చౌకగా లభించే మొబైల్ ఫోన్‌ను, కనీసం రెండు జిబిల డాటాను కూడా పొందలేని స్థితిలో ఉన్నారని అనేకమంది చిన్నారులు అర్థం చేసుకోలేకపోతున్నారు. పాఠశాలలో లభించే ఆనందం పొందటం కోసం మొబైల్ ఫోన్, డాటా లేకుండా పాఠశాలలో భాగస్వాములు కాలేరు కాబట్టి ఒక మొబైల్ ఫోన్, డాటా కోసం తీవ్రంగా ఆరాటపడుతున్నారు.

కనెక్షన్లు తీసివేయటం, అవుటాఫ్ కవరేజ్ ఏరియా తదితరాలతో అవి అప్పటికే లేకుండాపోయాయి. పిల్లలు కలలు కంటున్న విధంగా వారిని తిరిగి తీసుకువచ్చి, తరగతి గదులలో కూర్చోబెట్టి క్లాసులు నడిపే ప్రయత్నాలు జరగటం లేదు. వారు లేకుండానే చదువుకొనే పండుగలు యధావిధిగా కొనసాగుతున్నాయి. విద్య నేర్చుకోవటంలో ఏ కారణం లేకుండా హత్యకు గురైౖ అమరజీవులుగా వీరు మారారు. ప్రపంచ స్థాయి విద్య(వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్)వైపు చేస్తున్న

> **" అనేకమంది బాలికలకు పాఠశాల మానివేయటం అంటే వారి బాల్యం కూడా ముగిసిపోయినట్లే. స్వాతంత్ర్యా నంతరం సాధించిన మహిళా సమానత్వం తదితరాలు పక్కకుపోయి దారిద్ర్యం, హింసా ప్రవృత్తి తదితరాలు బాలికలను గృహశ్రమలో భాగస్వామిని చేస్తుంటాయి. యూనిసెఫ్ లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం 15 లక్షల మంది బాలికలకు 18 సంవత్సరాలకు ముందే పెళ్ళిళ్ళవుతున్న దేశంలో వారికి విద్యను నిరాకరించటం అంటే వారిలో ఎక్కువ మంది తిరిగి పాఠశాలకు రావటం అంటూ ఉండదు. "**

ప్రయాణపు చరిత్ర పుటల్లో కనీసం వీరికి సంతాపం తెలియచేయటం కూడా ఉండదు. మనకాలంలో సంభవించిన తీవ్రమైన విషాదంగా ఇది మిగిలిపోతుంది.

**'లాక్డ్ అవుట్:** ఎమర్జెన్సి రిపోర్ట్ ఆన్ స్కూల్ ఎడ్యుకేషన్' 2021 ఆగస్టులో 15 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో నిర్వహించిన సర్వేలో అత్యంత ఆందోళన కరమైన పరిస్థితులు, హృదయ విదారకమైన సంఘటనలు వెల్లడైనాయి. (ఈ సర్వేను అస్సాం, బీహార్, చండీఘర్, ఢిల్లీ, గుజరాత్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ లో నిర్వహించారు).

**అత్యవసర నివేదిక**

గ్రామీణప్రాంతంలోని విద్యార్థులలో 37 శాతం మంది చదవటం లేదని, సర్వేలో పాల్గొన్న విద్యార్థులలో సగం మంది కొద్ది వాక్యాల కన్నా చదవలేకపోయారని చెప్పారు. పట్టణప్రాంతాలలోని విద్యార్థులలో 24 శాతం, గ్రామీణప్రాంత విద్యార్థులలో 8 శాతం మాత్రమే ఆన్‌లైన్ క్లాసులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలోని బాలల్లో 92 శాతం మంది నేర్చుకోవటానికి, విజ్ఞానాన్ని పొందటానికి ఎటువంటి అవకాశాలు లేని స్థితిలో వదిలివేయబడ్డారు. న్యాయమైన, సమ్మిశ్రిత భవిష్యత్ కోసం నిలబడటానికి విఫలమైన సమాజంలో అన్ని అవకాశాలు ఉన్నవారు వీరి యొక్క పరిస్థితిని గురించి ఆలోచించటానికి సమయం వృధా చేయకపోవచ్చు.

అత్యవసర నివేదిక పాఠశాల విద్యార్థుల అక్షరాస్యతా రేటును 2011 సెన్సస్ రిపోర్టుతో పోల్చి చూసిన తర్వాత ఆశ్చర్యపరిచే వాస్తవాలు వెల్లడైనాయి. దశాబకాలం విద్య తర్వాత మహమ్మారితో అక్షరాస్యత రేటు తీవ్రంగా పడిపోయింది. ఒకే వయసు వారిలో 2011 కన్నా నిరక్షరాస్యత నాలుగు రెట్లు పెరిగింది. దళితులు, ఆదివాసుల పిల్లలలో ఇది మరింత ఎక్కువగా ఉంది. విద్య కొందరికే ప్రత్యేకమైనది కాదు. ప్రతివారికి జన్మహక్కు. గత 550కి పైగా రోజులలో అత్యంత బలహీనమైన, అత్యంత పేదలైన, విద్య ఎక్కువగా అవసరమైనవారికి అందించామని మనం స్వచ్ఛమైన మనస్సాక్షితో చెప్పగలమా?

మన విద్యావ్యవస్థలోని బలహీనతలను ఈ మహమ్మారి వెల్లడిచేసింది. కులవ్యవస్థలో దిగువస్థాయిలో ఉన్నవారి చెవులలో కరిగించిన సీసం పోసిన చరిత్ర ఉన్న ఈ దేశంలో సాంకేతిక ఆధిక్యతను సాధించిన బ్రాహ్మణిజం తిరిగి అణచివేతను కొనసాగించటానికి ప్రయత్నం చేస్తున్నది. స్వాతంత్ర్యం సాధించిన ఏడు దశాబ్దాల తర్వాత కూడా ఈ అణచివేత విధానాలను ప్రతిఘటించటానికి పోరాటం చేస్తున్నాం.

శిష్యుల బొటనవేళ్ళు కావాలని కోరి చరిత్రలో నిలిచిపోయిన పురాణాలలోని గురువుల వలె ప్రస్తుత తరంలోని ధనికుల పిల్లలు ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న చరిత్రలో హీరోలుగా నిలిచిపోవాలా? ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో దరిద్రం, కులవ్యవస్థ అత్యంత పెద్ద మరకలుగా ఉన్నాయన్న విషయాన్ని గుర్తించటానికి నిరాకరిస్తున్న మన మొద్దుబారిన తనాన్ని ఏ విధంగా వివరించాలి? దేశంలో 36.4 కోట్లమంది అత్యంత పేదరికంలో ఉన్నారని, రోజువారీ రాజకీయాలు వ్యవస్థాగతమైన అసమానతలతో ఉన్నాయని, నిరుద్యోగం, లింగపరమైన అసమానతలు తీవ్రస్థాయిలో ఉన్నాయని గుర్తించటానికి కూడా మనం సిద్ధం కావటం లేదు. కోవిడ్ మహమ్మారి దేశంలో పట్టణ ప్రాంతాలలోని కోట్లమంది ప్రజానీకాన్ని తీవ్రమైన దరిద్రంలోకి నెట్టింది. వీరు దేశంలోని సాధారణమైన ఆదాయాన్ని సంపాదించుకొనే ప్రజల స్థాయికి చేరాలంటే ఏడుతరాలు పడుతుందని వివిధ అధ్యయనాలలో స్పష్టమౌతున్నది. అత్యవసరమైన వారికి విద్య నందించే సమ్మిళితమైన సంస్థలు, అటువంటి భావజాలం లేకుండా సమాజంలోని దిగువ తరగతుల ప్రజానీకాన్ని ఉన్నతస్థాయికి తీసుకురావటం ఎలా సాధ్యమౌతుంది? దేశంలోని 22 కోట్లమంది రోజుకు 32 రూపాయలు మాత్రమే ఖర్చు పెట్టగలిగిన ఈ దేశంలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయటం, దానితో పాటు ఉచితవిద్యను, మధ్యాహ్న భోజనాన్ని ఆపివేయటం, విద్యలో సమానత్వాన్ని నిరాకరించటం అంటే అర్థం ఏమిటి? ఈ విధమైన ఆర్థిక దుస్థితిలో ఉన్నవారు ఏ కనికట్టు ద్వారా నెట్‌వర్క్ కనెక్షన్‌తో ఫోన్ లేదా కంప్యూటర్‌ను పొందగలరు? ధనికులు, పేదల మధ్య విభజితమై ఉన్న ప్రపంచంలో మధ్య తరగతి వారు ధనికుల ఆశలు, ఆకాంక్షలతో కొట్టుకుపోతున్నపుడు, పేదవారి జీవితాల వలెనే ఇటువంటి ప్రశ్నలు కూడా అసంగతమైనవిగా ఉంటాయి.

అనేకమంది బాలికలకు పాఠశాల మానివేయటం అంటే వారి బాల్యం కూడా ముగిసిపోయినట్లే. స్వాతంత్ర్యానంతరం సాధించిన మహిళా సమానత్వం తదితరాలు పక్కకుపోయి వ్యవస్థాగతంగా పెరుగుతున్న దారిద్ర్యం, హింసా ప్రవృత్తి తదితరాలు బాలికలను గృహశ్రమలో భాగస్వామిని చేస్తుంటాయి. యూనిసెఫ్ లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం 15 లక్షల మంది బాలికలకు 18 సంవత్సరాలకు మందే పెళ్ళిళ్ళవుతున్న దేశంలో వారికి విద్యను నిరాకరించటం అంటే వారిలో ఎక్కువ మంది తిరిగి పాఠశాలకు రావటం అంటూ ఉండదు. ఫలితంగా దేశజనాభాలోని సగం మంది జాతీయాభివృద్ధి నుండి అనేక దశాబ్దాలు వెనక్కుపోతారు. స్త్రీ, పురుషుల మధ్య ఉన్న అసమానతలను పూడ్చటం గురించి ఆలోచన ప్రారంభించటానికి ఇది సరైన సమయం. ఇంటర్‌నెట్ ద్వారా మహిళల హక్కులను ఎలుగెత్తి చాటేవారు, ఆన్‌లైన్ ద్వారా మహిళా సంస్థలు ఏర్పడటం మార్పు గురించిన ఆశలు రేకెత్తిస్తున్నాయి. డిజిటల్ రంగంలో అనేక మంది తమ గొంతును వినిపిస్తున్నప్పటికీ డిజిటల్ అక్షరజ్ఞానం లేకపోవటం వలన అందరితో కలిసిపోవటం అనేది అనేకమంది బాలికలకు, మహిళలకు కలగానే మిగిలిపోతున్నది. భౌతిక ప్రపంచంలో లింగ అసమానతలు డిజిటల్ ప్రపంచంలో కూడా ప్రతిఫలిస్తూ పాదకముందే నాలుకలను, ఎగరకముందే రెక్కలను తెగనరుకుతున్నాయి.

ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య

దేశంలో దీనికి అర్థం ఏమిటి? విద్య లేకుండా ప్రజాస్వామ్యానికి అర్థం లేదనే భావనకు బదులుగా పోస్ట్‌ట్రూత్ భావజాలం విస్తరించిన కాలంలో నమ్మకాలు, సిద్ధాంతాలు, రెచ్చగొట్టే ధోరణులతో అభివృద్ధిని కొలవటం జరుగుతున్నది. మతమౌఢ్యంతో ఉన్నవారు, తప్పుదారిలో పోతున్న అభివృద్ధి నిరోధకులు, జాతీయ భావాలను ఉపయోగించుకొంటూ ఇతరుల పట్ల ద్వేషాన్ని రెచ్చగొడుతున్న వారు మొత్తం ప్రజానీకాన్ని తమ అదుపాజ్ఞలలో ఉంచుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు.

మన ప్రజానీకానికి డిజిటల్ పరికరాలను, ఆర్థికవ్యవస్థలను నిర్వహించే అక్షరజ్ఞానాన్ని అందించి, వారిని డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ఉన్న పౌరులుగా తీర్చిదిద్దటానికి ప్రయత్నం చేయకపోతే డిజిటల్ ప్రజాస్వామ్యానికి మార్పు చెందాలన్న ఆకాంక్ష పూర్తిగా విఫలమౌతుంది. దేశ ప్రజానీకంలో నాలుగోవంతు మంది, 35 కోట్ల ప్రజలు ఇంటర్‌నెట్‌కు దూరంగా ఉన్న పరిస్థితులలో దీనిని సాధించటం దాదాపుగా అసాధ్యం. కోవిడ్ మహమ్మారి ప్రపంచవ్యాపితంగా సాధారణ స్థితికి చేరుతున్న పరిస్థితులలో ఇంతకు ముందే చర్చించిన కొన్ని పూర్తిగా మోసపూరితమైన విధానాలు బిల్లులు, చట్టాలుగా రూపొందే క్రమంలో ఉన్నాయి.

**“ మన ప్రజానీకానికి డిజిటల్ పరికరాలను, ఆర్థిక వ్యవస్థలను నిర్వహించే అక్షరజ్ఞానాన్ని అందించి, వారిని డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ఉన్న పౌరులుగా తీర్చిదిద్దటానికి ప్రయత్నం చేయకపోతే డిజిటల్ ప్రజాస్వామ్యానికి మార్పు చెందాలన్న ఆకాంక్ష పూర్తిగా విఫలమౌతుంది. దేశ ప్రజానీకంలో నాలుగోవంతు మంది, 35 కోట్ల ప్రజలు ఇంటర్‌నెట్‌కు దూరంగా ఉన్న పరిస్థితులలో దీనిని సాధించటం దాదాపుగా అసాధ్యం. ”**




**డిజిటల్ విభజనను పూరించే విధానాలు**

కోవిడ్ మహమ్మారికి ముందే ఉన్న అసమానతలు, అన్యాయాలు ఆ తర్వాత ప్రజానీకాన్ని మరింత బలహీనులుగా చేశాయి. కష్టాలను ఎదుర్కోగల వారి శక్తిని మరింత బలహీనపర్చాయి. చారిత్రకంగా అవకాశాలు నిరాకరించబడిన ప్రజా సమూహాలు కోవిడ్ మహమ్మారితో మరింతగా బలహీనులైనప్పటికీ, వారిలోని యువతరం ఈ వైరస్ ప్రభావాన్ని ఎదుర్కోవచ్చు. కాని దరిద్రం వలన వారు సామూహిక రోగనిరోధక శక్తిని పొందలేని స్థితిలో ఉన్నారు. వలసవచ్చిన కార్మికులు, పేదరైతులు, దినకూలికి వెళ్ళే కార్మికులు, రిక్షా కార్మికులు, వీధుల్లో తిరుగుతూ సరుకులు అమ్ముకొనేవారు, దరిద్రంలో ఉన్న ఇతరుల పిల్లలకు ఉన్న డిజిటల్ వ్యత్యాసాన్ని మనం ఏ విధంగా పూర్తి చేయగలం?

పూర్తిగా ప్రపంచీకరణ జరుగుతున్న, డిజిటల్ పరిజ్ఞానంతో ఆర్థిక విధానాలు విస్తరిస్తున్న సమయంలో దీని వైపుకు క్రమంగా మార్పుచెందటాన్ని, ఆన్‌లైన్ విద్య యొక్క ప్రయోజనాలను కాని ఎవరూ తక్కువ చేయలేరు. కాని సాంకేతిక ఊహా ప్రపంచంగా పిలుస్తున్న అటువంటి అద్భుతాలను సాధించటానికి భారతభూమి ఇంకా సంసిద్ధం కాలేదని గుర్తించాలి. తరాల జీవితాలను ప్రమాదకరమైన పరిస్థితులలోకి నెట్టేముందు, అసాధ్యమైన నినాదాలను ఇవ్వటానికి, ఆకట్టుకొనే హెడ్డింగ్‌లు పెట్టటానికి ముందు నిరంకుశాధికారులు సామాజికంగా ఉన్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.

సాంకేతిక పరిజ్ఞానం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. అది ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేస్తుందా, దిగజారుస్తుందా అన్నది అది ఎవరి అదుపులో ఉంది, దానిని వారు ఎందుకోసం, ఎలా ఉపయోగిస్తున్నారు అన్నదానిపై అధారపడి ఉంటుంది. భారతదేశంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజాస్వామ్యీకరించటానికి చాలా దూరంలో ఉన్నాం. కోట్లాది మంది ప్రజలు దాని పరిధికి వెలుపల ఉన్నారు. కొద్దిమందికే దానిపై అదుపు ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచిది కాదని తరతరాల చరిత్ర, నాగరికతలు రుజువు చేశాయి.

సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడిన భవిష్యత్ ప్రజాస్వామ్యం కోసం దేశంలో హక్కులు లేని కోట్లాది మంది బాలలు బలి పశువులుగా మారాలా? బహుశా సాంకేతిక పరిజ్ఞానం రేపు మానవజాతిని ప్రజాస్వామ్యీకరించవచ్చు. కాని ఎంత కొద్దిసంఖ్యలో అయినప్పటికీ సాంకేతిక పరిజ్ఞానం కోసం ఈ రోజు జీవితాలను బలి చేయకూడదు. ప్రపంచ ఆర్థికవ్యవస్థ, స్వేచ్ఛా మార్కెట్ విధానాల కోసం తీస్తున్న పరుగులో సాధారణమైన అవసరాలను తీర్చుకోవటం కోసం దిగువస్థాయిలోని వారు కనే కలలు కల్లలై పోకూడదు.

అద్భుతమైన సామాజిక సంస్థలైన తరగతి గదులలో గతంలో దేశం యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దితే ఇపుడు అనవమానంగా, సాంకేతికపరంగా సమ్మిళితం కాని, వివిధస్థాయిలలో ఉన్నవారు వివిధ రకాలైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న స్థితిలో, ఆ సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కువ సంఖ్యలో ఉన్నవారు కనెక్ట్ కాలేకపోతున్నారు. అందువలన ప్రజాస్వామ్యాన్ని బలపరచటానికి అవసరమైన విధంగా ప్రజానీకాన్ని అక్షరాస్యులుగా తీర్చిదిద్దలేకపోతున్నామని ఆత్మవిమర్శ చేసుకోవాలి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# భారత జాతీయ కాంగ్రెస్ 36వ వార్షిక సభలు (1921) కోసం కమ్యూనిస్టు పార్టీ రచించిన ప్రణాళిక

(22వ పేజీ తరువాయి)

చేస్తున్నది.

భారతదేశాన్ని పునాదులతో సహా కుదిపేస్తున్న విప్లవోద్యమానికి నాయకత్వం వహించాలని కాంగ్రెస్ భావిస్తే కేవలం ప్రదర్శనలు, అత్యుత్సాహంతో కూడిన కార్యక్రమాలకు స్వస్తి చెప్పాలి. కాన్పూర్ కార్మికులు ప్రతిపాదించిన ట్రేడ్ యూనియన్‌ల తక్షణ డిమాండ్లను, కిసాన్‌సభ ప్రణాళికను కాంగ్రెస్ ఆమోదించాలి. ప్రజలు తగినంత త్యాగాలు చేయనందునే స్వరాజ్యం సాధనకు నిర్దిష్ట తేదీని ప్రకటించలేమన్న కాంగ్రెస్ సణుగుడును ఆపితీరాలి. అపుడు తమ వస్తుగత ప్రయోజనాల కోసం చైతన్యయుతంగా పోరాడుతున్న ప్రజలందరూ దృఢనిశ్చయంతో స్వాతంత్రోద్యమానికి అండగా నిలుస్తారు. అలా చేయడంలో విఫలమైతే ప్రజా సమూహాల నుండే పుట్టి పెరిగి, వారి ప్రయోజనాల కోసమే పోరాడే లక్ష్యంగల వేరొక సంస్థను కాంగ్రెస్ చూడాల్సి వస్తుంది. దేశమంతా తన వెనుక నిలవాలని కోరుకుంటే మైనారిటీ వర్గం ప్రయోజనాలకు కాంగ్రెస్ గుడ్డిగా తలవంచ రాదు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలచే నియమించబడ్డ 'నిపుణులైన న్యాయవాదు'ల అదృశ్య హస్తాల మార్గదర్శకత్వాన్ని వదిలే యాలి. అలాంటి ఎత్తుగడలను అమలుచేస్తేనే పైశాచికమైన బ్రిటీష్ పాలన అంతమౌతుంది.

సహాయ నిరాకరణ నినాదంతో విప్లవశక్తులను కాంగ్రెస్ చెదరగొడుతున్నది. ప్రజలను పెడమార్గం పట్టించేందుకు విప్లవ ప్రతీఘాతకులు రంగ ప్రవేశం చేశారు. సమ్మె వుద్యమం మందగించటంతో కార్మికుల్లో విప్లవ స్ఫూర్తి తగ్గిపోతున్నది. కార్మిక సంఘాలు సంస్కరణవాదుల, దుస్సాహసికుల, ప్రభుత్వ ఏజంట్ల వశమౌతున్నాయి. పేద రైతుల తక్షణ సమస్యలను చేపట్టడం ద్వారా వారిని ఆకర్షించేందుకు కొందరు వ్యక్తుల ప్రయోజనాల కోసం పనిచేసే జేబు సంస్థలు ప్రయత్నిస్తు న్నాయి. ఉద్యమ బలం ఎక్కడుందో ప్రభుత్వానికి తెలుసు. అది ప్రజలను కాంగ్రెస్ నుండి దూరం చేస్తున్నది. అతిరథ మహారథులు తెలివిగా రూపొందించిన విధానాలు, గాలి వాటు పద బంధాలు, భావోద్వేగపరమైన విజ్ఞప్తులు ప్రభుత్వ కుట్రలను ప్రతిఘటించ లేవు. ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టటానికి అందుకు ధీటైన, వివేకవంతమైన పద్ధతులను అవలంభించాలి. ప్రజల చైతన్యాన్ని మేల్కొల్పాలి. వారిని స్థిరంగా పోరాటంలో నిలిపేందుకు ఇదే ఏకైక మార్గం.

దేశ ప్రజలారా! కాంగ్రెస్ ప్రణాళిక హిందు, ముస్లింల ఐక్యతకు ప్రాధాన్యత నిచ్చింది. భారతీయులు అసంఖ్యాకమైన తెగలు, మతాలు, ప్రాంతాలు, కులాల వారీగా చీలి వున్నారు. ఈ చీలికల మధ్య ఐక్యతను నెలకొల్పేందుకు కృత్రిమమైన ఉద్వేగపూరిత ప్రచారాలు పనిచేయవు. భగవంతుడు ప్రత్యేకంగా సృష్టించిన వరప్రసాదం భారతదేశం అని నమ్ముతున్న సనాతన దేశభక్తుల విశ్వాసాన్ని వమ్ముచేసేలా ఒక గొప్పశక్తి ప్రజలను రెండు సజాతీయమైన మహా శిబిరాలుగా విభజించింది. అదే ఆర్థికశక్తి. వారసత్వంగా ఆస్తి పొందని వారిని సంపన్నులు దోపిడి చేస్తున్నారు. ఈ దోపిడి భారతదేశంలో ఉనికిలో ఉన్నది. సామాజిక విభాగాల్లోని అసంఖ్యాకమైన చీలికలను ప్రభావితం చేస్తున్నది. రెండు గొప్ప వర్గాల మధ్య దూరాన్ని మరింతగా పెంచుతున్నది. నిరంతరం పనిచేస్తుండే ఈ శక్తివలన హిందు కార్మికులు, కర్షకులు వారి ముస్లిం కామ్రేడ్స్‌కు మరింత సన్నిహితం అవుతున్నారు. ఇదొక్కటి మాత్రమే హిందు, ముస్లిం ఐక్యతకు కృషి చేస్తున్నది. ఈ సామాజిక, ఆర్థికాంశాలతో కూడిన ఈ శక్తి యొక్క నిలువరించటం సాధ్యం కాని కఠినమైన ప్రస్థానంపై ఆధారపడేవారు గోవును గౌర వించేలా ముస్లింలను ప్రేరేపించాలని విజ్ఞాప నలు చేయనవసరం లేదు. తన ఆత్మకు శాంతి చేకూరటం, భూలోక కష్టాలు తీరటం ఖిలాఫత్‌ను సాధించటంలోనో లేదా ఆర్మీనియన్లను టర్కులు లోబరచుకోవటంలోనో లేదని అమాయకులైన హిందూ రైతాంగాన్ని నమ్మించేందుకు పూనుకొనే అవసరం అంతకంటే లేదు. హిందూ ముస్లిం ఐక్యత భావోద్వేగాలతో సాధ్యం కాదు. ఆర్థికశక్తుల అభివృద్ధితో ఆచరణలో దాన్ని సాధించవచ్చు. ఈ లక్ష్య సాధనపై కేంద్రీకరిద్దాం.

అల్ప సంఖ్యాకవర్గం అభిలాషలను కాక, మెజారిటీ దేశ ప్రజల అవసరాలను కాంగ్రెస్ ప్రతిబింబించి తీరాలి. అది రాజకీయ జూదం లో కాలక్షేపం చేయటాన్ని ఆపాలి. దేశంలోని సామాజిక శక్తుల అభివృద్ధికి అనుగుణంగా స్పందించాలి. విదేశీ దోపిడీని అంతం చేయాల న్న తన కోర్కెను చేతల్లో నిరూపించాలి. అంతేగాని స్థానిక సంపన్న వర్గాల గుత్తాధిత్యాన్ని పటిష్టపరిచేందుకు కాదు. రాజకీయ, ఆర్థిక, సామాజిక దోపిడీ, పీడనల నుండి భారత ప్రజానీకాన్ని విముక్తి చేయాలి. తాను ప్రజల వాస్తవ కోర్కెలకు ప్రాతినిధ్యం వహిస్తూ, వారి పోరాటాల ప్రతి దశలోనూ ముందుండి దారి చూపగలనని కాంగ్రెస్ చాటి చెప్పాలి. అపుడు మాత్రమే అది జాతీయ నాయకత్వాన్ని చేపట్టగలుగుతుంది. కొందరు చపలచిత్తుల ఆకాంక్షలకు అనుగుణమైన ఒక నిర్దిష్టమైన రోజున స్వరాజ్య పోరులో విజయం సాధించటం సాధ్యం కాదు. కానీ ప్రజల చైతన్యవంతమైన నిరంతర కార్యాచరణ ద్వారా మాత్రమే ఆ విజయం సాధ్యమౌతుంది.

**(స్వేచ్ఛానువాదం : వై. సిద్ధయ్య)**

# 'వ్యవసాయ సంక్షోభం కారణాలపై చర్చ జరగాలి'

(26వ పేజీ తరువాయి)

వ్యవసాయదారులుగా మేము ఈ నేలని సిద్ధం చేసి నిజమైన మార్పు విత్తనాలు నాటాము అని చెప్పవచ్చు.

ప్రభుత్వం నిరసన యొక్క చూడి తగ్గించాలని చూసింది. వాళ్ళకి తెలిసిన అన్నీ కుయుక్తులు ప్రయోగించారు, కానీ విఫలం అయారు.

నేను ఈ మధ్య లఖింపూర్ వెళ్ళాను. అక్కడ రైతులు నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. నేను వారినుద్దేశించి ప్రసంగిస్తూ 'మీరు సత్యం గురించి పోరాడుతున్నప్పుడు, అది సరైనది అయినప్పుడు ఈ విశ్వమే మీకు సహకరిస్తుంది' అని అన్నాను.

రైతులని తొక్కించిన వాళ్ళు గుద్దేసి, పారిపోదామను కున్నారు, కానీ అకస్మాత్తుగా వచ్చిన బస్ వాళ్ళ పన్నాగాలను అడ్డంగొట్టి వాళ్ళ దౌర్భాగ్య ప్రయత్నాన్ని బయట పెట్టింది. దేశం, ప్రపంచమంతా రైతుల తరపున కల్పించుకుంది.

మన రైతు నాయకులు తెలివైన నిర్ణయాలు తీసుకోటం నేర్చుకున్నారు. వారు ఇలానే కొనసాగిస్తూ అధికారంలో ఉన్నవారిపై ఎలా ఒత్తిడి తీసుకురావాలో కూడా నిర్ణయించుకుంటారు అని నమ్ముతున్నాను. దానితో పాటే గ్రామస్థులు బలోపేతం కావటం కొనసాగించటం కూడా చాలా ముఖ్యమైనది.

**(అనువాదం: కురెళ్ళ పుష్పవల్లి)**

# రైతాంగంలో పార్టీ కర్తవ్యాలు

(2వ పేజీ తరువాయి)

వ్యవసాయ కార్మికులు, పేదరైతులపైనే వ్యవసాయోద్యమం ఆధారపడి ఉంటుంది; వీరు మధ్యతరగతి రైతాంగంతో దృఢమైన మైత్రిని నెలకొల్పుకొని, ధనిక రైతులను కూడా భూస్వాములకు వ్యతిరేకంగా కూడగట్టి, కార్మికవర్గం, పట్టణాలలో ప్రజాతంత్ర ఉద్యమంతో సన్నిహిత సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలి.

"కౌలు తగ్గించాలని, నిర్దిష్ట కాలం కౌలు ఉండాలని, భూమి కోసం చేసే డిమాండ్‌లను సాధించాలంటే పేద, మధ్యతరగతి, ధనిక రైతాంగానికి వ్యవసాయ కూలీల ప్రత్యక్ష మద్దతు, భాగస్వామ్యం లేకుండా సాధ్యం కాదు.

"మౌలిక డిమాండ్ అయిన భూమితో సహా వ్యవసాయ కార్మికుల తక్షణ డిమాండ్లన్నింటిని పార్టీ, రైతాంగ ఉద్యమం ముందుకు తీసుకురావాలి. ఈ విధంగా వ్యవసాయ కార్మికుల డిమాండ్లను తీసుకోవటం ద్వారా మాత్రమే వారిని భూస్వాములు, పాలక వర్గానికి వ్యతిరేకంగా భూమి, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, శాంతికోసం జరిగే ఉద్యమాలతో మమేకం చేయగలం. ఇలా చేయడంలో విఫలమైతే ఈ తరగతులు మతతత్వ, విచ్ఛిన్నకర, ప్రతిఘాత సంస్థల వైపుకు మరలే ప్రమాదముంది. అంతేకాదు, కులం, దోపిడి, అణచివేత, ఇతర అంశాల ఆధారంగా గ్రామాలలోని ఇతర రైతులకు వ్యతిరేకంగా మారే అవకాశాలు కూడా ఉన్నాయి.

వ్యవసాయ కార్మికుల తక్షణ డిమాండ్లలో కొన్ని:

1. కనీసం 5 ఏళ్ళపాటు ఎటువంటి ఛార్జీలు లేకుండా వ్యవసాయ కార్మికులను బంజరు భూములు దున్నుకోనివ్వాలి; పశువులు, ఇతర వ్యవసాయ సామాగ్రి కొనుగోలు చేయడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని గ్రాంట్లు, దీర్ఘకాల రుణాల రూపంలో అందచేయాలి.

2. ఉచితంగా ఇళ్ళస్థలాలు ఇవ్వాలి. గ్రామంలోని ఉమ్మడి భూములను అందరితో సమానంగా వినియోగించుకునే హక్కు ఉండాలి; ఉన్న ఇళ్ళస్థలాల నుండి గాని, ఇళ్ళ నుండి గాని వెళ్లగొట్టకూడదు.

3. భూస్వాములు, వడ్డీ వ్యాపారులు ఇచ్చిన అప్పులను రద్దు చేయాలి; తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పించాలి.

4. కులం, అంటరానితనం వంటి సామాజిక వ్యత్యాసాలను తొలగించాలి.

5. వెట్టిచాకిరిని నిర్మూలించాలి. వెట్టిచాకిరి చేయించటాన్ని శిక్షార్హం చేయాలి.

6. ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యాన్ని అందించాలి.

7. ప్రభుత్వం సాగునీరు అందించటం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించాలి.

8. పొలాలలో కూలి చేసుకునే వారికి, పాలేర్లకు కనీస వేతనాలు నిర్ణయించాలి.

9. ప్రస్తుతం పాలేర్లు చేస్తున్న అదనపు పనిగంటలను తగ్గించాలి. ఏడాదిలో కొద్ది రోజులైనా వేతనాలతో కూడిన సెలవులు ఇవ్వాలి.

"వ్యవసాయ కూలి, అతని కుటుంబం ఆ రోజుకైనా కనీస అవసరాలు తీర్చుకొనే విధంగా కనీస వేతనం నిర్ణయించాలి. ఈ కనీస వేతనం సాధారణ పనిదినానికి వర్తించేది. కానీ పనులు ముమ్మరంగా ఉన్న రోజులు, కఠినమైన పనులు చేయవలసిన రోజులలో అధికవేతనం ఇవ్వాలి. వ్యవసాయ కూలి రోజు వేతనానికి 365 రెట్లు పాలేరు సంవత్సర వేతనం ఉండాలి.

"మిగిలిన అన్ని సమస్యలకన్నా వ్యవసాయ కూలికి ఉపాధి అతి పెద్ద సమస్య. "పని లేదా నిరుద్యోగ భృతి' డిమాండ్‌ను పార్టీ ప్రధానంగా తీసుకోవాలి.

"వ్యవసాయ కూలీలను రైతాంగంతో కలవకుండా స్వతంత్ర సంఘాలలో సంఘటితం చేయాలి. ఎందుకంటే, 1.వారికి తమకంటూ ప్రత్యేకమైన వేతనం, పనిగంటలు, సెలవులు వగైరా డిమాండ్లు ఉన్నాయి. 2. వ్యవసాయ కూలీలలో అత్యధికులు సామాజికంగా వెనుకబడిన తరగతులకు, 'అంటరాని కులాలకు' చెందిన వారు; వారిని ప్రత్యక్షంగా కిసాన్ సభ ద్వారా, రైతాంగంతో కలిపి సంఘటితం చేయడం సాధ్యపడదు. ఒకవేళ వారిని కిసాన్ సభ ద్వారా ఆకర్షించగలిగినా రైతాంగంలోని చాలామంది కిసాన్ సభకు దూరం కావచ్చు. 3. వ్యవసాయ కార్మికులను వేరుగా సంఘటితం చేయడం వలన వారు పెద్ద శక్తిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయి; అదే సమయంలో వారిని కిసాన్ సభలోకి తీసుకురావచ్చు.

"వడ్రంగి, కుమ్మరి, కమ్మరి, చాకలి వగైరా పనులు చేసే ఆ ప్రాంతంలోని వేతనజీవులను కూడా వ్యవసాయ కార్మికసంఘంలో చేర్చవచ్చు.

"వ్యవసాయ కార్మికుల, రైతాంగం ఉమ్మడి డిమాండ్, అతి ముఖ్యమైన డిమాండ్ కూడా భూమే; భూస్వాములకు వ్యతిరేకంగా, ఇద్దరి ఆర్థిక అవసరాలు ఒకటే; కాబట్టి ఉభయ సంఘాల మధ్య ప్రతిస్థాయిలోనూ సన్నిహిత సహకారం ఉండేందుకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలి; మరింత సన్నిహితంగా ఉండే ఉమ్మడి కార్యాచరణను రూపొందించు కోవాలి; ఇందులో వ్యవసాయ కూలీలు, పేద రైతులు నాయకత్వ పాత్ర పోషించాలి.

"కిసాన్ ఉద్యమం యొక్క ప్రధానమైన కర్తవ్యాలలో ఒకటి – భారతదేశ, విదేశీ గుత్తపెట్టుబడిదారుల కుయుక్తుల నుండి రైతాంగాన్ని కాపాడి, వారి ఉత్పత్తులకు మద్దతు ధరలు ఇవ్వాలని మనం ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి.

" రైతుల ఉత్పత్తులకు మద్దతు ధరలకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని, మద్దతు ధర కన్నా మార్కెట్‌లో తక్కువగా ఉన్నప్పుడు ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలనేది మనం డిమాండ్‌గా ఉండాలి.

''కరువు కాటక ప్రాంతాలలో ప్రభుత్వం 1.ఆహార ధాన్యాలను చౌకగా ప్రజలకు అందించటానికి డిపోలను తెరవాలి. ఉచిత వంటశాలలు ఏర్పాటు చేయాలి 2. కఠినమైన పనులు, కర్తవ్యాలు, వేతనాలకు సంబంధించి కరువు నిబంధనలను సరళీకరించాలి. 3. కరువు ప్రాంతాలలో రాళ్ళు కొట్టడం, రోడ్లు వేయడం, ఇతర రక్షిత పనులేకాక సహాయక చర్యలలో భాగంగా ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఉత్పత్తికి సంబంధించిన పనులు కూడా చేపట్టాలి; 4. కరువు ప్రాంతాలలో అప్పుల వసూళ్లు నిలిపివేయాలి. కౌలు, భూమిశిస్తు వసూళ్ళను తగ్గించాలి. 5. పశువుల దాణాను సరఫరా చేయాలి. 6. వ్యవసాయానికి అవసరమైన తక్కావి అప్పులు ఉదారంగా ఇవ్వాలని డిమాండ్ చేయాలి.

"అదే సమయంలో మనం ఇతరులతో కలిసి కరువు సహాయక కమిటీలు ఏర్పాటు చేయాలి. కిసాన్‌సభ, వ్యవసాయ కార్మిక సంఘాల సభ్యులు సహాయ కార్యక్రమాలు, పరిశీలనలు నిర్వహించే పనులు, చౌకధరల దుకాణాల పనులలో భాగస్వాములై అవినీతికి స్థానం లేకుండా, సమర్థవంతంగా పనిచేయించాలి.

"వెంటనే అప్పుల వసూళ్లు నిలిపి వేయాలని, పాత అప్పుల వసూళ్లను నిలిపి వేస్తూ శాసనసభలలో చట్టం చేయాలని ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలి.

"సహకార సంఘాలు సర్వసాధారణంగా పెద్ద భూస్వాముల, ధనిక రైతుల అధీనంలో ఉంటాయి. కిసాన్ ఉద్యమం బలహీనంగా ఉన్న ప్రాంతాలలో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే ప్రభుత్వాలు సహకార సంఘాలకు ఇస్తున్న సదుపాయాలను తెలుసుకోకుండా ఉండకూడదు. ప్రభుత్వాలు

సహకార సంఘాలకు వివిధ రకాల రాయితీలను అందచేస్తుంటాయి. ఈ విధమైన సహకార సంఘాల ద్వారా సహకార ఉద్యమాన్ని బలోపేతం చేసి నిజమైన సహకార సమాజం ఈ విధంగా సాధ్యపడుతుందనే భ్రమలను కల్పించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తుంటాయి. కానీ మనం ఈ భ్రమలకు లోను కాకుండా సహకార ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలి; వ్యవసాయ కార్మికులు, పేద, మధ్యతరగతి రైతుల అవసరాలను తీర్చే విధంగా వాటిని ఉపయోగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. సహకార సంఘాలలోని అవినీతికి వ్యతిరేకంగా, మరిన్ని ప్రజాస్వామ్య హక్కులు కావాలని మనం పోరాటం చేయాలి.

"వివిధ రకాల పన్నుల భారాన్ని తగ్గించాలని, క్రమానుగత పన్నులను విధించాలని డిమాండ్ చేయాలి. రైతులపై కొత్తగా పన్నులు వేయడానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని, ప్రతిఘటనను తీవ్రం చేయాలి;

"గిరిజన ప్రాంతాలలో గ్రామానికి మైలు దూరంగా రిజర్వు సరిహద్దు ఉండాలి. రిజర్వ్‌డ్‌గా గుర్తించి, అడవులు లేని ప్రదేశాలను సేద్యానికి ఇవ్వాలి. పోడు సేద్యానికి ఉదారంగా అనుమతులు ఇవ్వాలి. గిరిజన ప్రాంతాలలో పంచాయతీలు ఏర్పాటు చేయాలి. ఆటవీ ఉత్పత్తులను వినియోగించుకునేందుకు, విక్రయించుకునేందుకు గిరిజనులకు స్వేచ్ఛ ఇవ్వాలి. గిరిజనులు చెట్లు కొట్టి అమ్ముకొనే చోట సహకార సంఘాలను ఏర్పాటుచేయాలి.

"గిరిజన ప్రాంతాలలో అన్నిరకాల భూస్వామ్య పద్ధతులను నిషేధించాలి; పాత రుణాలు మాఫీ చేయాలి.

"కాంట్రాక్టర్లు చేసే అన్ని రకాల దోపిడీలను అదుపుచేయాలి; గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులకు తగిన ధర చెల్లించాలి; వారికి తగిన కూలీ చెల్లించాలి.

"గిరిజన ప్రాంతాలలో ఉచిత మందుల పంపిణీ జరగాలి; ఆరోగ్య అధికారులు గిరిజన ప్రాంతాలు పర్యటిస్తుండాలి; గిరిజన ప్రాంతాలలో సంభవించే ప్రత్యేకమైన రోగాల నిరోధానికి, వైద్యానికి ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలి; నూతులు, చెరువులలోని తాగునీటిని శుద్ధిచేయాలి. మలేరియా వంటి వ్యాధుల నివారణకు కృషి చేయాలి.

"పశువులు అంటు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి; పశువైద్యం కోసం పశువుల వైద్యులు గిరిజన ప్రాంతాలలో పర్యటిస్తుండాలి."

"గిరిజన ప్రాంతాలలో ప్రత్యేకమైన విద్యాసౌకర్యాలు ఉండాలి; వారి భాషలో విద్య నేర్చుకునే అవకాశాలు ఉండాలి; స్కూల్‌కి అవసరమైన సరంజామాను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలి; వయోజనులకు రాత్రి బడులు తెరవాలి; సెకండరీ, విశ్వ విద్యాలయాలలో చదువుకునేందుకు స్కాలర్ షిప్పులు మంజూరు చేయాలి. గిరిజనులలో చదువుకున్నవారికి ఉపాధ్యాయ శిక్షణ ఇవ్వాలి.

'అనేక సందర్భాలలో ప్రాజెక్టులు పూర్తికాక మునుపే రైతులు సాగుచేస్తున్న భూములపై ఎకరాల లెక్కన అభివృద్ధి పన్ను విధించటానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. పేద, మధ్య తరగతి రైతులను అప్పులపాలు చేసే అభివృద్ధి పన్నును ప్రతిఘటించాలి.

"ప్రభుత్వ విధానాలను విమర్శించేటప్పుడే కాదు, నిర్మాణాత్మక కార్యక్రమాలైన కరువు, వరద సహాయక చర్యలు, ఆహార పంపిణీ, రైతు సహకార

# బ్రిటీష్ వలసపాలనకు నకలు మోడి పాలన

(24వ పేజీ తరువాయి)

చేస్తారు. అయితే నిజం ఏమిటంటే 19వ శతాబ్దానికి ముందు ఉనికిలో లేని హిందూ మెజారిటీ అనే కృత్రిమ వర్గాన్ని ఉద్దేశపూర్వక ప్రచారంతో, రాజకీయ కల్పన ద్వారా సృష్టించారు. ఈ దృక్కోణంలో చూస్తే తక్కువ సంఖ్యగల శ్వేత పాలకుల నిర్బంధ పాలన రీతిలో కట్టుకథలతో సృష్టించబడిన హిందుత్వ కొద్దిమందిగా ఉన్న బ్రిటీష్ సెటిలర్ వలసవాదులు పూర్తి చేయలేని ఊహాస్వర్గాలను పరిపూర్తి చేస్తుంది. కనుకనే ఇప్పుడు భారతీయ వలసవాదులు కల్పిత హిందూ మెజారిటీ పేరిట మాట్లాడుతున్నారు.

ఇక్కడ ప్రతిపాదించబడిన సారూప్యత ఏదైనా ఉన్నట్లయితే ఇది భారీ, అసాధారణమైన సెంట్రల్ విస్టా ప్రాజెక్టుకు కూడా వర్తిస్తుంది. సుదీర్ఘకాలం సామ్రాజ్యవాద మూలాలున్న జాతీయ రాజధానిలో ఇది పునరుజ్జీవనోద్యమ భారతదేశం పేరిట గాంధీ, నెహ్రూలను వీలైనంత తక్కువ చేసేందుకు వీలుగా సౌత్–బ్లాక్‌లో రూపొందించిన దృక్పథంతో లుటియన్స్ ఢిల్లీని పాతిపెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఢిల్లీ అంతమైపోయినప్పటికీ నూతనంగా నిర్మించబడుతున్న ఢిల్లీ నిర్మాణం హిందూ నిర్మాణకౌశలానికి ప్రతీకగా ఉండదు. బిమల్ పటేల్, అతని పోషకుల దృక్పథంలో ఉన్న 17, 18 శతాబ్దాలలోని యూరప్‌లోని నిర్మాణాలు, కళలను పోలివుంటుంది. ఇది చట్టం, చరిత్ర, పర్యావరణం, సౌందర్యంతో పాటు ప్రజల సార్వభౌమాధికారాన్ని ధిక్కరించటం అవుతుంది. లూటియన్స్ కంటే చాలాకాలం ముందు దశాబ్దాలలోనే సామ్రాజ్యవాద మూలాలు ఉన్నాయనే దానిని అది అంగీకరించదు. 1920 వరకు బ్రిటిష్ రాజ్ ఇది "శాశ్వతమనే భ్రాంతి" లోనే ఉంది.

అయినప్పటికీ, ప్రతి రాజ్యానికి దాని సంధ్యాకాలం ఉంటుంది పంజాబ్, హర్యానా పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని రైతులు ఈ రాజ్యానికి దాని సంధ్యాకాలం గురించి తెలియజేసారు. గుజరాత్ నుంచి వచ్చిన పాలకుల ఆదేశాలతో వెనక్కు మళ్లేందుకు నిరాకరించి, ఇంకా ఇంటికి వెళ్ళని సిక్కుల నేతృత్వంలోని రైతులు వలసవాద–వలసవాదం కింద అవమానించబడుతున్న యాభై కోట్లమంది భారతీయుల (దళిత, ముస్లిం మరియు ఆదివాసీ) సాక్షిగా ధైర్యమైన సమాధానమిచ్చారు. మోదీ పాలనలో దక్షిణాదిలో ఎక్కువ భాగం తన స్వరానికి అనుగుణంగా నృత్యం చేస్తుండగా, ఈశాన్య ప్రాంతాన్ని లొంగదీసుకోవడానికి భారీ సైనిక బలం అవసరం అవుతున్నది. రాజస్థాన్, మహారాష్ట్ర పంజాబ్‌లు బిజెపి నియంత్రణలో లేవు. మమతా బెనర్జీ కొత్త ప్రతిపక్ష ఛత్ర రూపకల్పనలో ఉన్నది. ప్రస్తుత ప్రభుత్వం భద్రతతో కూడిన లుటియన్స్ ఢిల్లీని మాత్రమే పరిపాలిస్తున్నది. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ వారి స్మారక చిహ్నం, కానీ రేపు కాకున్నా సమీప భవిష్యత్‌లో అది వారి సమాధిగా మారవచ్చు. అందుకోసమే ఏ మాత్రం జవాబుదారీతనం లేకుండా రూ.25,000 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

అవును, మనం 2021లో ఉన్నాం. అవును, మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామం 1857లో జరిగింది. అవును, మోడీ హోలోగ్రామ్‌లు, ఆధార్ కార్డ్‌లు, స్టార్ట్–అప్, వెంచర్ క్యాపిటల్ తదితర కొత్త బోన్లు అన్నీ మన చుట్టూ ఉన్నాయి. కానీ బ్రిటీష్ వారిలాగే మనల్ని పాలించే పాలన పూర్తిగా పరాయిది. రెండవ స్వాతంత్ర్య పోరాటం మాత్రమే దానిని మోకరిల్ల చేయగలుగుతుంది. ఈ యుద్ధంలో ఢిల్లీ సరిహద్దుల్లోని రైతులే మనకు అగ్రశ్రేణి పోరాటయోధులు.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

సంఘాలు, గ్రామీణ బ్యాంకులు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించే సంస్థల ఏర్పాటు, పంచాయితీలు, స్కూళ్ళు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వ్యవసాయ పరిశోధనా కేంద్రాల నిర్మాణం మొదలైన అన్ని విషయాలలో పార్టీ, కిసాన్ ఉద్యమం ముందుండి పనిచేయాలి.

'నిర్మాణాత్మక కార్యక్రమాలను చులకనగా చూడడం, రైతుల, ప్రజల దృష్టి నుండి ఈ కార్యక్రమాలను పరిశీలించకుండా వాటిని' కేవలం 'సంస్కరణలు' అంటూ తీసిపారేసే అలవాటు మానుకోవాలి. ఇటువంటి కార్యక్రమాలన్నీ కాలక్రమంలో 'సంస్కరణవాదాని' కి దారి తీస్తాయని, వాటిపై రైతులలో మనం 'భ్రమలు' కల్పించిన వారమవుతామనే ఆలోచనలను వదులుకోవాలి. భూస్వాములకు వ్యతిరేకంగా జరిగే ఇటువంటి ప్రజా సంఘాల నిర్మాణంతోనే ప్రజలకు చేరువకాగలం; వారి డిమాండ్ల సాధనకు, భూస్వాములకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిపే ఉద్యమాలలో ప్రజలను భాగస్వాములను చేయగలం.

" వ్యవసాయ విప్లవం కోసం లక్షలాది మంది రైతులను, వ్యవసాయ కార్మికులను సమీకరించటం కోసం క్రమబద్ధంగా, నిర్మాణాత్మకంగా చేసే కృషి ద్వారానే సైద్ధాంతిక పోరాటం, ఐక్య సంఘటన నిర్మాణం కోసం జరిగే కృషి కూడా బలపడుతుంది.

"అన్ని రైతు సంఘాలతో కలిపిన ఉమ్మడి కమిటీలు ఏర్పాటు చేసి, రైతుల ప్రత్యేక సమస్యలన్నిటిపై ఇవి పోరాటాలు చేయాలని , అప్పుడు మాత్రమే రైతులందరూ ఐక్య నిర్మాణం వెనుక సమీకరణ అవుతారని దిగువ కమిటీలకు స్పష్టం చేయాలి.

మొత్తం రైతాంగ విశాల ఐక్యత సాధించటానికి భూస్వాముల – సామ్రాజ్యవాదుల దోపిడికి వ్యతిరేకంగా పోరాటం చేయటం అత్యంత ముఖ్యమైన కర్తవ్యం.

" భారతదేశ గుత్తపెట్టుబడిదారుల, భూస్వాముల, సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగాన్నంతటిని ఐక్య పరచడానికి, ముఖ్యంగా వ్యవసాయ కార్మికులను, ధనిక రైతులను ఏకతాటిపై నడపడం అత్యంత కీలకం. ఎప్పటికప్పుడు ప్రాధాన్యతలు మార్చుకుంటూపోవడం, ప్రణాళికబద్ధంగా కాకుండా ఆకస్మిక నిర్ణయాలు తీసుకోవడం, సమస్యను అన్ని వైపుల నుండి క్షుణ్ణంగా పరిశీలించకపోవడం వలన వ్యవసాయ కార్మికుల సమస్యలు అశ్రద్ధ చేయబడ్డాయి. వారి డిమాండ్లు, పోరాటాలు పక్కకిపోయాయి; లేదా రైతాంగంతో వారికున్న వైరుధ్యాలు ఉమ్మడి శత్రువైన భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా చేసే పోరాటాలను పలచన చేశాయి. వ్యవసాయ కార్మికుల సమస్యలను అశ్రద్ధ చేయడమే ఇప్పటికీ రైతాంగ ఉద్యమం బలహీనంగా ఉండడానికి కారణం.

బలమైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాలంటే రైతులు, వ్యవసాయ కార్మికుల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థాయిని పెంచే కార్యక్రమాలు తీసుకోవాలి. వారికి విద్య నేర్పటానికి, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సహాయ కార్యక్రమాలు, పరస్పర సహాయక సంస్థల ఏర్పాటు, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలి. ప్రజారోగ్య శిబిరాలను నిర్వహించాలి; వారిని నైతికంగా ఉన్నతంగా నిలిపే కార్యక్రమాలు నిర్వహించాలి.

"రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల కార్యాలయాలు పనిచేస్తుండాలి. కార్యకర్తలు ప్రతిరోజూ కలుసుకుని భూస్వాముల నుండి, ప్రభుత్వ అధికారుల నుండి, ఇతర ప్రభుత్వ సంస్థల నుండి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించుకోవాలి; వారికి చట్టపరమైన ఉపశమనం కలిగించాలి; ఆధునిక వ్యవసాయ పద్ధతులు వారికి నేర్పి ఉత్పత్తి పెంచుకునేందుకు సహకరించాలి; వారి పంటలకు హాని కలిగించే క్రిమి సంహారక విధానాలు తెలియచేయాలి; పశుపోషణ విధానాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, పంటలకు అవసరమైన సమయానికి నీరు పెట్టటం తదితరాలను వారికి వివరించాలి. రైతుల నిత్య జీవనానికి అవసరమైన సమస్యల గురించి తెలుసుకొని వాటికి పరిష్కారాలను సూచించాలి.

"ఒక్క మాటలో చెప్పాలంటే కిసాన్ సభ, వ్యవసాయ కార్మిక సంఘాలు రైతుల జీవితాలలో ఒక భాగంగా ఉండాలి; వారికి నిరంతరం సలహాలు, సూచనలు ఇవ్వాలి.

"రైతాంగ పోరాటాలు సఫలం కావాలంటే వారికి కార్మిక సంఘాల మద్దతు ఉండాలి. ఇక్కడే మన పార్టీ విఫలం అవుతున్నది. మనం కార్మికులలో రైతాంగం యొక్క డిమాండ్లను ప్రచారం చేయలేకపోయాం. రైతాంగానికి మద్దతుగా కార్మిక సంఘాలు సాధారణ సమ్మె చేయడం కాదు కదా కనీసం సమావేశాలు, ప్రదర్శనలు ఏర్పాటు చేసేటట్టు కూడా చేయలేకపోయాం.

"అలాగే పార్టీ కార్మికుల డిమాండ్లను, పోరాటాలను కూడా రైతాంగంలో ప్రచారం చేసి వారి పోరాటాలు, డిమాండ్లకు రైతాంగ మద్దతు పొందాలి. ఆ విధంగా చేసినప్పుడే కార్మిక, కర్షక ఐక్యతను సాధించగలుగుతాం. ఆ ఐక్యతే నిస్సందేహంగా అంతిమ విజయాన్ని సాధించి పెడుతుంది.

"కార్మికవర్గంలోని పార్టీ కార్యకర్తలను పక్కనే ఉన్న గ్రామప్రాంతాలకు పంపించి రైతాంగ ఉద్యమాన్ని నిర్మించేందుకు కృషిచేయాలి.

" యుద్ధోన్మాదులైన అమెరికన్ సామ్రాజ్యవాదులు తమ జూనియర్ భాగస్వాములైన బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో కలిసి మూడో ప్రపంచ యుద్ధం కోసం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా పార్టీ, రైతు ఉద్యమం కలిసి రైతాంగాన్ని చైతన్యపరచాలి.

" పార్టీ కార్యక్రమాన్ని, ప్రజలకు సేవ చేయడంలో, ముఖ్యంగా రైతాంగానికి అచంచల విశ్వాసంతో సేవ చేసే దాని విధానాలను ప్రజలలో ప్రచారం చేయాలి. రైతాంగం, వ్యవసాయ కార్మికుల నుండి నిరంతరంగా పార్టీలోకి కొత్తవారిని తీసుకురావాలి; మరోవైపు మధ్య తరగతి, మేధావి వర్గం నుండి వచ్చిన కార్యకర్తలను రైతాంగంలో పనిచేయటానికి పంపాలి. అలా చేయడం వలన మాత్రమే మన తక్షణ కర్తవ్యమైన లక్షలాది మంది రైతాంగం, వ్యవసాయ కార్మికులతో సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణాత్మక సంబంధాలను ఏర్పాటు చేసుకోవటంలో విజయం సాధించగలుగుతాము.

"పార్టీ, రైతు ఉద్యమం కూడా మహిళా రైతులు కిసాన్ సభలో చేరేటట్టు, వాటి కార్యక్రమాలలో నిరంతరంగా పాలు పంచుకునేటట్టు చూడాలి. మహిళల డిమాండ్లపై, ముఖ్యంగా రైతు స్త్రీల డిమాండ్లను రూపొందించటంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి; ఆ డిమాండ్లపై పోరాటానికి అవసరమైన ప్రయత్నాలు చేయాలి. మహిళా రైతు కార్యకర్తల విద్య పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

మనం చాలా అంశాలలో ఉద్యమం కంటే వెనకబడి ఉన్నాము. వివిధ అంశాల పట్ల స్పష్టత లేకపోవడం అందుకు ఒక కారణం. రైతాంగం వివిధ తరగతులుగా విభజన కావడం, వలసవాద కాలంలో భారతదేశ వ్యవసాయ ఆర్థిక విధానాలు, వ్యవసాయ రంగంలో ఈ మధ్యకాలంలో జరుగుతున్న అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవసాయ చట్టాల దిశ తదితరాలను కిసాన్‌సభ నాయకులతో చర్చించి కేంద్రకమిటి అధ్యయనం చేస్తుంది.

"గ్రామ సంఘం, లేదా గ్రామ కిసాన్ సభ సజీవంగా ఉండాలి; సదా కార్యక్రమాలు చేస్తూ ఉండాలి. రోజువారీ పనిలో, పోరాటాలలో ముందుండాలి. ఇప్పటి వరకు ఇవి నామ మాత్రంగానే ఉంటున్నాయి. వాటిని నిర్మించడం, క్రియాశీలంగా పని చేయించడం కీలక కర్తవ్యాలలో ఒకటి.

**(అనువాదం: కె ఉషారాణి)**

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume: 16, issue : 8 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Ra. 10/- Total Pages : 36



# సామాజికాభివృద్ధి: వెనుక సీటులో భారత్

శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న భారత దేశం ప్రజల సామాజికాభివృద్ధిలో బాగా వెనుకబడిపోయిందని అంతర్జాతీయ సంస్థ, సోషల్ ప్రోగ్రెస్ ఇంపెరేటివ్ తెలిపింది. ఆర్థిక రంగంలోనే కాకుండా సామాజిక, వాతావరణ పరమైన రంగాలకు చెందిన 54 రకాల సూచీల ఆధారంగా ఈ సంస్థ ప్రపంచ దేశాల సామాజికాభివృద్ధి ర్యాంకింగ్స్‌ను తయారు చేసింది. నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్, డగ్లస్ నార్త్, జోసెఫ్ స్టిగ్లిడ్జ్‌ల రచనల ఆధారంగా ఈ సంస్థ ప్రపంచ దేశాలను అంచనా కట్టింది. ప్రపంచంలోని మొత్తం 163 దేశాలను సంస్థ పరిశీలించింది. అందులో భారత దేశం 117 స్థానంలో ఉంది. పొరుగున్న శ్రీలంక (64), మాల్దీవులు (78), భూటాన్ (91), నేపాల్ (114) ర్యాంకింగ్స్‌తో ముందున్నాయి. దక్షిణాసియాలో మనకన్నా పాకిస్తాన్  (141), బంగ్లాదేశ్ (123) మాత్రమే వెనుకబడి ఉన్నాయి.

నార్డిక్ దేశాలైన నార్వే (1), డెన్మార్క్ (20, ఫన్‌లాండ్ (3), స్వీడన్ (5)లు మొదటి 5 స్థానాల్లో ఉన్నాయి. సామ్రాజ్యవాద అధిపత్యంతో ప్రపంచాన్ని దోచుకు తింటున్న అమెరికా 28 స్థానంలో, బ్రిటన్ 20వ స్థానంలోనూ ఉన్నాయి. సోషలిస్టు దేశాలు కొంత మెరుగైన స్థితిలో ఉన్నాయి. క్యూబా 78వ స్థానంలో, వియత్నాం 88వ స్థానంలో, చైనా 100వ సానంలో ఉన్నాయి.

మూడు అంశాలను ప్రధానంగా తీసుకుని సామాజికాభివృద్ధి సూచీ తయారు చేశారు. మొదటిది, ఆయా దేశాల్లో ప్రజల మౌలిక జీవనావసరాలు ఎంతమేరకు తీరుతున్నాయి. రెండవది, ప్రజల అభివృద్ధికి తగిన పునాదులు ఆ దేశాల్లో ఉన్నాయా, మూడవది, ఆ దేశాల్లో ప్రజలకు లభిస్తున్న అవకాశాలేమిటి. ఈ మూడు అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలించినప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అయిదో స్థానంలో ఉన్న భారత దేశం ప్రపంచ దేశాల్లో 117 స్థానంలో నిలబడింది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా రూ. **120** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు........................................................

వీధి...........................................................................

గ్రామం ......................................................................

మండలం లేదా పట్టణం ......................................

జిల్లా............................................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao,